4-12Pg1exHMNWJQE 1 VJA_04-12Pg1exHMNWJQE.qxd 04/Dec/25 12:12 AM Page 1

సామాజిక గతి నారంభుల పై విశ్లేషణ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

కపిల్ చిట్స్‌తో బంధం ఆనందాల అనుబంధం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
45 years
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

4-12-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 303 పేజీలు: 12 వెల: 6.50

# సాగు మేలుకు పంచసూత్రాలు

**అంతరపంటలతో అధికాదాయం**

**విద్యుత్ ఛార్జీలు పెంచే ఉద్దేశం లేదు**

**ఆహార అలవాట్లకనుగుణంగా సాగు పద్ధతులు**

**నల్లజర్ల 'రైతన్నా.. మీకోసం'లో సిఎం చంద్రబాబు**

**ఉత్తమ రైతులకు సన్మానం చేసిన సిఎం**

**విజయవాడ/దేవరపల్లి(నల్లజర్ల), డిసెంబరు 3 ప్రభాతవార్త:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, అన్నదాతకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళుతోందని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పంచసూత్రాలపై అవగాహన కల్పించేందుకే "రైతన్నా...మీకోసం" కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి రైతు కుటుంబం అభివృద్ధి చెందడమే లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో "రైతన్నా...మీ కోసం" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. అంతకముందు అక్కడి రైతులు సాగు చేస్తున్న అంతర్ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "వ్యవసాయమే మన బలం. రాష్ట్రంలో 62శాతంమంది వ్యవసాయ, అనుబంధ రంగాలపైన ఆధారపడి జీవిస్తున్నారు. అందుకే సాగును లాభసాటి చేసేందుకు మొదటి రోజు నుంచి ప్రయత్నిస్తున్నామని" ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టాలి**

"మనది వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. వ్యవసాయం లాభసాటిగా మారాలి. రైతుకు గిట్టుబాటు ధర రావాలి. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలపైనా దృష్టి పెట్టాలి. అలాగే భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారలో కలుపుతాం. పెన్నాకూ తీసుకెళతాం. ఈ ఏడాది 7 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి పోయింది. కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు సముద్రంలోకి పోయింది. ఇందులో 200 టీఎంసీల నీరు మనం వాడుకోగలిగితే కరువు అన్నమాటే వినపడదు" అని సీఎం అన్నారు.

**కృష్ణాగోదావరి అనుసంధానంతో ప్రతి ఎకరాకు నీళ్లు**

"భూమినే జలాశయంగా చేసి భూగర్భ జలాలు పెంచుకోగలిగితే కరువు ఉండదు. పోలవరం రైట్ కెనాల్ నుంచి నీరు ఇస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. రాష్ట్రమంతటా డిసెంబర్1 నాటికి 6.8 మీటర్ల భూగర్భ జలాలు రాగా తూర్పుగోదావరి జిల్లాలో 18 మీటర్లు ఉన్నాయి. అందుకు ఇక్కడున్న భూమే >>2



బుధవారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో 'రైతన్నా...మీ కోసం' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



బుధవారం నెల్లూరులో కురిసిన భారీ వర్షాలకు జలమయమైన రోడ్లు

## ఎడతెరిపిలేని వాన

### దిత్వా తుఫాన్ ప్రభావంతో మునిగిన నెల్లూరు నగరం

### జల దిగ్బంధంలో కాలనీలు

**నెల్లూరు, డిసెంబరు 3, ప్రభాతవార్త (వైద్యం):** దిత్వా తుఫాన్ నెల్లూరును నిండా ముంచింది. తుఫాన్ ప్రభా వంతో కురిసిన భారీ వర్షాలకు నెల్లూరు నగరం తడిసి ముద్దయింది. బుధవారం నెల్లూరును వరద నీరు చుట్టు ముట్టింది. పలు కాలనీలు నీట మునిగాయి. తుఫాను తీరందాటింది తమిళనాడులో నైనా నెల్లూరులో వరద బీభత్సం కొనసాగింది. వెంకటాచలం నుంచి పెన్నా బ్రిడ్జి వరకు, నేషనల్ హైవేతో పాటు నెల్లూరులోని ప్రధాన రహదారులన్నీ వరద నీటిలో చిక్కుకున్నాయి. నాలుగు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో నెల్లూరులో జనజీవనం స్తంభించింది. నిత్యావసర వస్తువులకు సైతం గడప దాటి కాలు బయట పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి. వాయుగుండం తీరం దాటే సమయంలో నెల్లూరు జిల్లాలో గాలుల ప్రభావం లేకపోవడంతో ప్రజలు కొంతవరకు ఊపిరి పీల్చు కున్నారు. తల్పగిరి కాలనీ ముంపుకు గురి కావడంతో ఆ నీరంతా వేదయపాలెంలో >>2

## ఎపిపిఎస్సీ 21 పరీక్షల షెడ్యూల్ విడుదల

### వచ్చే రెండు నెలల్లో పరీక్షలు

### 890 ఉద్యోగాల భర్తీకి చర్యలు

**విజయవాడ, డిసెంబరు3, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు శుభవార్త తెలిపింది. ఎంతో కాలం నుంచి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారి కోసం ఇప్పటికే విడుదల చేసిన నోటిఫికేషన్ల ప్రకారం పరీక్షల తేదీల్ని ప్రకటించింది. ఈ మేరకు వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న 890 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు వీలుగా ఈ ఏడాది 21 నోటిఫికేషన్లు విడుదల చేసింది. వీటికి పరీక్షల్ని వచ్చే రెండు నెలల్లో నిర్వహించబోతున్నారు. ఆ మేరకు వెబ్ సైట్‌లో పూర్తి వివరాలను వెల్లడించింది. ఈ ఏడాది విడుదల చేసిన 21 ఉద్యోగ నోటిఫికేషన్లకు పరీక్షల తేదీల్ని నిర్ధారిస్తూ ఎపిపిఎస్సీ ప్రకటన విడుదల చేసింది. ఈ పరీక్షల్ని కొత్త ఏడాదిలో జనవరి, ఫిబ్రవరి నెలల్లో వివిధ తేదీల్లో నిర్వహించబోతున్నారు. ఏయే పరీక్షను ఏయే తేదీల్లో నిర్వహించబోతున్నారో వివరిస్తూ ఎపిపిఎస్సీ జాబ్ షెడ్యూల్ చార్జ్ విడుదల చేసింది. ఇప్పటికే ఆయా పరీక్ష >>2



బుధవారం జరిగిన ఉద్భవ్ వేడుకలో లాంఛనంగా విల్లు ఎక్కుపెట్టిన కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరమ్

## ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధికే 'ఉద్భవ్'

### విద్యార్థులు సంస్కృతీ సంప్రదాయాలు కూడా నేర్చుకోవాలి


### క్రీడల్లో గిరిజన విదార్థులు మెరుస్తున్నారు..

### 'ఉద్భవ్' వేడుకలను ప్రారంభించిన కేంద్రమంత్రి జువల్ ఓరమ్

### ఈ వేడుక గొప్పమార్పుకోసమే: మంత్రి సంధ్యారాణి

**విజయవాడ, డిసెంబరు 3, ప్రభాతవార్తప్రతినిధి:** ఆదివాసీ, గిరిజన విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా సంస్కృతి, సంప్రదాయాలు కూడా నేర్చుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ వెల్లడించారు. ఇఎంఆర్ఎస్ బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతిలోని కెఎల్ యూనివర్శిటీ వేదికగా ఉద్భవ్2025 వేడుకలను కేంద్ర మంత్రి తొలిరోజు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. కార్యక్రమంలో గిరిజనాయుధం విల్లును లాంఛనంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు హిందీ, ఇంగ్లీష్, ప్రాంతీయ భాష కూడా ముఖ్యమే అన్నారు. గిరిజన వ్యవహారాల శాఖకు వాజ్ పేయి హయాంలో నామకరణం జరిగిందని ప్రస్తావించారు. గత ఐదేళ్లు జరిగిన గిరిజన సంస్కృతి ఉత్సవాల సమయంలోనూ తానే కేంద్రమంత్రిగా ఉండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జవహర్ లాల్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల తరహాలోనే ఇఎంఆర్ఎస్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కేంద్రమంత్రి ఓరమ్ స్పష్టం చేశారు. క్రీడల్లోకూడా గిరిజన విద్యార్థులు మెరుస్తున్నారన్నారు. ఉద్భవ్ అంటే హృదయాంతరాల నుంచి బయటకి తీయడం అనే అర్థం అన్నారు. అందుకే ఈ ఉత్సవాలకు ఆ పేరు పెట్టడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఎంతో కష్టపడి ఉత్సవాలలో లోటుపాట్లులేకుండా నిర్వహిస్తోన్న ఎపి ప్రభుత్వం, గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్‌లను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా 6వ జాతీయ ఇఎంఆర్ఎస్ సంస్కృతి, సాహిత్య, కళాఉత్సవాన్ని జువల్ ఓరమ్ ఆవిష్కరించారు. అనంతరం కేంద్రమంత్రి జువల్ ఓరమ్ ని రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి సన్మానించారు. వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఆయనకు బహూకరించారు. అంతకుముందు ముఖ్య అతిథిగా వచ్చిన కేంద్ర మంత్రి ఓరమ్ ను ఈఎంఆర్ఎస్ విద్యార్థులు గిరిజన సంప్రదాయ నృత్యాల నడుమ స్వాగతం పలికారు. అనంతరం ఆయన సభా ప్రాంగణం వద్ద గిరిజన సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. బొమ్మలను పరిశీలించారు. విల్లును పట్టుకుని బాణాన్ని ఆకాశానికి ఎక్కుపెట్టి కేంద్రమంత్రి ఓరమ్ సందడి చేశారు. అక్కడే ఏర్పాటైన గిరిజనుల ఉత్పత్తిగా అంతర్జాతీయ ఖ్యాతి పొందిన అరకు కాఫీ స్టాల్ ను సందర్శించారు. దాంతో పాటు గిరిజనుల ఉత్పత్తి అయిన తేనే బాటిళ్లను పరిశీలిం >>2



## పుతిన్‌కు ఐదంచెల భద్రత

### నేడు రానున్న రష్యా అధ్యక్షుడు

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనకు సర్వం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు భారత్-రష్యా వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆయన రేపు సాయంత్రం ఢిల్లీ చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో అపూర్వమైన భద్రతాఏర్పాట్లు చేశారు. పుతిన్‌కు ఐదంచెల అభేద్యమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ భద్రతలో రష్యా అధ్యక్షుడి భద్రతా సిబ్బందితో పాటు, భారత నేషనల్ సెక్యూరిటీగార్డ్ ఎన్ఎస్‌జి కమాండోలు, స్నైపర్లు, డ్రోన్లు, జామర్లు, >>2

## భారీ ఎన్‌కౌంటర్

### 12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్ల మృతి

### కొనసాగుతున్న కూంబింగ్

**చర్ల, డిసెంబర్ 3,(ప్రభాతవార్త):** చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. తాజాగా బుధవారం ఉదయం బీజాపూర్- దంతెవాడ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు భద్రతా బలగాలకు భారీగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో 12 మావోయిస్టులు మృతిచెందగా ముగ్గురు డిఆర్జి జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు జవాన్లకు గాయాలయ్యాయి. మావోయిస్టులే లక్ష్యంగా అటవీ ప్రాంతంలో డిఆర్జి, ఎస్‌టిఎఫ్, సిఆర్పీఎఫ్ కోబ్రా బలగాలు సంయుక్తంగా శోధన ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో మావోయిస్టులు తారసపడటంతో ఇరువురి మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో హెడ్ కానిస్టేబుల్ మోను వాడాది (డిఆర్జి), గొండె దుకారు, సోడి రమేష్ (డిఆర్జి) మృతిచెందగా సోమ్‌దేవ్ యాదవ్‌తో పాటు మరో జవాన్‌కు గాయాలయ్యా >>2

## 'సిట్'వలలో ముంబయి బులియన్ వ్యాపారి

### మద్యం కుంభకోణం కేసు

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి :** వైకాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో జరిగిన రూ. మూడున్నర వేలకోట్ల మద్యం కుంభకోణం కేసులో ముంబై బులియన్‌వ్యాపారి రోణక్‌కుమార్ జస్‌రాజ్‌ను సిట్ అధికారులు అరెస్టు చేశారు. అతడిని విచారణ నిమిత్తం విజయవాడకు పిలిపించగా.. బయట హాల్లో ఉంటానని చెప్పి తప్పించుకుని పారిపోతుండగా గన్నవరం విమానాశ్రయంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలకు నాసిరకం మద్యం అధిక ధరలకు విక్రయించి ముడుపుల రూపంలో వేల కోట్ల రూపాయలను వైసిపికు చెందిన నేతలు వసూలు చేసినట్లు సిట్ ఆరోపణలు, ఆధారాలతో ఉన్నాయి. ఆ సొమ్ముతో ఎన్నికల్లో వైసిపికి నిందితులు ఓట్లు కొనడం మొదలుకొని.. పొరుగు రాష్ట్రాల్లో స్థిరాస్తులు, ముంబైలో బంగారం కొనుగోలు చేసిందని అభియోగాలున్నాయి. మనీలాండరింగ్, హవాలా రూపంలో ఇతర దేశాలకు తరలింపు.. ఆ తర్వాత వైట్ మనీగా మార్చుకున్న రాజ్ కసిరెడ్డి గ్యాంగ్ అక్రమాలను ఒక్కొక్కటిగా సిట్ అధికారులు బయటకు తీస్తున్నారు. ఆదాన్ డిస్టిలరీస్, లీలా డిస్టిలరీస్, ఎస్‌పివై ఆగ్రోస్ నుంచి ముంబైకి చెందిన అనిల్ చోఖ్రా సృష్టించిన సెల్ కంపెనీల బ్యాంకు ఖాతాల్లోకి రూ.78 కోట్లు బదిలీ అయినట్లు ఆధారాలు లభించాయి.

చోఖ్రాను ముంబైలో అదుపులోకితీసుకుని.. విజయవాడ ఏసిబి కోర్టులో ప్రవేశపెట్టి..కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు. ఆదాన్, లీలా, ఎస్‌పివై యజమానులతో నాకు ప్రత్యక్షంగాసంబంధాల్లేవు. ముంబైలోని హవాలా >>2

## 'ఉప్పాడ'కు శాశ్వత పరిష్కారం

### సముద్ర జలాల కాలుష్య సమస్యపై శాస్త్రీయ పరిశోధన

### ఉప్పాడ మత్స్యకారులతో డిప్యూటీ సిఎం పవన్



**విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** "ప్రజా ధనం నుంచి ఖర్చు పెట్టే ప్రతి పైసాకు ప్రతిఫలం ఉండాలి. ఇచ్చిన ప్రతి మాటకు కట్టుబడి పనిచేయాలనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా ప్రజా ధనాన్ని ఖర్చు చేశారు. అప్పటి ప్రభుత్వం ఓ ప్రణాళిక లేకుండా, సొంత ప్రాపకాల కోసం ఇష్టానుసారం చేసిన ఖర్చులతో నిధులు అక్కరకు రాకుండా పోయాయి" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెప్పారు. పోలవరం డయా ఫ్రం వాల్‌ను గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు మార్చి, రివర్స్ టెండర్లు అంటూ ఇష్టానుసారం నిర్మించడంతో ఎందుకు పనికిరాకుండా పోయిందనీ, ఇప్పుడు దాన్ని పునర్ని ర్మాణం చేయాల్సి వచ్చిందన్నారు. అలాగే ఉప్పాడలో నిర్మించిన మత్స్యకారుల జెట్టీ కూడా డిజైన్ల లోపం కారణంగా పనికిరాకుండా పోయింది, దానికి మళ్లీ రూ.80 కోట్లు ఖర్చయ్యే పరిస్థితిని తీసుకొచ్చారని చెప్పారు. చేసిన పనికే ప్రజాధనాన్ని మళ్లీమళ్లీ ఖర్చు చేసేలా అప్పటి పాలకులు పని చేశారని వివరించారు.

ఉప్పాడ మత్స్యకారులతో 100 రోజుల ప్రణాళిక అమలు, భవిష్యత్తు కార్యాచరణ, ఆదాయం పెంపు అనే అంశాలపై బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. తమిళనాడు, కేరళలో విజయవంతంగా అమలు అవుతున్న సముద్ర ఉత్పత్తులతో అదనపు ఆదాయం విధానాలను పరిశీలించేందుకు ఉప్పాడ నుంచి 60 మందితో ప్రత్యేక బృందాన్ని అక్కడకు పంపాలని నిర్ణయించారు. సమావేశంలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపే యాక్షన్ ప్లాన్‌ను వారి సమక్షంలోనే పవన్ తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "మత్స్యకారులకు సమస్య వస్తే నాకు వచ్చినట్లే. మా ఇంట్లోని వారికి సమస్య వచ్చినట్లే భావిస్తాను. అదే భావనతో సమస్యను పరిష్కరిస్తా. ఈ విషయాన్ని అక్టోబరు 9న ఉప్పాడసెంటర్‌నుంచి చెప్పాను. ఇప్పుడు అదే మాటమీదఉన్నాను. సమస్య వస్తే రాజకీయాలకు అతీతంగా దాని పరి >>2

## వివేకా హత్య కేసు సునీత పిటీషన్‌పై 10న తీర్పు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు3:** దివంగత వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో లోతైన విచారణ జరగాలని, లేదంటే అసలు నిందితులు తప్పించుకునే ప్రమాదం ఉందని వైఎస్ సునీత తరఫు న్యాయవాది అన్నారు. తన తండ్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సమగ్ర దర్యాప్తు జరపాలని కోరుతూ కుమార్తె వైఎస్ సునీత నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం నాంపల్లి సీబీఐ >>2

## దివ్యాంగులకు ఏడు వరాలు

### వారు అందరిలా హక్కులు, అవకాశాలు పొందాలి

### కరుణ కుమారికి ప్రభుత్వం తరపున ఇంటి నిర్మాణం, రూ. 15 లక్షలు, దీపికకు కూడా ఇల్లు, రూ. 10 లక్షల నజరానా

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీబస్సుల్లో ఇకపై దివ్యాంగులకు ఉచిత ప్రయాణమని సిఎం చంద్రబాబు ప్రకటించారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సిఎం చంద్రబాబు, మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. అలానే ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తరపున సిఎం 7వరాలు ప్రకటించారు. స్థానిక సంస్థల్లో, కార్పొరేషన్స్ పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్‌లో కనీసం ఒక దివ్యాంగ ప్రతినిధిని నామినేట్ చేస్తామని తెలిపారు. ఆర్థిక సబ్సిడీ పథకాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అందించినట్టుగానే దివ్యాంగులకు మళ్లీ ప్రారంభిస్తామని స్పష్టంచేశారు. శాప్‌ద్వారా అన్ని క్రీడా కార్యక్రమాలు, >>2



బుధవారం విజయవాడలో అంధ మహిళల ప్రపంచకప్‌లో ప్రతిభకనబరిచిన కరుణ, దీపికలను అభినందిస్తున్న సీఎం చంద్రబాబు

## లోక్‌భవన్‌గా రాజ్‌భవన్ పేరు మార్పు

**విజయవాడ, డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ నుండి అందిన ఆదేశాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ 'రాజ్ భవన్, ఆంధ్రప్రదేశ్' పేరును 'లోక్ భవన్, ఆంధ్రప్రదేశ్' గా మార్చడానికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంత రాము బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో రాజ్‌భవన్ దగ్గర పేరును మారుస్తున్నారు.

04-12pg2exHMNWJQE 2_04-12pg2exHMNWJQE.qxd 04/Dec/25 12:10 AM Page 1





ఉద్భవ్ వేడుకల్లో గిరిజన సంప్రదాయ నృత్యాలు ప్రదర్శిస్తున్న అరకు ప్రాంత విద్యార్థులు

## ఆదివాసీలు, గిరిజనుల అభివృద్ధికే 'ఉద్భవ్'

>> వారు. ఉద్భవ్2025 అంటే వేడుక కాదు..గొప్ప మార్పుకు వేదిక అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. చిన్నారులలోని ప్రతిభ, సృజనాత్మకతను బయటకు తీసి విశ్వాసం నింపాలనేదే లక్ష్యమన్నారు. కొత్త పరిచయాలు, కొత్త సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం ఈ ఉత్సవం వల్ల సాధ్యపడుతుందన్నారు. 405 ఐంఆర్ఎస్ స్కూళ్ల నుంచి 1647 మంది శరవేగంగా పరిచయాలు పెంచుకుంటున్నారని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఇంత పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొనే వేదిక ఏపీ కావడం సంతోషకరమన్నారు. 110 మంది ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధికోసం ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఉద్భవ్ 2025 వేదికగా మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. వెనుకబడిన వర్గాలకు సీఎం నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. గిరిజన చిన్నారులు కూడా డాక్టర్లు, ఇంజనీర్లు, టీచర్ల వంటి గొప్ప చదువు చదవడమే కాకుండా మంచి పౌరులుగా నిలవాలన్నారు. 'గెలుపు ముఖ్యమే...కానీ ఓటమిని మాత్రం భయపడ కూడదంటూ' ప్రసంగంతో స్ఫూర్తి నింపారు. 28 లక్షల మంది గిరిజనులున్న ఏపీలో ఉద్భవ్ 2025కు ఆతిథ్యమిస్తున్నందుకు గర్వపడుతున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ వల్ల మనలోని వైవిధ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. దేశవ్యాప్తంగా 740 ఐంఆర్ఎస్ లు ఉన్నాయన్నారు. 440 ఐంఆర్ఎస్ భవనాలను కేంద్రం నిర్మిస్తోందన్నారు. రాష్ట్రాలవారీగా గిరిజనుల జీవన వైవిధ్యం, సంస్కృతిని దేశవ్యాప్తంగా తెలిపే వేదికగా ఉద్భవ్2025 మారుతుందన్నారు. ఇటువంటి ఉత్సవాల్లో సీఎస్ఆర్ ప్రముఖులను కూడా భాగస్వామ్యం చేస్తే మరింత బాగుంటుందన్నారు. 20 ప్రత్యేక బృందాలను నియమించి పోటీలకు తగిన వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు తగ్గ భోజన, వసతి సదుపాయాలు సిద్ధంగా ఉందన్నారు. అతిథుల ప్రసంగాల అనంతరం కేంద్రమంత్రి జువల్ ఓరమ్, రాష్ట్ర మంత్రి సంధ్యారాణి, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ షేక్ హసన్ బాష, నెస్ట్స్ కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, తదితరులను సన్మానించారు. వేంకటేశుని విగ్రహాలను వారికి జ్ఞాపికలుగా బహూకరించారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో ఉద్భవ్‌ఉత్సవాలను ముఖ్యఅతిథి కేంద్ర మంత్రి ఓరమ్, రాష్ట్రమంత్రి సంధ్యారాణి ప్రారంభించారు.

# పుతిన్‌కు ఐదంచెల భద్రత

>> ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానిటరింగ్ వ్యవస్థలను మోహరించారు. సమాచారం ప్రకారం, ఇప్పటికే రష్యాకు చెందిన 48 మంది ఉన్నత స్థాయి భద్రతా సిబ్బంది ఢిల్లీకి చేరుకున్నారు. వారు ఢిల్లీ పోలీసులు, ఎన్ఎస్‌జీ అధికారులతో కలిసి పుతిన్ ప్రయాణించే అన్ని మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. పుతిన్ భద్రతలో బయటి వలయాల్లో ఎన్ఎస్‌జీ, ఢిల్లీ పోలీసులు ఉండగా, అంతర్గత వలయాల బాధ్యతను రష్యా అధ్యక్ష భద్రతా దళాలు చూసుకుంటాయి. ప్రధాని మోదీతో ఉన్నప్పుడు, భారత స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమాండోలు కూడా ఈ భద్రతలో పాలుపంచుకుంటారు. ఈ పర్యటనలో మరో ప్రత్యేక ఆకర్షణ పుతిన్ వాడే ఆరస్ సెనాట్ అనే అత్యంత సురక్షితమైన లగ్జరీ కారు. దీనిని ప్రత్యేకంగా మాస్కో నుంచి భారత్‌కు తీసుకువస్తున్నారు. చక్రాలపై నడిచే కోటగా పిలిచే ఈ కారు పూర్తి ఆర్మర్డ్ వాహనం. పుతిన్ బస చేసే హోటల్‌తో పాటు ఆయన పర్యటించే రాజ్‌ఘాట్, హైదరాబాద్ హౌస్, భారత మండపం వంటి అన్ని ప్రదేశాలను భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి.

# 'ఉప్పాడ'కు శాశ్వత పరిష్కారం

>> ష్కారానికి ముందుకు వెళ్లేవాడిని. నాకు మీ సహకారం కావాలి. నన్ను శంకించకండి.. నేను మీ వాడిని. మిగతా పార్టీల నాయకుల్లా సమస్య వస్తే బూతులు తిట్టడం, గొడవలు పెట్టడం చేయను. పరిష్కారం వచ్చేలా పని చేస్తాను. దాని కోసం పరితపిస్తాను" అని పేర్కొన్నారు.

**కాలుష్యానికి మూలం తెలియాలి**

"సముద్రపు కాలుష్యం చాలా రకాలుగా ఉంటుంది. మత్స్యకారులు ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్య నా దృష్టికి తీసుకొచ్చిన వెంటనే దీని మూలాలను శాస్త్రీయంగా వెతికేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఇప్పుడు డాక్టర్ జో కిజాకూడన్ బృందం రంగంలోకి దిగి ఉప్పాడ తీరంలో కాలుష్య సమస్యపై పూర్తిస్థాయి అధ్యయనం చేస్తుంది. దీని మూలాలు వెతికి, శాశ్వత పరిష్కారం వెతుకుదాం. మత్స్యకారులకు ఎలాంటి సమస్యా రాకుండా చూసుకునే బాధ్యతను నేను తీసుకుంటాను. పరిశోధన బృందానికి మత్స్యకారులు తగిన విధంగా సహకరించాలి. వారు తీర ప్రాంతంలో అంతా తిరిగి, సముద్రంలోకి వెళ్లి మరీ కాలుష్యానికి అసలు కారణాలను తెలుసుకుంటారు" అని ఉపముఖ్యమంత్రి తెలిపారు.

**సమస్యను మర్చిపోలేదు**

"అక్టోబరు 9వ తేదీన ఉప్పాడ వేదికగా 100 రోజులు గడువు ఇవ్వాలని మత్స్యకారులను కోరాను. అప్పటి నుంచి నాతోపాటు నా కార్యాలయ అధికారులు దీనిపై కూలంకషంగా పని చేస్తున్నారు. సమస్య పరిష్కార దిశగా, మత్స్యకారులకు కొత్త భరోసా ఇచ్చే దిశగా ముందుకు వెళ్తున్నాం. సమస్యను నేనెప్పుడూ మర్చిపోలేదు. మత్స్యకారులు మారుతున్న కాలంతో మరింత వేగంగా వారి బతుకులను బంగారుమయం చేసుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు అవుతున్న పద్ధతులను అవలంబించాలి. దీనికోసం ఉప్పాడ మత్స్యకారులనుంచి ప్రత్యేకంగా బృందాలను తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు పంపుతున్నాం. అక్కడి విధానాలను అవగతం చేసుకోవాలి. దానికి ప్రభుత్వం కూడా మీకు తగిన విధంగా సహకరిస్తుంది. అక్కడ పద్ధతులను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. అదనపు ఆదాయ మార్గాల మీద దృష్టి సారించాలి. ఉప్పాడలోని 7200 మంది మత్స్యకారులు, 25,600 మంది వారి కుటుంబ సభ్యులకు జీవన భృతి రెట్టింపు అవ్వాలి అన్నదే లక్ష్యం" అని పవన్ అన్నారు.

## విమానం హైజాక్‌ను తప్పించిన పైలట్ సమయస్ఫూర్తి

**జుబా, (దక్షిణసూడాన్), డిసెంబరు 3:** దక్షిణ సూడాన్‌లో ఓ విమానం హైజాక్ ఉదంతం సుఖాంతమైంది. సాయుధుడైన హైజాకర్ విమానాన్ని మరో దేశానికి మళ్లించాలని ఒత్తిడి చేయగా, పైలట్ సమయస్ఫూర్తితో వ్యవహరించి విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసి, నిందితుడిని అధికారులకు పట్టించారు. ఈ ఘటనలో సిబ్బందికి ఎలాంటి హాని జరగలేదు. రాజధాని జుబా నుంచి మైవుట్‌కు వైద్య సామగ్రితో సెస్నా గ్రాండ్ కారవాన్ విమానం బయలుదేరింది. టేకాఫ్‌కు ముందే యాసిర్ మహమ్మద్ యూసఫ్ అనే వ్యక్తి తుపాకీతో విమానంలోకి ప్రవేశించి, వెనుక క్యాబిన్‌లో దాక్కున్నాడు. విమానం గాల్లోకి లేచిన తర్వాత బయటకు వచ్చి, దానిని ఆఫ్రికా దేశమైన చాద్‌కు మళ్లించాలని పైలట్‌ను బెదిరించాడు.

ఈ అనూహ్య పరిణామంతో పైలట్ ఏమాత్రం కంగారు పడకుండా చాకచక్యంగా వ్యవహరించాడు. విమానంలో ఇంధనం అయిపోతోందని, చాద్‌కు వెళ్లాలంటే సమీపంలోని వావు నగరంలో ఇంధనం నింపుకోవాలని హైజాకర్‌ను నమ్మించాడు. అదే సమయంలో రహస్యంగా అధికారులకు సమాచారం అందించాడు. విమానం వావులో ల్యాండ్ అవగానే, భద్రతా సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనను దక్షిణ సూడాన్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ధ్రువీకరించింది. విమానం సురక్షితంగా ల్యాండ్ అయిందని, పరిస్థితిని అదుపులోకి తెచ్చామని తెలిపింది. హైజాక్‌కు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు అధికారులు వెల్లడించారు. దక్షిణ సూడాన్‌లో ఇలాంటి ఘటనలు చాలా అరుదు కావడంతో ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది.



బుధవారం విజయవాడలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన గౌతమ్ అదాని

## సిఎం చంద్రబాబును కలిసిన గౌతమ్ అదాని

**విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో అదాని గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదాని భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. రాష్ట్రంలో అదాని గ్రూపు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రానున్న రోజుల్లో పెట్టబోయే పెట్టుబడులపై ఈ సమావేశంలో చర్చించారు.

# ఎడతెరిపిలేని వాన

>> ప్రధాన రహదారిపై చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంకటాచలం నుంచి వేదాయపాలెం సెంటర్ వరకు నేషనల్ హైవే నిండా వరద నీరు చేరింది. దీంతో గంటల కొలది ట్రాఫిక్ జామై వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడక్కడ కొన్నివాహనాలు మరమ్మతులకు గురికావడంతో వాహన రాకపోకలు ఆగిపోయాయి. ఆత్మకూరు బస్టాండు, విఆర్సి, మాగుంట లేఔట్ తదితర అండర్ బ్రిడ్జిల నిండా నీరు చేరినా, ముందస్తు ప్రణాళికలతో మోటార్లతో నీటిని తోడి వేయడంతో వాహనాల రాక పోకలు కొనసాగాయి. మాగుంట లేఔట్ ప్రధాన రహదారిపై మోకాలిలోతు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మినీ బైపాస్ కూడా వరద నీటిలో చిక్కుకొని ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఏది ఏమైనా నెల్లూరు నగరం గుండా ప్రవహించే పంట కాలువలు కొంత భాగం ఆక్రమణకు గురికావడం, మరి కొంత భాగంలో కాలువల వైశాల్యాన్ని తగ్గించడంతో ముంపు అనివార్య మవుతుంది.

## తీవ్ర అల్పపీడనంగా బలహీన పడిన వాయుగుండం

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీన పడినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రభావంతో గురువారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి.

ఈ నెల 2న ఉదయం 8.30 గంటల నుంచి 3న ఉదయం 8.30 గంటల వరకు తిరుపతి, నెల్లూరుజిల్లాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..తిరుపతి జిల్లా వాకాడులో 281.4మిల్లీ మీటర్లు, చిట్టమూరులో 226.7, కోటలో 189.3, దొరవారిసత్రంలో 124.9, ఓజిలిలో 116.4, నాయుడుపేటలో 106.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 247.5మిల్లీ మీటర్లు,మనుబోలులో 145.3, నెల్లూరు రూరల్‌లో 112.5, ముత్తుకూరులో 106.9మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి జిల్లా తొట్టంబేడులో 47.2 మిల్లీ మీటర్లు, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో 37.5 మిల్లీమీటర్లు, తిరుపతి జిల్లా మన్నారుపోలూరులో 32.7 మిల్లీ మీటర్లు, చిత్తూరు జిల్లా నింద్రలో 30 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# సునీత పిటీషన్‌పై 10న తీర్పు

>> కోర్టులో విచారణ జరిగింది. అసలు నిందితులు తప్పించుకోకుండా ఈ కేసు విచారణ జరపాలని ఆమె కోరారు. సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ వేసేలా సీబీఐని ఆదేశించాలని కోరారు. దర్యాప్తు కొనసాగితే సంచలన విషయాలు వెలుగులోకి వస్తాయని కూడా సునీత అభిప్రాయపడ్డారు. దర్యాప్తు కొనసాగించే అవకాశం లేదని నిందితుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. ఈ నెల 10న తీర్పును వెలువరించనుంది.

## ఇంటర్నెట్ సిసికెమేరాలను హ్యాక్‌చేసిన సైబర్ నేరగాళ్లు

**సియోల్, డిసెంబరు 3:** ఇంట్లో, ఆఫీసులో సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేసుకునే సిసి కెమెరాలను సైబర్ నేరస్తులు హ్యాక్ చేశారు. ఏకంగా 1.20 లక్షల సీసీ కెమెరాలను హ్యాక్ చేసి మహిళలు, దంపతులు ఏకాంతంగా ఉన్న వీడియో క్లిప్ లను సేకరించి పోర్న్ వీడియోలు తయారు చేశారు. వాటిని ఆన్ లైన్ లో అమ్మకానికి పెట్టారు. సౌత్ కొరియాలో వెలుగుచూసిన ఈ భారీ సైబర్ స్కామ్ తో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఇంటర్నెట్ కనెక్టెడ్ సీసీ కెమెరాలు అమర్చుకున్న వారు జాగ్రత్తగా ఉండాలని, తరచుగా పాస్ వర్డ్‌లు మార్చాలని నిపుణులు సూచిస్తున్నారు. మిగతా వాటితో పోలిస్తే ఇంటర్నెట్ కనెక్టెడ్ సిసి కెమెరాల ధర చాలా తక్కువ. దీంతో చాలామంది వీటిని కొనుగోలు చేసి తమ ఇళ్లు, ఆఫీసుల్లో అమర్చుకుంటున్నారు.

# దివ్యాంగులకు ఏడు వరాలు

>> టాలెంట్ డెవలప్మెంట్ స్కీములు దివ్యాంగులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ:**

బహుళ అంతస్తులు కలిగిన ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టుల్లో దివ్యాంగులకు గ్రౌండ్ ఫ్లోర్ కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బాపట్లలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కాలేజ్‌తో పాటు వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, హాస్టల్స్‌లో చదివే దివ్యాంగ విద్యార్థులకు అదే చోట సామాజిక భద్రతా పెన్షన్ పంపిణీ చేస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో అమరావతిలో దివ్యాంగ్ భవన్ ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇటీవలే అంధుల ప్రపంచకప్ గెలిచిన జట్టు కెప్టెన్ దీపికతో పాటు పాడేరుకు చెందిన కరుణకుమారికి ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం ప్రకటించారు. ఇల్లు కట్టిస్తామని చెప్పారు. కరుణకుమారి కోచ్, అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డికి కూడా ఆర్థిక సాయం ప్రకటించారు. వీరికి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తరపున 10 లక్షల పురస్కారం అందించారు. కరుణకుమారికి 5 లక్షల బహుమతి, కుమారి దీపిక, అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్ రెడ్డికి బ్లైండ్ క్రికెట్ అసోసియేషన్ తరపున 1 లక్ష పురస్కారం అందించారు.కరుణ కుమారి, దీపిక జాతి గర్వపడేలా క్రికెట్ కప్ పోటీల్లో రాణించి స్ఫూర్తిని నింపారు... వారికి మనస్ఫూర్తిగా అభినందనలు. ఈ కార్యక్రమం ద్వారా వారికి అండగా ఉండటమే కాదు..పూర్తిగా ప్రోత్సాహించాలిజదివ్యాంగులు ఎప్పుడూ బలహీనులు కాదు... వారు విభిన్న ప్రతిభావంతులు.విభిన్న ప్రతిభావంతులకు కొంచెం మద్దతిస్తే విజయం సాధించగలరు.విల్ పవర్, పట్టుదల, శక్తి విభిన్న ప్రతిభావంతులకు ఉంది. పట్టుదలకు దివ్యాంగులు చిరునామాగా ఉంటారు. సమాజంలో అందరిలాగా దివ్యాంగులకు అవకాశాలు, హక్కులు, గౌరవం పొందాలి. అనుకూలమై సమాజాన్ని నిర్మించాలనే థీమ్ తో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. దివ్యాంగుల ఎదుగుదలకు ఉన్న అడ్డంకులు తొలగిస్తూ అవసరమైన విధానాలు రూపొందిస్తున్నాం.

దివ్యాంగులకు అండగా ఉన్నది మా ప్రభుత్వమే. మొదట ఎన్టీఆర్ రూ.35 పింఛను ఇచ్చారు. తర్వాత 2014లో సీఎం అవ్వగానే దివ్యాంగుల పింఛను రూ.3000 చేశాం. 2024లో మళ్లీ రూ.6,000కు పెంచాం.దేశంలో ఎక్కడా రూ.6 వేలు పెన్షన్ ఇవ్వడం లేదు. ఇదీ దివ్యాంగుల పట్ల మా ప్రభుత్వానికి ఉండే అభిమానం, ప్రేమ. రాష్ట్రంలో 7.68 లక్షల మంది దివ్యాంగులకు ప్రతి నెలా రూ.470కోట్లు, ఏడాదికి రూ.6వేలకోట్లు పింఛన్ల రూపంలో ఇస్తున్నారు, దివ్యాంగులకు బ్యాక్ లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్ మెంట్ డ్రైవ్‌ను పొడిగిస్తున్నాం. దివ్యాంగులు నడవడానికి మోటార్ వాహనాలు ఇస్తున్నాం.

ఈ ఏడాది 1800 వాహనాలను దివ్యాంగులకు ఇస్తున్నాం.వీటితో పాటు వీల్ చైర్లు ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు దాదాపు 14 వేల మందికి వివిధ పంపిణీ చేశామన్నారు. గత పాలకుల అస్తవ్యస్థ విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా ఛిన్నాభిన్నం అయినా దివ్యాంగులను ఆదుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. వైకల్యం విజయానికి అడ్డం కాదని కరుణ కుమారి, దీపిక, అజయ్ కుమార్ రెడ్డి నిరూపించారన్నారు.అల్లూరి జిల్లాకు చెందిన కరుణ కుమారి.ఎంతో ప్రేరణతో ఉండేది. కేవలం శబ్దంతోనే క్రికెట్ నేర్చుకుంది.ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా కప్పుతో ఇంటికి వస్తానని తండ్రికి మాట ఇచ్చి అవార్డుతో ఇంటికి వచ్చి మాట నిలబెట్టుకుంది.ఇందుకు అజయ్ కుమార్ రెడ్డి ట్రైనింగ్ ఇచ్చారు.తీవ్రమైన దృష్టిలోపం ఉన్నా ప్రతిభలో వెనకబడలేదు. 42 పరుగులు చేసి దేశానికి కప్ రావడంలో కీలకంగా వ్యవహరించారు. ఆమెను చూసి నాకు తృప్తి కలిగింది. ఆధునిక వసతులతో ఉన్న పాఠశాలలో ఆడుకోలేదు... ప్రభుత్వ స్కూల్లో చదవుకుని ప్రపంచ కప్ గెలిచినందుకు గర్వపడుతున్నా. ఇది అందరికీ స్ఫూర్తి కావాలన్నారు.

# సాగు మేలుకు పంచసూత్రాలు

>> కారణం. కరువు ఎక్కువగాఉండే సీమలోని నంద్యాల జిల్లాలో 4 మీటర్లకు భూగర్భ జలాలు పెరిగాయి. రాష్ట్రం మొత్తం మీద తూర్పు గోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాలో భూగర్భ జలాలు తగ్గాయి. రాష్ట్రంలో కృష్ణా, గోదావరి నుంచి నీరు వృథాగా సముద్రంలోకి పోతోంది. ఈ రెంటిని అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగు నీరు అందిస్తాం"అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**డిమాండ్ ఉన్న పంటల సాగుతో ఆదాయం**

"రైతులు డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలి. వినూత్న పద్ధతుల్లో విభిన్న పంటలు పండించాలి. ఏ పంటలకు డిమాండ్ ఉంది, ఎక్కడ మార్కెట్ ఉంది, సాగులో కొత్త పద్ధతులు ఏంటి అనే వాటిపై రైతులకు అవగాహన రావాలి. వ్యవసాయ రంగాన్ని రీఓరియేంటేషన్ చేస్తాం. పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు. ఇథనాల్ తయారీ కోసం కేంద్ర ప్రభుత్వాలు మొదట మొక్కజొన్న సాగును ప్రోత్సహించాయి. తర్వాత పాలసీ మారడంతో ఇథనాల్ తయారీకి 40 శాతం వరి నూకలు, 60 శాతం జొన్నలు వాడుతున్నారు. దీంతో మొక్కజొన్నకు డిమాండ్ తగ్గి రైతులు నష్టపోయారు. అలాగే డిమాండ్ ఉందని హెచ్డీ బర్లీ పొగాకు భారీగా సాగు చేశారు. తర్వాత మార్కెట్ పడిపోయింది. అంతర్ పంటలు వేసిన రైతులకు లాభాలు వస్తున్నాయి. చిత్తూరు జిల్లాలో కొందరు రైతులు మామిడి పండ్లకు పురుగు పట్టకుండా కవర్ పెట్టి జాగ్రత్తలు తీసుకోవడంతో మంచి లాభాలు పొందారు" అని సీఎం తెలిపారు.

**ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం**

"టెక్నాలజీ వినియోగంతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. ఒక పంట వరి వేసినప్పటికీ మరో పంటగా హార్టికల్చర్‌కు వెళితే ఆదాయం పెరుగుతుంది. నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఇ పార్కు పెడుతున్నాం. రైతులు పండించిన పంటను నేరుగా వినియోగదారునికి విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నాం. సీమలో 18 రకాల పంటలు, పండ్లు పండుతున్నాయి. ఎడారిలో పండే ఖర్జూరాలనూ వాళ్లు పండిస్తున్నారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ముందుకెళ్లాలి. డైరీ, పౌల్ట్రీ... మీట్‌లో రూ.2 లక్షల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. హార్టికల్చర్‌లో రూ.లక్షా 85 వేల కోట్ల జీఎస్డీపీ వస్తుంది. చేపలు, రొయ్యల సాగుతో రూ.లక్షా 45 వేల ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో కేవలం రూ.50 వేల ఆదాయమే వస్తుంది" అని సిఎం చంద్రబాబు వివరించారు.

**గత పాలకులు ఖజానా ఖాళీ చేశారు**

"గడిచిన ఐదేళ్లలో పాలన ఎలా ఉందో మనం చూశాం. జగన్మోహన్ రెడ్డి వ్యవస్థలను సర్వనాశనం చేశాడు. ఖజానా ఖాళీ చేశాడు. కనీసం అప్పు దొరకని పరిస్థితి. తాము దక్కించుకోవాల్సిన భూమిని దక్కించుకోలేకపోతే... ఆ భూములను లిటిగేషన్లో పెట్టేవారు. అలాంటి భూములను 22ఎ జాబితాలో చేర్చేవారు. కూటమిపై నమ్మకంతో ప్రజలు అద్భుత విజయం అందించారు. అన్నింటినీ సరిచేసుకుంటూ వస్తున్నాం. సూపర్ సిక్స్‌తో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. కరెంటు చార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నాం. వచ్చే సంక్రాంతి నాటికి గుంతలు పడ్డ రోడ్లన్నీ మరమ్మతులు చేస్తాం. ఇప్పటికే టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ సంజీవని కేంద్రాలనే ప్రాజెక్టును తీసుకొచ్చాం" అని చంద్రబాబు తెలిపారు.

**విమర్శలు సహజమే**

పాలనలో సంస్కరణలు తీసుకొస్తున్న క్రమంలో అడ్డంకులు సహజం. నాడు నేను ఐటీని ప్రోత్సహించినప్పుడు విమర్శలు చేశారు. డ్వాక్రా సంఘాలు పెట్టినప్పుడు హేళన చేశారు. కానీ నేడు వాటి ఫలితాలు ఎలా ఉన్నాయో చూస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇప్పటికే విశాఖ నగరానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చింది. 20 లక్షల ఉద్యోగాలు కల్పనకు కట్టుబడి ఉన్నాం. కేంద్ర సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని, 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

04-12-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, కృష్ణపక్షం
చతుర్దశి ఉ.8.37 ○ పౌర్ణమి తె.4.44
కృత్తిక మ.2.54,జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : రా.4.49-6.12
దు.ఉ.10.07-10.52, 2) మ.2.36-3.21
శుభసమయం : ఉ.11.00-11.45
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** పలురంగాల పట్ల మీకున్న అనుభవం ఉపకరిస్తుంది. వెనువెంటనే పూర్తవుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం:** అనుకున్న పనులు వాయిదా పద్ధతులలో సాగుతాయి. సోదరుల నుండి సహాయ సహకారాలు అందిస్తారు.

**మిథునం:** కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం అన్న చందంగా ఎవరికీ సర్దిచెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది.

**కర్కాటకం :** దైవం మీద భారం వేసి ఒక కీలక నిర్ణయాన్ని అమలు పరుస్తారు. ఎదుటి వారు చెప్పే ఆసాంతం వినండి.

**సింహం:** సాధ్యమైనంత వరకు పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. వ్యవహారాలలో స్తబ్ధత చోటు చేసుకుంటుంది.

**కన్య :** విపక్ష చేస్తున్న విమర్శలను ఎదుర్కొనడానికి కావలసిన ధైర్యసాహసాలను కలిగి ఉంటారు. వాహన సౌలభ్యం కలదు.

**తుల :** మానసిక వత్తిడి అధికమవుతుంది. సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు.

**వృశ్చికం:** స్త్రీలతో విభేదాలు ఏర్పడనంత వరకు చెప్పుకోదగిన ఇబ్బందు లేవీ చోటు చేసుకోవు. సన్నిహిత కలయిక. ఉద్యోగాలలో పదోన్నతులు.

**ధనుస్సు:** తొందరపాటు మాటలు, పరుష సంభాషణలు తగాదాలు లభించవు. అర్థం లేని ఆలోచనలు కొనసాగుతాయి. ధనలాభం.

**మకరం:** ఋణం చేయడం, ఋణం ఇవ్వడం రెండు కలిసిరావు. ఎంతో సాధించాలని తపన పడతారు. సమస్యలు పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు.

**కుంభం:** సినీ, కళారంగాలలోని వారు, వస్త్ర వ్యాపారస్తులు జాగరూకతతో మెలగవలసి ఉంటుంది.

**మీనం:** ఆస్తి వివాదాలు పరిష్కార మవుతాయి. మానసిక ప్రశాంత పొందుతారు. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం. బంధువుల కలయిక.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# భారీ ఎన్‌కౌంటర్

>> యని బస్తర్ ఐజి పట్టిలింగం సుందర్ రాజ్, బీజాపూర్ ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. కాల్పుల ప్రదేశంలో 303 రైఫిల్, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, ఇతర ఆయుధ సామాగ్రిని భారీగా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నదని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే మృతదేహాల గుర్తింపు పూర్తికాలేదని శోధన పూర్తి అయ్యాక మరింత సమాచారం తెలియజేస్తామని అన్నారు.

## ఎపిపిఎస్సీ 21 పరీక్షల షెడ్యూల్ విడుదల

>> లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆయా తేదీల్లో పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది.తాజా షెడ్యూల్ ప్రకారం అగ్రికల్చర్ ఆఫీసర్ పరీక్షలు జనవరి 27వ తేదీ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకూ పేపర్ 1, 28వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకూ పేపర్ 2 నిర్వహిస్తారు. అలాగే ఏపీ గ్రౌండ్ వాటర్ సబార్డినేట్ సర్వీస్ టెక్నికల్ అసిస్టెంట్ జియో ఫిజిక్స్ పరీక్షను జనవరి 27వ తేదీ ఉదయం పేపర్ 1, 28వ తేదీ మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహిస్తారు. ఎపి ఇంటర్ ఎడ్యుకేషన్‌లో లేబ్రేరియన్ సైన్స్ జూనియర్ లెక్చరర్ పరీక్ష కూడా జనవరి 27వ తేదీ ఉదయం పేపర్ 1, 28వ తేదీ మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహిస్తారు. ఎపి బిసి వెల్ఫేర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టు పరీక్షలు జనవరి 27న ఉదయం పేపర్ 1, 28న మధ్యాహ్నం పేపర్ 2 ఉంటాయి. ఆర్‌డబ్ల్యు ఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టుకు కూడా జనవరి 27న ఉదయం పేపర్ 1, 28న మధ్యాహ్నం పేపర్ 2 నిర్వహిస్తారు. ఎపి హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టుకు జనవరి 27న ఉదయం పేపర్ 1, జనవరి 28న ఉదయం జనరల్ ఇంగ్లీష్ తెలుగు క్వాలిఫైయింగ్ టెస్ట్, 29న మధ్యాహ్నం పేపర్ 1, 30న ఉదయం పేపర్ 2 పరీక్షలు నిర్వహిస్తారు.

## 'సిట్'వలలో ముంబయి బులియన్ వ్యాపారి

>> డాన్లలో ఒకరైన చాముండ బులియన్ యజమాని చేతన్‌కుమార్ జస్‌రాజ్ నన్ను పిలిచి హైదరాబాద్ నుంచి రూ.100 కోట్లు వస్తాయి.. ఆర్వోసీలో మేనేజ్ చేసి షెల్ కంపెనీలు సృష్టించి కెవైసి ద్వారా బ్యాంకు ఖాతాలు తెరిపించాలని అడిగారు.. కమీషన్ మాట్లాడుకుని నేను 30 కంపెనీల పేర్లు, ఖాతాల వివరాలు చేతన్‌కుమార్‌కు అందజేశాను.. తర్వాత ఆదాన్, లీలా, ఎస్‌పివై ఖాతాల నుంచి నా పరిధిలో ఉన్న నాలుగు బ్యాంకు ఖాతాలకు రూ.78 కోట్లు వచ్చాయి.. నకిలీ ఇన్వాయిస్‌లు, ఫేక్ జిఎస్‌టీతో కొంత, బులియన్ ద్వారా బంగారం కొనుగోలు చేసినట్లు మరికొంత వైట్‌గా మార్చేసి కమీషన్ పోను మిగతా సొమ్ము తిరిగి చెల్లించా' అని చోక్రావెల్లడించాడు. దీంతో సిట్ అధికారులు చేతన్‌కుమార్‌కు ఫోన్ చేసి చోక్రాతో కలిపి ప్రశ్నించాల్సి ఉందని, విజయవాడకు రమ్మని పిలిచారు.తనకు ఆరోగ్యం బాగాలేదంటూ తన తమ్ముడు రోణిక్ కుమార్‌ను పంపాడు. మంగళవారం ఉదయం సిట్ కార్యాలయానికి వచ్చిన రోణిక్‌ను అధికారులు చోక్రాతోకలిపి సాయంత్రం వరకు విచారించారు. అతడు చెబుతున్న విషయాలేవీ తనకు తెలియవని, అంతా తన అన్నే చూసుకుంటాడని రోణిక్ చెప్పడంతో.. 'చేతన్‌ను బుధవారంరమ్మను.. ముగ్గురినీ కలిపి ప్రశ్నిస్తాం' అంటూ సిట్ అధికారులు సూచించారు. ఫోన్లో ఈవిషయం చెబుతానని, హాల్లో ఉంటానని చెప్పిన రోణిక్ అక్కడినుంచి తప్పించుకున్నాడు. గన్నవరం విమానాశ్రయానికిపరారయ్యాడు. ముంబై విమానం ఎక్కేందుకు బోర్డింగ్‌పాస్‌తో సిద్ధంగాఉన్న రోణిక్‌ను సిట్ అధికారులు అదుపులోకితీసుకున్నారు. ఈ కేసులో పూనాభాయ్ సోదరులిద్దరినీ నిందితులుగా చేర్చారు. అతడిని ఏ50గా, చేతన్‌కుమార్‌ను ఏ51గా పేర్కొంటూ ఏసీబీ కోర్టుకు సమాచారం కూడా ఇచ్చారు. దీంతో ఈ కుంభకోణం కేసులోని నిందితుల సంఖ్య 51కి చేరింది.

## రైల్వే పోక్సో కేసులో నిందితుడికి జీవితశిక్ష

**కడప,డిసెంబరు3, ప్రభాతవార్త:** ఆరుసంవత్సరాల క్రిందట తిరుపతి-నిజాముద్దీన్ రాయలసీమ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌రైల్లో జరిగిన ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో కడప ఫోక్సో కోర్టులో నిందితుడికి జీవితకాలం జైలుశిక్ష, 10వేల రూపాయలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. అంతేగాక బాధితురాలికి 10.50లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలని న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ గుంతకల్లు డిఆర్ఎంకు ఆదేశించారు. 2019వ సంవత్సరంలో రైల్లో ఎనిమిదేళ్ల బాలికపై కడపటౌన్‌కు చెందిన గాలిరామ్‌ప్రసాద్‌రెడ్డిఅనే ప్రసాద్‌రెడ్డి(28) రైలు బోగీ బాత్‌రూమ్‌లో అత్యాచారం చేశాడు. అప్పట్లో ఈ కేసును కడప రైల్వేపోలీస్‌లు నమోదు చేశారు. ఫిర్యాదుదారుల కేసు నమోదు చేసిన కడప జిఆర్‌పి పోలీస్ డిఎస్పీ రమేశ్ (ప్రస్తుతం రిటైర్డ్)దర్యాప్తు చేశారు. దీనిపై పిపిలు కొమ్మినేని వేణుగోపాల్, అప్పటి పిపి రామసుబ్బారెడ్డి ఈ కేసు వాదించారు. సాక్ష్యాధారాలతో కోర్టుకు సమర్పించడంతో నిందితుడికి జీవితకాలం జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టడంలో కడప రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగరాజునాయక్ చొరవతీసుకున్నారు.

04-12Pg3 BZ 3 VJA_04-12Pg3 BZ.qxd 04/Dec/25 12:21 AM Page 1



# అగ్రిగోల్డ్ బాధితుల ఆగ్రహం



### యాజమాన్యం కుట్రలను తిప్పికొట్టాలి - అగ్రి ఆస్తుల వేలంను వేగవంతం చేయాలి - సిఎం చంద్రబాబు చొరవ తీసుకుని సమస్య పరిష్కరించాలి - ఒక్క బాధితుడు మరణించినా ఆ బాధ్యత ప్రభుత్వానిదే:ముప్పాళ్ల నాగేశ్వరరావు

**విజయవాడ, ప్రభాతవార్త డిసెంబర్ 03:** తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన చేపట్టారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన బాధితులు బుధవారం విజయవాడలోని రైల్వేస్టేషన్ నుండి ధర్నాచౌక్ వరకు ఆవేదన యాత్రను చేపట్టారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు ఈవి నాయుడు అధ్యక్షతన అవేదన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సమస్యపై పట్టువీడకుండా వేలాదిమంది పోరాటపటిమంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో కొంతమేరకు విజయం సాధించుకున్నామని దీంతో దాదాపుగా 10,4300మందికి రూ 10వేలు, రూ 20వేలు బాధితులకు ఇవ్వడం జరిగిందన్నారు. పలు ఇబ్బందులను తట్టుకోలే దాదాపుగా 1100మంది ఆత్మహత్యలు చేసుకున్నారని, అందులో దాదాపుగా 127మందికి ఎటువంటి రిపోర్టులు లేకుండా పరిహారం ఇప్పించడం జరిగిందన్నారు. కంపెనీలో పెద్దమొత్తంలో డిపాజిట్ చేసినవారు దాదాపుగా 10లక్షలకు పైగా ఉన్నారని వారికి న్యాయం జరిగేవరకు ఈ పోరాటం ఆగదని తేల్చిచెప్పారు. సమస్యను అధిగమించేందుకు చావోరేవో తేల్చుకునే వరకు వెనకడగు వేయకుండా పోరాడాలని హితవు పలికారు. కొంతమంది కంపెనీ యాజమాన్యం భక్తులు ఉండి సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని వారి విజ్ఞతకే వదిలేద్దామని అన్నారు. పూర్తి స్థాయిలో సమస్యను పరిష్కరించే వరకు దాదాపుగా 12 సంవత్సరాల నుండి పలు విధాలుగా ఉద్యమాలు చేపడుతున్నామని, ఇలాంటి ఉద్యమం ఇప్పటివరకు దేశంలోనే జరగలేదని స్పష్టం చేశారు. . పోరాట ఫలితంగా సంస్థకు సంబంధించిన 14వేల ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ ఆస్తిని మ్యూటివేషన్ చేయకుండా కోర్టులో కేసులు వేసి కంపెనీ యాజమాన్యం అడ్డుకుంటుందని, యాజమాన్యం ఆటలను సాగనివ్వమని తీవ్రంగా తిప్పికొడతామని హెచ్చరించారు. కొంతమంది ఎంతోమంది ప్రలోభాలకు గురిచేసిన అగ్రిగోల్డ్ బాధితుల పక్షంగా అసోసియేషన్ నిలబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. సీఐడీలో నిజాయితీ గల అధికారులు బాధితులకు న్యాయం చేయాలని చిత్తశుద్దితో పనిచేస్తున్నారని తెలిపారు. బాధితుల పక్షంగా నిలబడిన అసోసియేషన్‌తో ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కస్టమర్లను, ఏజెంటులను ఇప్పటికీ మోసం చేస్తున్న సంస్థ యాజమాన్యం అవ్వా వెంకట రామారావు, అవ్వా వెంకట శేషు నారాయణను ఇతర ప్రతినిధిల ఇల్లును ముట్టించాలని పిలుపునిచ్చారు. బాధితల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఆస్తులను వేలం వేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. బాధితుల్లో ఏ ఒక్కరు మరణించిన ఆ బాధ్యత ప్రభుత్వానేదని అన్నారు. అధికారంలో లేనప్పుడు పవన్ కళ్యాణ్ అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశమై న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన ఎటువంటి స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రజల అభివృద్ధి కన్నా ప్రపంచంలోని కోటీశ్వరుల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారని కార్పొరేట్ చంద్రబాబుగా పిలిచే పిరిస్థితి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి రాబోయే రోజుల్లో బాధితులను కూడగట్టుకుని 10వేల మంది వంట వార్పు కార్యక్రమాన్ని చేపడతామని పిలుపునిచ్చారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన అర్థం చేసుకుని సమస్య పరిష్కారించాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలు పోరాటడం చేస్తూ ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యక్షంగా ఇద్దరితోను, పరోక్షంగా ఒకరితో సాధ్యమవుతోందని తెలిపారు. ఉద్యమాన్ని ఆస్తులను స్వాధీనం చేసుకునే స్థాయికి తీసుకువచ్చామని సీఐడి అధికారులు బాధితుల పక్షంగా పనిచేస్తున్నారని కితాపు ఇచ్చారు. బాధితులను ఇబ్బందిపెడుతున్న యాజమాన్యానికి ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని పేర్కొన్నారు.

పాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంస్థ చేసిన అన్యాయంతో పిల్లలు చదువులు, వివాహాలు చేసుకునే పరిస్థితి లేదని దీంతో తీవ్ర ఆందోళన చెంది ఆత్మహత్య శరణ్యం అన్నట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

# వైకుంఠదర్శనాలకు పారదర్శకంగా టోకెన్లు జారీ

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రమైన మోక్షమార్గం 'వైకుంఠద్వార"దర్శన విధానంలో గతంకంటే భిన్నంగా ఈ ఏడాది టిటిడి బోర్డు అమలుచేసిన ఆన్‌లైన్ ఇడిప్ విధానంలో తొలిమూడురోజులకు పారదర్శకంగా టోకెన్లు జారీచేసింది. 24లక్షలమంది వరకు భక్తులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక,మహారాష్ట్రలనుండి ఆన్‌లైన్‌లో టిటిడి వెబ్‌సైట్, ఈ మెయిల్, ఏపి ప్రభుత్వవాట్సాప్‌ద్వారా ఆధార్‌కార్డు,మొబైల్‌నంబర్‌తో రిజిష్టర్ చేసుకున్నారు. వారిలో 1.76లక్షలమందికి దేవదేవుని ఆశీస్సులందాయి. వారంతా ఇడిప్‌లో ఉచిత దర్శన టోకెన్లు మెసేజ్ అందుకున్నారు. అలాంటి వారిలో అత్యధికంగా 12,099మంది భక్తులు వెంకట్, శ్రీనివాస్, లక్ష్మి,పద్మావతి, పద్మ అనే పేర్లున్న వారు ఉండటం విశేషమని టిటిడి ఐటి వర్గాల సమాచారం.అయితే ఇ డిప్ టోకెన్లు అందుకున్నభక్తుల్లో తమిళనాడు, తెలంగాణ ప్రాంతవాసులే కొంతవరకు అదికంగా ఉన్నారనేది టిటిడి విడుదల చేసిన జాబితాలో తెలుస్తోంది. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్,కర్నాటక ప్రాంత భక్తులు. ఈ ఏడాది పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో తొలిమూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1కి గాను ఆన్‌లైన్‌లో ఇ డిప్‌ద్వారా టోకన్లు జారీ చేసేశారు.ఆ మూడురోజులు ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తేనే వైకుంఠ దర్శనం కల్పిస్తారు. పూర్తిగా విఐపి బ్రేక్,అన్ని దర్శనాలు రద్దుచేసిన విషయం తెలిసిందే. అలాగే తిరుమల,తిరుపతి,రేణిగుంట,చంద్రగిరి ప్రాంత వాసులకు జనవరి 6,7,8తేదీల దర్శనాల టోకెన్లుకు ఈనెల 10న ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నారు. రోజుకు 5వేలమందికి దర్శనభాగ్యం కలుగుతుంది. మొత్తం 182 గంటల్లో 164గంటలు సామాన్యభక్తులకు దర్శనం కల్పించేలా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు,ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఏర్పాట్లు చేయిస్తున్నారు. జనవరి 2నుండి 8వరకు ఎస్ఇడి రోజుకు 15వేల టిక్కెట్లు, శ్రీవాణి రోజుకు వెయ్యిటిక్కెట్లు ఆన్‌లైన్‌లో జారీచేస్తారు. భక్తులు టిటిడి సూచనలు పాటించి ప్రశాంతంగా దర్శనం చేసుకోవాలని ఇప్పటికే ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. జనవరి 2వతేదీ నుండి 8వరకు పూర్తిగా ఎలాంటి టోకెన్లు, టిక్కెట్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలో వైకుంఠమ్ 2క్యూకాంప్లెక్స్ నుండి సామాన్యభక్తులను అనుమతించనున్నారు.

## దివ్యాంగులకు జ్ఞాపికలు అందించిన డిసిఎం పవన్ కల్యాణ్



**విజయవాడ, ప్రభాతవార్త, డిసెంబర్ 03:** విజయవాడ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులు గోగన ఆదిశేషు, శెట్టివారి రఘులతో ముచ్చటించారు. మార్కాపురానికి చెందిన రఘు, బాపట్లకు చెందిన ఆది శేషుల జీవనం, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్తున్న దివ్యాంగుల జీవితాలు ఎందరికో స్ఫూర్తిగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా వారిద్దరికీ జ్ఞాపికలు అందించారు. వారిద్దరూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పింఛను మొత్తాన్ని పెంచడం మూలంగా తమ జీవనానికి ఒక వెసులుబాటు దొరికింద్ధి అని చెబుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు.

# తిరుమల సమాచారం

## ఉద్యోగులకు సంతృప్తికరంగా బ్రహ్మోత్సవ బహుమానం విడుదల

**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలకొండపై ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్‌లో జరిగిన శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో విశేషసేవలందించిన ఉద్యోగులకు మంజూరుచేసే బ్రహ్మోత్సవ బహుమానం విడుదలకు ప్రభుత్వం అనుమతించింది. అక్టోబర్‌లో జరిగిన టిటిడి ధర్మకర్తలమండలి సమావేశంలోశాశ్వత ఉద్యోగులకు 15,400 రూపాయలు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 7,535 రూపాయలు బ్రహ్మోత్సవ బహుమానంగా,స్థానిక సిబ్బందికి అదనంగా 10శాతం మంజూరుకు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒఅనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి నిర్ణయించి గత బోర్డు సమావేశంలో ఆమోదించిన విషయం విదితమే. తదుపరి ప్రభుత్వం నుండి ఆర్థిక ఆమోదానికి చేసిన విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో ఉద్యోగులు ఎదురుచూస్తున్న బ్రహ్మోత్సవ బహుమానం నూతన ఆంగ్ల సంవత్సరంలో శుభవార్తగా ,ప్రత్యేక కానుకగా 15,400 రూపాయలతోబాటు అదనంగా 1,540రూపాయలు శాశ్వత ఉద్యోగులకు, 7,535రూపాయలు బహుమానంతో బాటు అదనంగా 774రూపాయలు అందుకోనున్నారు. టిటిడిలో 6,200మంది వరకు వివిధ హోదాల్లో శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరేగాక పలు ఏజెన్సీల ద్వారా ,కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో 12వేలమంది వరకు సేవలందిస్తున్నారు. వీరందరికీ జనవరినెల జీతంతో బ్రహ్మోత్సవ బహుమానం కూడా అదనంగా విడుదలకానుంది. ఇప్పటికే ఉద్యోగులకు బ్రహ్మోత్సవాల కానుకగా ఒక కల్యాణం లడ్డూ, ఒక వడ బహుమానంగా టిటిడి అందజేసింది.

## 'దిత్వా' తుఫాన్‌తో తిరుమలలో కుంభవృష్టి



**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** దిత్వా తుఫాన్ ప్రభావంతో బుధవారం ఉదయం నుండి చిరుజల్లులతో పలకరించిన వర్షం సాయంత్రం గంటపాటు కుండపోతవాన కురిసంది. ఉన్నఫళంగా ఒక్కసారిగా బలమైన వర్షంతో భక్తులు పరుగులు తీశారు. గత నాలుగురోజులుగా దిత్వా ప్రభావంతో జడివాన కురుస్తోంది. బుధవారం సాయంత్రం కుండపోత వానతో ఓ వైపు జోరువర్షం మరోవైపు విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు. వర్షంతో భక్తులు ఆలయంలోపలకు శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపలకు వర్షంలో తడిసి లడ్డూవితరణ శాలకు చేరుకోవాల్సి వస్తోంది. భారీ వర్షాల కారణంగా తిరుమల ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం వుందని, వాహనదారులు ,భక్తులు అప్రమత్తంగా ఉండాలని టిటిడి విజిలెన్స్ హెచ్చరిస్తున్నారు. కొండల్లోంచి జలపాతాలు జోరున పరవళ్ళుతొక్కుతూ ప్రవహిస్తున్నాయి.

## శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ ప్రత్యక్షదైవమ్ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని న్యాయ మూర్తులు తెలిపారు. బుధవారం ఉదయం నైవేద్యాల విరామ సమయంలో జస్టిస్ ఇవి వేణు గోపాల్, జస్టిస్ జి.ప్రవీణ్‌కుమార్‌లు కుటుంబంతో కలసి ఉదయం ఆలయంలోనికి చేరుకుని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నాం : ప్రముఖులు



**తిరుమల,డిసెంబర్ 3ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగు ప్రజలందరికీ శుభాలు కలగాలని, అందరూ సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు ప్రముఖులు తెలిపారు. బుధవారం ఉదయం ఏసిబి రాయలసీమ జోన్ జెడి ఇజి అశోక్‌కుమార్, భారత్ బయోటెక్ ఎండి డాక్టర్ కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా, సినీనటుడు సుధాకర్‌కోమల, తమిళన నటుడు జయంరవి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ వేర్వేరుగా విఐపి బ్రేక్ దర్శనాల ప్రారంభసమయంలో ఆలయం వద్దకు చేరుకున్నారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## రేపు డయల్ యువర్ 'టిటిడి ఇఒ'



**తిరుమల,డిసెంబర్ 3 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకు వచ్చిన భక్తులకు వెంకన్న దర్శనంలోగానీ, వసతి కల్పనలో ఎదురైన అనుభవాలు, ఇబ్బందులు, తమతమ సూచనలు,సలహాలు తెలిపేందుకు 5వతేదీ శుక్రవారం తిరుమలలో "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమం జరగనుంది. దేశవిదేశాల్లోని భక్తులు తమతమ ఫిర్యాదులు, సూచనలను శుక్రవారం ఉదయం 9నుంచి 10గంటల వరకు 0877-2263261 నంబర్లకు ఫోన్‌ద్వారా నేరుగా టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్‌తో మాట్లాడే అవకాశం కలుగుతుంది.

## అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ అకాడమీలను పునఃప్రారంభిస్తాం : శాప్ చైర్మన్ రవినాయుడు

**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే ఏడాది జూన్ నాటికి అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ అకాడమీలను పునః:ప్రారంభిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ. అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం పూర్తిగా పరిశీలించామని, వాటిని పూర్తి స్థాయిలో క్రీడాకారులకు ఉపయోగ పడేలా సిద్ధం చేస్తామని తెలిపారు. అల్లూరి సీతా రామరాజు స్టేడియంలో మూడు లేయర్ల సింథటిక్ ట్రాక్ నిర్మిస్తామని చెప్పారు. ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో 81 మందికి స్పోర్ట్స్ కోటాలో పిఇటిలు, పీడీలుగా ఉద్యోగాలు వచ్చినట్లు తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టే విధంగా ఆధార్ అనుసంధానంతో క్రీడాయాప్ తీసుకొస్తామని తెలిపారు. నేషనల్, జోనల్, యూనివర్సిటీ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడా కారులు ఆ యాప్‌లో నమోదు చేసుకుంటే వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, అనంతపురం ప్రాంతాలను స్పోర్ట్స్ హబ్‌లుగా తయారు చేయనున్నామని, ప్రతి జిల్లాలో స్థానికంగా ఎక్కువ ప్రాచుర్యం పొందిన నాలుగు క్రీడలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. జనవరి నాటికి రూ. ఐదు కోట్ల రూపాయలతో అన్ని జిల్లాలకు క్రీడా పరికరాలు అందిస్తామని, త్వరలోనే కోచ్‌ల నియామకాలు చేపడతామని తెలిపారు.

## కల్తీనెయ్యి కేసులో కరీముల్లకోసం సిట్ గాలింపు

### - టిటిడి మాజీ అధికారులను విచారణ దిశగా చర్యలు



**తిరుమల,డిసెంబర్ 3 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యి సరఫరా చేసిన కేసులో సిబిఐ సిట్ అధికారులు చేస్తున్న లోతైన దర్యాప్తులో భాగంగా త్వరలో మూడోఛార్జిషీట్ దాఖలుకు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం రెండుమూడురోజుల్లో టిటిడి మాజీ అధికారులను కొందరిని, ఇదే కేసులో కీలకమైన పరారీలో ఉన్న వినయ్‌చావ్డా ప్రతినిధి కరీముల్లకోసం సిట్ అధికారులు గాలిస్తున్నారు. ఆయన ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు. గత వారంలో నెల్లూరు ఏసిబి కోర్టులో సిట్ అధికారులు దాఖలుచేసిన మెమోతో ఏడుమంది టిటిడి అధికారులపై కల్తీనెయ్యికేసు నమోదైన విషయం విదితమే. కల్తీనెయ్యి బాగోతంలో టిటిడి మార్కెటింగ్ విభాగం మాజీ జిఎం సుబ్రమణ్యంను సిట్ రిమాండ్‌కు పంపింది. ఆయన రిమాండ్ రిపోర్టుతో టిటిడి మార్కెటింగ్ విభాగం జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వెంకట అనిల్‌కుమార్, మాజీ డిప్యూటీ ఇఒ వెంకట్‌నటేశ్‌బాబు, మాజీ జిఎంలు, ఎస్ఇ, ఇఇలు ,గోశాల మాజీడైరెక్టర్ డాక్టర్ హరినాధరెడ్డి(ఇప్పటికే సస్పెన్షన్‌లో ఉన్న)లపై 274,275,316(5), 318(4),61(2),299 రెడ్‌విత్ 3(5)బిఎన్ఎస్ 51,59 సెక్షన్‌ల క్రింద కేసు నమోదు చేశారు. ఈవారంలో వీరిలో కొందరిని సిట్ విచారణకు పిలిచే సమాచారం ఉందనేది తెలుస్తోంది. అరెస్ట్‌లకు కూడా రంగం సిద్దంచేసు కుంటున్నట్లు తెలుస్తోంది. ఈ కేసును డిసెంబర్ 15కి తుదిదశకు తీసుకురావాలని భావిస్తున్న సిట్ మరింత వేగం పెంచింది. 2019-2024 సంవత్సరాల్లో టిటిడి మార్కెటింగ్ విభాగం, కొనుగోళ్ళ విభాగం,డెయిరీ విభాగంకు సంబంధించి కల్తీనెయ్యిలో కీలకమనేది కూడా సిట్ సమాచారం. అర్హత లేని డెయిరీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడం వెనుక పెద్దల హస్తం ఉందనేది కూడా సిట్ గుర్తించిన అంశాలు.

## సిఆర్డిఏ అధికారుల ఆధ్వర్యంలో అనధికారిక లేఅవుట్ల ధ్వంసం



**గుంటూరు, డిసెంబర్ 3, ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సిఆర్డిఏ పరిధిలోని బుధవారం అక్రమ లే అవుట్లను అధికారులు ధ్వంసం చేయించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం పాతపాడులోని సర్వే నెం.114 లోని 5.50 ఎకరాల భూమిలోని అనధికార లే అవుట్, సర్వే నెం.145 లోని 1 ఎకరం 20 సెంట్ల భూమిలోని అనధికార లే అవుట్‌ను సిఆర్డిఏ డెవలప్మెంట్ ప్రమోషన్ విభాగం అధికారులు ధ్వంసం చేయించారు. సిఆర్డిఏ పరిధిలో అనధికార లే అవుట్లను ఎట్టి పరిస్థితులలో ఉపేక్షించబోమని అధికారులు వెల్లడిఆంచారు.

## రైతుల సమస్యల పరిష్కారానికి సివిల్ సప్లై భవన్‌లో కంట్రోల్ రూమ్: మంత్రి నాదెండ్ల



**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం విక్రయ పద్ధతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లై భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం సేకరణ, అందుతున్న ఫిర్యాదులపై అధికారులతో సివిల్ సప్లై భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ అంశాలను ఆయన మీడియాకు వివరించారు.ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి 11,93,743 మెట్రిక్ టన్నుల ధాన్యం తమ ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,830 కోట్లు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా 1967 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెంబరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్ సమస్యలు, టోకెన్ రావడంలో ఆలస్యం, మిల్లుల్లో తూకం సమస్యలు, ఎఫ్‌టిఒ పెండింగ్, రవాణా లేదా గోనె సంచుల కొరత వంటి వాటితో పాటు ఏదైనా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు ఆగిపోవడం వంటి సమస్యలన్నింటినీ టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవచ్చన్నారు. ఫోన్ చేసే ముందు రైతులు వారి ఆధార్, రిజిస్ట్రేషన్, టోకెన్ నెంబర్లు, గ్రామం పేరు, రైతు సేవా కేంద్రం వివరాలు దగ్గర ఉంచుకోవాలని మంత్రి సూచించారు. కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చొరవ తీసుకుంటారన్నారు.

## 23న సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఏపీ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణపై అప్సా అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గం బుధవారంసమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్యానెల్ పదవీ కాలం ముగియనుంది.

ఈ క్రమంలో ఎన్నికలను ఈ నెల(డిసెంబరు) 23వ తేదీన నిర్వహించాలని అప్సా కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అప్సా కార్యవర్గం ప్రకటించింది. తొమ్మిది కేటగిరీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సచివాలయం, అసెంబ్లీతో కలిపి 1200 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

## అమరావతిలో గ్రీనరీకి ప్రాధాన్యత: మంత్రి పి,నారాయణ

**విజయవాడ, డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతి నిధి:** రాజధాని అమరావతిలో పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి నారా యణ స్పష్టం చేశారు.అమరావతిలో 30 శాతం గ్రీనరీకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. 133.3 కి.మీ. పరిధిలో ప్లాంటేషన్ ప్రణాళిక రూపొందించాం. వివిధ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధి చేపడుతున్నాం అన్నారు. శాఖమూరు, కృష్ణాయ పాలెం, నీరుకొండల్లో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్‌కు ప్రణాళిక రూపకల్పన చేశాంఅన్నారు.వచ్చే జనవరి నెలాఖరుకల్లా టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం అన్నారు. రైతు సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం జరుగుతోంది అన్నారు. 29 గ్రామాల పరిధిలో భూ సమీకరణకు రైతులకు ఇవాళ్టికీ విజ్ఞప్తి చేస్తున్నాం.

## టెట్ అభ్యర్థులకు మూడురోజుల్లో హాల్ టిక్కెట్లు

**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండు, మూడు రోజుల్లో హాల్ టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయని కన్వీనర్ ఎమ్‌వి కృష్ణారెడ్డి వెల్లడించారు. వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రతిరోజూ టెట్ పరీక్ష ఉంటుందన్నారు. రోజుకు రెండు పూటలా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. తొలి సెషన్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకు దరఖాస్తులు స్వీకరించగా, 2,41,509 మంది అభ్యర్థులు 2,71,692 దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

## మంగళగిరి గోల్డ్ క్లస్టర్‌కు రూ.75 లక్షలు విడుదల

**విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మంగళగిరిలో బంగారు ఆభరణాల తయారీ క్లస్టర్ దిశగా మరో కీలక ముందడుగు పడింది. గుంటూరు జిల్లా మంగళగిరిలో బంగారు ఆభరణాలు తయారు చేసే పరిశ్రమలకు ఒక ఉమ్మడి సౌకర్యాల కేంద్రం (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.75 లక్షలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సీఎఫ్‌సీ ఏర్పాటుకు మొత్తం రూ.9.99 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం 80 శాతం వాటాగా రూ.7.99 కోట్లు అందిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం 15 శాతం వాటాగా రూ.1.49 కోట్లు భరిస్తుంది. అలాగే, ఈ సీఎఫ్‌సీని పర్యవేక్షించడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రాజెక్టు వాహనం (ఎస్పీవీ) రూ.50 లక్షలు అందిస్తుంది. ఈ సీఎఫ్‌సీ ద్వారా బంగారు ఆభరణాల తయారీదారులు మెరుగైన సౌకర్యాలు పొందనున్నారు. ఇది పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.9/టి.ఓ/2025-26 తేది: 01.12.2025
ర.భ శాఖ మైలవరం డివిజను పరిధిలో 2 పనులకు ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. 2 పనులకు అంచనా విలువ: రూ.12.90 లక్షలు. టెండర్లు స్వీకరించు తేదీలు: 08.12.2025, ఉ.10గం.ల నుండి. టెండర్లు స్వీకరించుటకు ఆఖరు తేది: 23.12.2025, మ.3.00గం. వరకు. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in లో చూడగలరు. ఫోన్ నెం. 9440818058.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, మైలవరం.
DIPR.NO. 18247/CL/ADVT/1/1/2022-23 తేది: 03.12.2025

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
నెం.18(2)/టి.ఓ/2025-26, తేది: 25.11.2025
2025-26 సంవత్సరమునకు రహదారులు మరమ్మతుల నిమిత్తం మొత్తము 2 పనులకుగాను అంచనా విలువ: రూ.65.05 లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది: 05.12.2025, మ.3.00గం.ల నుండి. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in లో పొందవచ్చును. ఫోన్: 08672-252500.
సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) శాఖ, మచిలీపట్నం.
DIPR.NO. 18250/CL/ADVT/1/1/2022-23 తేది: 03.12.2025

వార్త

> నీ అంతరాత్మ ప్రబోధం నీవు పాటిస్తే నీకు స్వయం క్రమశిక్షణ ఉన్నట్లు లెక్క.
>
> -రోజర్


# చలి కాలపు జంఝూటం

దక్షిణాది రాష్ట్రాలను 'చలి పులి' పిండేస్తోంది. జనం ఝాము పొద్దెక్కినా నిద్రలేవలేకపోతున్నారు. చలికి భయపడి మంచాలు దిగిరావడం లేదు. శీతాకాలంలో చలి ఎక్కువగానే ఉంటుందని ముందుగానే భారత వాతావరణ విభాగం హెచ్చరించింది. తెలంగాణతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా లోని అధిక ప్రాంతాలకే ఈ పరిస్థితి ఉంది. తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు పక్కనే ఉన్న పార్వతీపురం, మన్యం, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చలి తీవ్ర ప్రభావాన్ని చూపెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత యేడాది ఇదే సమయంలో చలి ప్రభావాన్ని గమనిస్తే ఈసారి తక్కువేనని చెప్పాలి. చలి ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా ఆయా రాష్ట్రాలలో అధిక చలి వలన సీజనల్ జ్వరాలకు జనంలో ఆందోళన పెరిగిపోయింది. ఆస్పత్రుల్లో రద్దీ పెరిగింది. ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. చలితోపాటు సాంక్రమిక వ్యాధులు ప్రజల్ని ఊపిరి పీల్చుకోనివ్వడంలేదు. ఇంత చలిలోనూ కళ్ల మంటలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలోనే ప్రతి వ్యక్తి నీరు ఎక్కువగా తాగాలని జాగ్రత్తలు చెప్తున్నారు డాక్టర్లు. చలికాలపు శీతల వాతావరణాన్ని గతంలో మాదిరిగా తట్టుకోలేకపోతున్నారు. ఉష్ణోగ్రతలు భారీగా తగ్గిపోవడమే అందుకు కారణం. ప్రత్యేకించి చల్లటి వాతావరణం, పొగమంచుతోపాటు తేమ కూడా కాస్త ఇబ్బందిపెడుతోంది. అధిక చల్లదనాన్ని భరించలేని శరీరానికి రోగ నిరోధక శక్తి కూడా తగ్గిపోతుంది. ఈ సీజన్‌లో వ్యాప్తి చెందే సాధారణ వ్యాధులతోపాటు కొన్ని వైరస్‌లకు సంబంధించిన కొత్త వేరియంట్స్‌తో కలిపిన జ్వరాలు రోగుల మీద దాడిచేస్తున్నాయి. ఈ మధ్య కాలం లో జలుబు, గొంతునొప్పి విపరీతంగా జనాన్ని బాధిస్తున్నాయి. స్త్రీ, బాల, వృద్ధులు వీటికి గురై ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ సీజన్‌లో శ్వాసకోస సంబంధిత వ్యాధులు బాగా ఉధృతంగా ఉన్నాయి. ఈ కాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండడంతోనే జలుబు, గొంతునొప్పులు వగైరా లక్షణాలు కనిపిస్తున్నాయి. ఓ పట్టాన శీతాకాలపు వ్యాధులు అంత గమ్మున తగ్గవు. సతాయిస్తూనే ఉంటాయి. వాటి లక్షణాలు విచిత్రంగా ఉంటాయి. పుండ్లు కూడా మానవు. ఒక్కొక్కప్పుడు శీతగాలులకు కళ్లు మసకబారుతాయి. ఫ్లూ, న్యూమోనియా, బ్రాంకైటిస్ వంటి సీజనల్‌గా వచ్చే వ్యాధులు శ్వాసకోస అలెర్జీలను వెంట తెస్తాయి. తలనొప్పి, తుమ్ములు, కండరాల నొప్పిలతో జ్వరాలు సోకుతున్నాయి. వీటితోపాటు న్యూమోనియా సోకితే కోలుకోవడానికి కొదినద రోజులు పడుతుంది. శ్వాసకోశ వ్యాధులన్నీ ఇబ్బంది పెట్టేవే. శ్వాసకోశంలో ఇన్‌ఫెక్షన్ పెరిగితే కండరాల నొప్పులు, ఉబ్బసం లక్షణాలతో నీరసపడతాయి. కొందరి లో ఆస్మా తీవ్రత పెరిగి ముక్కుదిబ్బడేస్తుంది. గొంతులో శ్లేష్మం ఊరుతుంది. తరచు ఇబ్బంది పెడుతుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గడం వలన రక్తనాళాల్లో ఒత్తిడి పెరిగి ఒక్కోసారి హార్ట్‌ఎటాక్‌కి గురవుతారు. వయసుతో నిమిత్తం లేకుండా చలి నుంచి రక్షణ పొందేందుకు అప్రమత్తమవ్వాలి. చర్మంలో తేమ తగ్గిన సందర్భాలలో చర్మం పొడిగా మారి ఎగ్జిమా, దయాబిటిస్ వ్యాధులకు దారితీస్తాయి. చర్మానికి పోషకాలు అందని పరిస్థితులు ఏర్పడతాయి. చర్మవ్యాధులు సోకితే వంటిపై దద్దుర్లు ఏర్పడడం, మంటలెక్కిపోతుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లో నిర్దేశితకాలాల తో నిమిత్తం లేకుండా కురుస్తున్న వర్షాలు మరో విధంగా రోగాలను ఆహ్వానిస్తున్నాయి. గాలిలో తమ కారణంగా ఒళ్లు మంటలు బాధిస్తాయి. తగినంత నీటిని తీసుకోక పోతే డయేరియా, కలరా వంటి వ్యాధులు సోకుతాయి. శరీరానికి సరిపడనంత నీరు డీహైడ్రేషన్ ఏర్పడుతుంది. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితుల్నుంచి మనల్ని మనమే కాపాడుకోవాలి. సరైన పోషకాహారం తీసుకోవాలి. ఇదే సమయంలో కాలుష్యవ్యాప్తిని కూడా గుర్తించాలి. పొగమంచుతో బయటకువిడుదలయ్యే కాలుష్యగాలి, మంచు కలిపి కలరా వంటి వ్యాధులు వ్యాప్తికి కారణమౌతాయి. ఇదే సందర్భంలో శీతాకాలంలో వచ్చే దోమల బెడదను ఎదుర్కోవాల్సి న ఉంటుంది. మలబద్ధకం,పేగు సంబంధిత సమస్యలు, రక్తస్రావం సమస్యలుంటాయి. వర్షాల వల్ల గుంటల్లోకి నీరు చేరి కాలుష్య కారకాలవుతున్నాయి. ఇక్కడ నిల్వ ఉండే పరిస్థితుల్లో దోమలు విజృంభిస్తాయి. దోమల బాధను తట్టుకోలేక జనం దోమ తెరలను, కాయిల్స్‌లను ఆశ్రయిస్తున్నారు. మలేరియా, ఫైలేరియా వ్యాధు లు సోకకుండా డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. కొత్త తరహా వైరస్ వ్యాధి 'స్క్రబ్ టైఫస్' ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించి ముగ్గురిని కాటేసింది. విజయనగరం, చిత్తూరు పల్నాడు జిల్లాల్లో ఈ వ్యాధి వ్యాప్తి ఉంది. 'చిగ్గర్‌మైట్' కీటకాలు కుట్టడం వల్ల వచ్చేవ్యాధి. దీనిపై అవగాహన పెంచాల్సి నఅవసరం ఉంది. ఈవ్యాధి గురించి రాష్ట్రప్రజలు కొత్తగా వింటున్నారు. అంటువ్యాధి కాదని డాక్టర్లు చెప్తున్నా ఈ వ్యాధి లక్షణాలు,జాగ్రత్తలు గురించి జనానికివిస్తృత పరిచయం చేయాల్సి న అవసరముంది. అధిక జ్వరం, చలి,తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు వంటిపై గోకుడుపుండ్లు వంటివి ఏర్పడతాయి. శీతాకాలపు పుండు బ్రహ్మరాక్షసిగామారకుండా, చలిప్రాంతాలలో అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం అత్యంత అవశ్యకం. ఈవ్యాధి అంటువ్యాధి కాదని శాస్త్ర జ్ఞులే వివరించాల్సి ఉంది. మరింత వ్యాపించకముందే వైద్యసిబ్బందికి అవగాహన కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

> దిగజారడం ప్రారంభించనే కూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.
>
> హెచ్. లాంగ్‌ఫెలో



> మాటకు మాట ప్రతీకారం కాదు, మౌనమే దానికి సమాధానం.
>
> ప్లినీ



# ప్రజావాక్కు



## సామాన్యులకే కష్టాలు

నేరాలు, ఘోరాలు చేసినవారు పట్టుబడినప్పుడు వారిని విచారించే సిబిఐ వారుగాని సిఐడిలేదా ఇతర పరిశోధనా సంస్థల వారిప్రశ్నలకు తెలియదు,గుర్తులేదు, మరచిపోయా అనే సమాధానాలు ఇస్తూ కాలం గుడిపేస్తున్నారు. ఇవి పచ్చి అబద్ధాలని అందరకు తెలుసు. వారికెంత ఆస్తి ఉన్నదో, కుటుంబ సభ్యుల పేర్లమీద ఎన్ని బ్యాంకుల్లో ఎంత సొమ్ము ఉన్నదో వారికి తెలియదా? ఏళ్ళ క్రితం ఎంత చదువు చదివారో,ఏ కాలేజిలలో, ఎంతవరకు చదివారో, ఏ హోదాలను అలంకరించారో, భార్య, పిల్లల బంధువుల స్నేహితుల పేర్లన్నీ గుర్తు ఉండవా? నేరాలు చేసినవవి మాత్రమే గుర్తుండవా? మన దేశంలో కోర్టులు చట్టాలు ఇటువంటి వారిని ఎందుకు శిక్షించలేవు? వీరు కార్లలోనూవారి వందిమాగధులమధ్య ఏభయమూ లేకుండాహుందాగా తలఎత్తుకుని తిరుగుతారు. సామాన్యులకే అన్ని కష్టాలు, భయాలు, అవమానాలు, శిక్షలు.

*- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్*

## పేదరికం లేని రాష్ట్రం

కేరళరాష్ట్రం దుర్భర పేదరికం లేని రాష్ట్రంగా మారడంలో సమిష్టి కృషి ఫలితం,వికేంద్రీకృత ప్రణాళికలు రూపకల్పన చేసింది. ముందు ప్రమాణాలు సెట్ చేసి ఆ ప్రమాణాలు అందుకోలేని కుటుంబాలను గుర్తించి కనీస అవసరాలు అందుకోలేని కుటుంబాలను ఫోకస్ చేసి వాళ్లకు ప్రభుత్వ పరమయిన సహాయం అందేలా చేయడం మూలంగా జీవన ప్రమాణ స్థాయిని అందుకునేల చేశారు. తద్వారా పేదరికం స్థాయిలను తగ్గించుకుంటు వచ్చి పేదరికం లేకుండా చేశారు. కేరళ రాష్ట్రాన్ని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని ఆ దిశగా కృషి చేయాలి.

*- భారత అవినాష్, జనగామ*

## వెనిజులాకు రష్యా అండ

అమెరికా పనామా నుండి మెక్సికో, కెనడా,ఉత్తర ధృవం వరకు భూభాగాలను ఆక్రమించి టెక్నెట్ సామ్రాజ్యాన్ని నిర్మించాలని చూస్తోంది. టెక్నెట్ సామ్రాజ్యం లో ప్రజా ప్రతినిధులు సాంకేతిక నైపుణ్యం ఆధారంగా నియమించబడతారు. ఈఆశయం కోసం వెనిజులా మీద దాడి చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వెనిజులాకు రష్యా అండగా ఉండే అవకాశం ఉంది.

*- పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా*

## అభివృద్ధితో సంక్షేమం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన తెలంగాణ ఉదయ మార్గదర్శిని - అభివృద్ధి ద్వారా సంక్షేమానికి నిధులు రాష్ట్ర భవిష్యత్తు దిశను స్పష్టంగా చిత్రించే ఆలోచనగా నిలుస్తోంది. సంక్షేమకార్యక్రమాలను నిలకడగా కొనసాగించాలంటే రాష్ట్ర ఆదాయం పెరిగి,ఆర్థికవ్యవస్థ బలోపేతం కావాలన్న స్పష్టమైన భావన ఈ మార్గదర్శినిలో ప్రతిధ్వనిస్తోంది. గత కొన్నేళ్లుగా సంక్షేమ పథకాల విస్తరణతో రాష్ట్రంపై పడిన ఆర్థిక భారాన్ని దృష్టిలో పెట్టుకుని, అభివృద్ధిని ప్రధానబలంగా మార్చుకోవాలన్న నిర్ణయం సమయోచితంగాభావించవచ్చు. ఈ మార్గదర్శిని రూపుదిద్దడంలో జాతీయ విధానసంస్థ,భారత నిర్వహణ పాఠశాల నిపుణులు పాల్గొనడం దీనికి శాస్త్రీయతను, ప్రామాణికతను జోడించింది. అభివృద్ధి ప్రణాళికలో వ్యవసాయం-పరిశ్రమలఅనుసంధానం,పెట్టుబడుల పెంపు,నైపుణ్యాభివృద్ధి, గ్రామీణప్రాంతాల ప్రగతి వంటి అంశాలు కీలకంగా పొందుపరిచారు.

*- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి*

## సరదా వెనుక దాగిన సవాళ్లు

ఆధునిక డిజిటల్ యుగంలో ఆన్‌లైన్ గేమ్స్ అనేవి కోట్లాది యువతను ఆకర్షిస్తున్న వినోద వేదికలుగా మారాయి. పబ్జ్, ఫైర్,మిన్ క్రాఫ్ట్, వంటి గేమ్స్ కేవలం ఆటలు మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో మల్టీబిలియన్ డాలర్ల పరిశ్రమగా ఎదిగాయి. ఆధునిక గ్రాఫిక్స్, శబ్ద ప్రభావాలు, రివార్డ్స్, లీడర్ బోర్డ్స్ వంటిఅంశాలు యువతను మరింతగా ఆకట్టుకుంటున్నాయి.కానీవినోదం వెనుకదాగిఉన్న మానసిక,శారీరక, సామాజిక ప్రమాదాలను సమాజం సీరియస్‌గా పరిగణించాల్సి న అవసరం ఉంది. ఆన్‌లైన్ గేమ్స్ ప్రారంభంలో వినోదం కోసం ఆడినా, తరువాత అవి వ్యసనంగా మారుతున్నాయి.

*-వెంకటరమణ, గిలకత్తుల*

## తగ్గిన పేదరికం

భారత్‌లో పేదరికం భారీగా తగ్గిపోయిందని ప్రపంచ బ్యాంకు గణాంకాలు పేర్కొన్నాయి.ఈ లెక్కలు చెప్పిన వారు పట్టణాల్లో గ్రామాల్లో సర్వేలు చేసే చెప్పాయా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రభుత్వ పథకానికి నోచుకోలేనివారు గంజి నీళ్లకు కష్టపడుతున్నారు. మన దేశం చాలా పేద దేశమని పూర్వ రిజర్వుబ్యాంకు గవర్నరు రఘురామ్ రాజన్ ఈ మధ్య నేఅన్నారు. ఈ పేదరికంలో రిటైరైన వారు కూడా ఉన్నారు.

*- ఎం. రామారావు, హైదరాబాద్*

**మనవి** **ఎడిట్ పేజీకి..**

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవద్దు!

**మొత్తం సంక్షోభానికి మూలం ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యత లేకపోవడం. విద్యార్థులు ఇంతటి ఆర్థిక ఒత్తిడిలో చదువుతుంటే వారి విద్యా నాణ్యత ఎలా మెరుగుపడుతుంది? ఒక విద్యార్థి ఆలోచన మొత్తం రేపటి ఫీజుగురించి ఉంటే, అతని దృష్టి చదువుపై ఎలా ఉంటుంది? విద్యార్థులు అనిశ్చితిలో ఉన్న సమాజం అభివృద్ధిచెందదు. మన దేశం బలంగా ఎదగాలంటే మన యువతకు బలోపేతమైన విద్య, ఆర్థిక భద్రత అవసరం. కానీ ప్రస్తుతం జరుగుతున్నది దీని పూర్తిగా విరుద్ధం. ప్రభుత్వం ఏవైనా పథకాలు ప్రారంభించవచ్చు, ఏవైనా నూతన కార్యక్రమాలు ప్రకటించవచ్చు. కాని విద్యపై ఉండే పథకాల విషయంలో రాజకీయాలు చేయకూడదు. విద్యకు సంబంధించిన పథకాలు ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా, నిరంతరంగా కొనసాగాలి. ఒక విద్యార్థి చదువును మధ్యలో ఆపడం అంటే సమాజానికే నష్టం.**



మన్నారం నాగరాజు

రాజకీయ నాయకులు పదవులు, ప్రాభవం కోసం కాదని, సమాజ సేవ కోసం రావాలనే భావన ప్రతి ప్రజాస్వామ్య దేశానికీ పునాది. ఆ ధర్మాన్ని కార్యరూపంలో చూపించిన నాయకుల్లో ఒకరైన డాక్టర్ రాజశేఖర్ రెడ్డి తీసుకువచ్చిన 'ఫీజు రీయింబర్స్మెంట్' పథకం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఒక అమోఘమైన చరిత్రను సృష్టించింది. పేద, మధ్యతరగతి యువత చదువుకి డబ్బులే అడ్డుగా మారకూడదనే సంకల్పమే ఈ పథకానికి కారణం. ఆ సమయంలో వేలాది కుటుంబాలు పిల్లల ఉన్నత విద్యకోసం అప్పులు తీసుకుని, ఆర్థిక ఒత్తిడితో ఉన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో చదవడం సామాన్యుడికి అంత సులభంకాదు. అటువంటి సమయంలో ఆనాటి ప్రభుత్వ నిర్ణయం ఒక సామాజిక విప్లవంలా మారింది. ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీలు ఏ కోర్సు అయినా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ధైర్యంగా చేరగలిగారు. చదువు మాత్రమే జీవితాన్ని మార్చగలదన్న నమ్మకాన్ని ఈ పథకం బలపరచింది. వేలాది మంది మొదటి తరం గ్రాడ్యుయేట్లు, ఇంజినీర్లు, వైద్యులు ఈ పథకం వల్ల సమాజంలో వెలుగు చూసారు. ఒక కుటుంబాన్ని మాత్రమే కాదు, ఆ కుటుంబం వెనుక ఉన్న తరాల భవిష్యత్తును ఈ పథకం మారుస్తుందని అనుభవం చూపింది. ఇక విద్య అనేది ప్రతి సమాజానికీ భవిష్యత్తును నిర్మించే మహత్తర సాధనం. ఒక పేద కుటుంబంపిల్లవాడు చదువుకుంటే కేవలం అతని వ్యక్తిగత జీవితం మాత్రమే మారదు, అతడి కుటుంబం, అతడి వంశం, అతడిగ్రామం, చివరకు సమాజమే ఒక మెట్టు ముందుకు చేరుతుంది. అందుకే విద్యపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అనేది సాధారణ ఖర్చుగా చూడకూడదు. అది భవిష్యత్తుపై చేసేఅత్యంత విలువైన పెట్టుబడి. కానీ ఇటీవలి సంవత్సరాల్లో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం రీయింబర్స్మెంట్‌ను సమయానికి విడుదల చేయకపోవడం, బడ్జెట్ కేటాయింపులను తగ్గించడం, కొత్త నియమాలు పెట్టడం, కాలేజీలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టడం. విద్యార్థుల భవిష్యత్తును నేరుగా ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటి పరిస్థితి ఏమిటంటే, పేద కుటుంబాల్లో చదువుతున్న చాలామంది విద్యార్థులు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల ప్రమాదకరమైన స్థితిలో నిలిచిపోయారు. కాలేజీలు ఫీజులు రాలేని కారణంగా వారిపై ఒత్తిడి పెడుతున్నాయి. 'రీయింబర్స్మెంట్ రాకపోతే మేము క్లాసుల్లోకి అనుమతించలేం' 'సెమిస్టర్ పరీక్షలకు మీరుఫీజు చెల్లించాలి' రీయింబర్స్మెంట్ వచ్చినప్పుడు మేము రీఫండ్ చేస్తాం' వంటి మాటలు విని విద్యార్థులు, వారి తల్లిదండ్రులురోజూ భయాందోళనల్లో ఉన్నారు. దీనివల్ల పేద పిల్లలు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అభ్యుదయ ఆశతో చదువుతున్న యువకులు, తమ చదువును కొనసాగించాలా? లేక ఇంటికి వెళ్లి ఏదైనా కార్మిక పని చేసి కుటుంబాన్ని ఆదుకోవాలా? అనే రెండు మార్గాల మధ్య చిక్కుకుపోతున్నారు. వాస్తవానికి ప్రైవేట్ కాలేజీల పరిస్థితి కూడా అంతే దారుణంగా ఉంది. రీయింబర్స్మెంట్ బకాయిలు 6 నెలలు, 1 సంవత్సరం, కొన్నిసార్లు 2 సంవత్సరాల వరకూ పెండింగ్‌లో ఉండటం వలన కాలేజీలు తమ సిబ్బందికి జీతాలు చెల్లించలేని స్థితికి చేరాయి. ల్యాబ్ పరికరాల నిర్వహణ, హాస్టల్ సదుపాయాలు, విద్యార్థుల సేవా కార్యక్రమాలు అన్నీ బలహీనపడ్డాయి. ఉపాధ్యాయులు స్థిరమైన జీతం రాకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. కొన్ని కాలేజీలు తాళాలు వేసిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. కాలేజీలు మూసివేయబడడం అంటేవాటిలో చదువుతున్న వేలాది విద్యార్థులు అకస్మాత్తుగా వీధుల్లోకి రావడం. ఇవన్నీ చూస్తే రీయింబర్స్మెంట్ వ్యవస్థను నిలబెట్టడంలో ప్రభుత్వం ఎంత వైఫల్యం చెందిందో స్పష్టంగా తెలుస్తోంది. ఇంకా



అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే ఫీజు రీయింబర్స్మెంట్ పంపకాల్లో తీవ్ర గందరగోళం, నిబంధనలలో మార్పులు, సకాలంలో క్లియరెన్స్ లేకపోవడం వంటి వాటి వలన విద్యార్థులలో పెద్ద సంఖ్యలో డ్రాప్ అవడం ప్రారంభమైంది. ఒక విద్యార్థి మధ్యలో చదువు మానేస్తే అది వ్యక్తిగత పరాజయం కాదు, అది ఒక సామాజిక నష్టం. అతని కుటుంబం చేసిన త్యాగాలన్నీ వృధా అవుతాయి. అతని భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఉద్యోగాల్లో పోటీ భారీగా ఉన్న ఈ కాలంలో, ఒక డిగ్రీ ఆపేయడం అంటే అతని జీవితం పూర్తిగా వెనుకబడిపోవడం. కాని దురదృష్టకరం ఏమిటంటే, ఈ డ్రాప్ అవుతున్న యువతపై ఎవరు దృష్టి పెట్టడం లేదు. కనీసం ప్రభుత్వంతో పాటు,రాజకీయ నాయకులు కూడా స్పందించాల్సి న అవసరం ఉంది. ఇక విద్యార్థులు మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. "రీయింబర్స్మెంట్ డబ్బులు ఎప్పుడు వస్తాయి?" అనే ప్రశ్నకు ఎవరు సమాధానం చెప్పడం లేదు. అధికారులు ఒకరికి ఒకరు బదిలీ ఉంటూ, పత్రాలు ఒక టేబుల్ నుంచి మరో టేబుల్‌కి మాత్రమే కదిలిపోతున్నాయి. కానీ ప్రభుత్వం పథకాన్ని కొనసాగిస్తున్నామని చెప్పినా, వాస్తవంలో ఆ పథకం ప్రాణాంతక స్థితిలోకి వెళ్లింది. విద్యార్థుల అభ్యాసం క్రమశిక్షణగా సాగాలంటే ఆర్థిక భారం ప్రభుత్వం భుజాన వేసుకోవాలి. కానీ ప్రభుత్వం కాలం గడుస్తున్న కొద్దీ విద్యపై పెట్టుబడిని తగ్గిస్తూ, పథకాలను బలహీనపరుస్తూ ఉంటే, ఎలా పేదలు ఉన్నత విద్య సాధిస్తారు? పైగా, ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల పరీక్షలు రాయకపోవడం, ఇంటికి వెళ్లిపోవడం, హాస్టల్‌లో బకాయిలతో అవమానకర పరిస్థితులు ఎదుర్కోవడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ఒక ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకపోతే, ఆ ప్రభుత్వం భవిష్యత్తును పట్టించుకోకుండా ఉన్నట్టే. కాలేజీలు కూడా నేటి పరిస్థితుల్లో బలహీనపడ్డాయి. ఒక్కో విద్యార్థి ఫీజు రీయింబర్స్మెంట్ 35,000 నుంచి 70,000 వరకు ఉన్నప్పటికీ, కాలేజీలు సంవత్సరాల తరబడి ఆ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రైవేట్ కాలేజీలు వాణిజ్య వ్యాపారాలుగాకనిపించినా, వాటిలో నడుస్తున్న అధ్యాపకులు, సిబ్బంది కూడా కుటుంబాలు ఉన్న మనుషులే. వారికి వేతనాలు రాకపోతే ఆ కుటుంబాల పరిస్థితి కూడా అలాగే దెబ్బతింటుంది. ఈ మొత్తం సంక్షోభానికి మూలం ప్రభుత్వ నిర్లక్ష్యం, బాధ్యత లేకపోవడం. విద్యార్థులు ఇంతటి ఆర్థిక ఒత్తిడిలో చదువుతుంటే వారి విద్యా నాణ్యత ఎలా మెరుగుపడుతుంది? ఒక విద్యార్థి ఆలోచన మొత్తం రేపటి ఫీజుగురించి ఉంటే,అతని దృష్టి చదువుపై ఎలా ఉంటుంది? విద్యార్థులు అనిశ్చితిలో ఉన్న సమాజం అభివృద్ధి చెందదు. మన దేశం బలంగా ఎదగాలంటే మన యువతకు బలోపేతమైన విద్య,ఆర్థిక భద్రత అవసరం. కానీ ప్రస్తుతం జరుగుతున్నది దీని పూర్తిగా విరుద్ధం. ప్రభుత్వం ఏవైనా పథకాలు ప్రారంభించవచ్చు, ఏవైనా నూతన కార్యక్రమాలు ప్రకటించవచ్చు. కాని విద్యపై ఉండే పథకాల విషయంలో రాజకీయాలు చేయకూడదు. విద్యకు సంబంధించిన పథకాలు ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా, నిరంతరంగా కొనసాగాలి. ఒక విద్యార్థి చదువును మధ్యలో ఆపడం అంటే సమాజానికే నష్టం. విద్యార్థి తన సమయాన్ని కోల్పోతాడు, కుటుంబం తన ఆశను కోల్పోతుంది, రాష్ట్రం తన నైపుణ్యాన్ని కోల్పోతుంది. అయినప్పటికీ ఈ దశలో రాజకీయ నాయకుల నిశ్శబ్దం ఎంతో బాధాకరం. ప్రస్తుతం అత్యవసరం ఏమిటంటే రీయింబర్స్మెంట్ బకాయిలన్నిటినీ వెంటనే క్లియర్ చేయటం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను మరింత పారదర్శకంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ, ప్రస్తుతం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతున్నది. రాష్ట్రంలో 1,800 ప్రైవేట్ కాలేజీల్లో చదువుతున్న 14 లక్షల మంది విద్యార్థులకు రూ.8,042 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, రూ.1,924 కోట్ల స్కాలర్‌షిప్లు పెండింగ్లో ఉన్నాయి. ఈ నిధులు చెల్లించకపోవడంతో విద్యార్థులతో పాటు కళాశాల యాజమాన్యాలు, వాటిలో పనిచేస్తున్న 2.5 లక్షల మంది ఉద్యోగులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యా సంస్థల్లో అక్రమాలు ఉంటే చర్యలు తీసుకోవాలి కానీ బకాయిలను ఆపడం సరికాదు. ఇక తెలంగాణ ప్రభుత్వం అప్పుల్లోఉంది అని ముఖ్యమంత్రి ఒక వేదికపై చెప్పారు కానీ నాయకులు తమ జీతాలు పెంచుకున్నారు. ఒక పథకం బలహీనపడితే అది పదివేల భవిష్యత్తులను దెబ్బతీస్తుంది. అందుకే విద్యార్థుల కోసం, సమాజం కోసం, రాబోయే తరాల కోసం, ప్రభుత్వం ఇప్పటికైనా తన బాధ్యతను గ్రహించి, ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని పునర్జీవితం చేయాలి. ●

# పంటలకు ధరల స్థిరీకరణ నిధి అవసరం

బొల్లిముంత సాంబశివరావు

ఆంధ్రప్రదేశ్లో నేడు మొక్కజొన్న రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారు. సేద్యపు ఖర్చులు పెరగడం, పండించిన పంటకు న్యాయమైన ధర లభించక, మద్దతుధర అలంకారప్రాయంగా మారడం,దళారుల దోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రపంచంలో మొక్కజొన్ననుఅత్యధికంగా ఉత్పత్తి చేసే దేశాలు అమెరికా,మెక్సికో, బ్రెజిల్, చైనాలు. అమెరికా 9కోట్ల,60లక్షల ఎకరాల సాగు ద్వారా 360 మిలియన్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి చేస్తూ మొదటి స్థానంలో ఉంది. అమెరికా ఆర్థికవ్యవస్థలో మొక్కజొన్న ఉత్పత్తి ముఖ్యమైన పాత్రపోషిస్తున్నది. ప్రపంచ ఎగుమతుల్లో అమెరికా వాటానే 50శాతంగా ఉంది. అమెరికా పాలకులు 1930 నుంచి మొక్కజొన్న ఉత్పత్తికి మద్దతు ఇస్తున్నారు. గత 20 సంవత్సరాల్లో సబ్సిడీ సగటు వార్షిక వ్యయం 47లక్షల డాలర్లు. ప్రతిసంవత్సరం అమెరికా రైతు 61 వేల డాలర్ల సబ్సిడీ పొందుతున్నాడు. భారత రైతులకు కేవలం 282 డాలర్లు మాత్రమే సబ్సిడీ లభిస్తున్నది. అమెరికాలో మొక్కజొన్న దిగుబడి హెక్టార్‌కు 11 టన్నులు కాగా, భారత్‌లో 2 టన్నుల 540 కిలోలు మాత్రమే. నేడు భారత దేశంలో 9.89 మిలియన్ల హెక్టార్ల మొక్కజొన్న సాగు ద్వారా ప్రపంచ విస్తీర్ణంలో 4వ స్థానంలోఉంది. ఉత్పత్తి42.3 మిలియన్ టన్నులు. సగటు దిగుబడి ఎకరాకు 20క్వింటాళ్లు. దిగుబడుల్లో చాలా వెనుకబడి ఉంది. అందుకు కారణం దేశ వాతావరణానికి అనుకూలమైన నాణ్యమైన విత్తనాలు దేశ రైతులకు అందకపోవడమే. ఆంధ్రప్రదేశ్‌లో ఈసంవత్సరం 1.42 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. దేశంలో మొక్కజొన్న సాగులో తెలంగాణ5వ, ఆంధ్రప్రదేశ్7వస్థానంలోఉన్నాయి. ఏపీ ఎకరా సేద్యపు ఖర్చు30 నుండి 35 వేలు. కౌలు రైతులు అదనంగా మరో 13వేలు కౌలు చెల్లించాలి. సగటు దిగుబడి 25 క్వింటాళ్లు. కొందరి రైతులకు 35 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తున్నది. కేంద్రం ప్రకటించిన మద్దతుధర 2,400 రూపాయలు. ఈ ధర రైతులకు అంతప్రయోజనం



గాలేదు. ఏపీ రైతులకు మద్దతు ధర లభించక నష్టపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు లేకపోవడంవల్ల ప్రైవేట్ మార్కెట్‌లో లభిస్తున్న ధర 1600 రూపాయలు మాత్రమే. కొన్నిప్రాంతాల్లో 1450 మాత్రమే ధర దక్కుతున్నది. ఫలితంగా రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రాకనష్టపోతున్నాడు. రైతాంగం గిట్టుబాటు ధర లభించక నష్టపోయి అప్పుల పాలౌతుంటే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకునే చర్యలు తీసుకోవాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. దేశ రైతుల వద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయకుండా 5 లక్షల టన్నుల మొక్కజొన్నను మోదీప్రభుత్వం అమెరికా నుండి దిగుమతి చేసుకుంటూ భారత రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నెట్టింది. అమెరికా మొక్కజొన్నను భారత్ దిగుమతి చేసుకోవాలని మోదీని ట్రంప్ బెదిరించడం, ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన చర్చల్లో మా మొక్కజొన్న కొనరా అని అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్లుట్నిక్ భారత ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, అందుకు తలొగ్గిన మోదీ ప్రభుత్వం మొక్కజొన్న దిగుమతిపై15శాతంగా ఉన్న సుంకాన్ని కూడా తొలగించి మరీ దిగుమతి ఒప్పందం చేసుకోవడం భారత ప్రభుత్వంపై అమెరికా ఆధిపత్యానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రప్రభుత్వానికి పంటల కొనుగోళ్ల బాధ్యత ఉంది. గిట్టుబాటు ధర పంటలకు లభించనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోళ్లు చేపట్టి రైతులను ఆదుకోవాలి. అందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా పంటలు కొనుగోళ్లు చేయాలి. నేడు పత్తిరైతులను ఆ విధంగా ఆదుకోవాలి. అలాంటి చర్యలు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధికి 3వేల కోట్లు కేటాయిస్తే, కూటమి ప్రభుత్వం 300 కోట్లు మాత్రమే కేటాయించింది. ఈ మొత్తంతో పంటల కొనుగోళ్లు ఎలా సాధ్యం. కూటమి ప్రభుత్వం మొక్కజొన్న రైతులనే కాదు, ఏ పంట రైతులను ఆదుకోవటం లేదు. ఏ పంటకు గిట్టుబాటు ధరల భించడంలేదు. మొక్కజొన్న కొనుగోళ్లలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల వైఫల్యాలను నిరసిస్తూ, మద్దతు ధర చెల్లించి ప్రభుత్వసంస్థలే రైతులవద్ద ఉన్న మొక్కజొన్నను కొనుగోళ్లు చేయాలని, దళారుల, ప్రైవేట్ వ్యాపారుల దోపిడీని అరికట్టాలని,మొక్కజొన్న దిగుమతులను ఆపాలని ఉద్యమించడమే మొక్కజొన్న నేటిరైతుల తక్షణ కర్తవ్యం. ●

# ఇచ్చిన హామీలను నెరవేర్చేదెప్పుడు?

కైలసాని శివప్రసాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని 2024 సంవత్సరం, ఏప్రిల్ 25వతేదీన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌లు ఉమ్మడిగా పాల్గొన్న రాజంపేట బహిరంగ సభలో ఒకే వేదిక నుండి ఉమ్మడిగా హామీ ఇవ్వడం గమనార్హం. అత్యంత క్లిష్టమైన సూపర్ సిక్స్ హామీలనే స్వల్ప వ్యవధిలో నెరవేర్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు గతంలో తాము ఇరువురూ ఒకే వేదిక నుండి రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ఇచ్చిన పాలనా పరమైన హామీని కూడా కచ్చితంగా నెరవేరుస్తారని రాజంపేట, రైల్వే కోడూరు నియోజక వర్గ ప్రజలలో గంపెడు ఆశలు రేకెత్తాయి. కానీ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు పరిశీలిస్తే రాజంపేట, కోడూరు ప్రజలకు మళ్లీ ఆశాభంగం కలిగేటట్లు కనిపిస్తూ ఉంది. చారిత్రాత్మకంగా, మౌలికవసతులపరంగా, నైసర్గికంగా జిల్లా కేంద్రానికి అన్ని అర్హతలు కలిగిన రాజంపేట గత పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. ఒకవిధంగా చెప్పాలంటే రాజంపేటను జిల్లా కేంద్రం చేయకుండా గత పాలకులు ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారనడంలో ఎటువంటి సందేహం లేదు. గతంలో వై.యస్.జగన్ మోహన్ రెడ్డి రాజంపేటకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి హోదాలో స్వయంగా ప్రకటించి,అందుకు సంబంధించిన జి.ఓ కూడా విడుదల చేశారు. కానీ కొద్ది రోజులకే ఆ మెడికల్ కాలేజీని మదనపల్లికి తరలించడం ఆశ్చర్యకరం. దానికి ప్రతిగా రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ఆసమయంలో వై.సి.పి ప్రజా ప్రతినిధులు రాజంపేట. రైల్వే కోడూరు ప్రజలకు కంటి తుడుపు మాటలు చెప్పారు. కానీ జిల్లా కేంద్రం కూడా అప్పట్లో సుదూర ప్రాంతమైన రాయచోటిని జిల్లా కేంద్రం చేసి అప్పటి వై.సి.పి ప్రభుత్వం రాజంపేట, రైల్వే కోడూరు ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేసింది. రాజంపేట మండలంలో చెయ్యేరు నదిపై 2.26 టి.యం.సి ల సామర్థ్యంతో 10




వేల ఎకరాలకు పైగా సాగునీరు, రాజంపేట మున్సిపాలిటీతో పాటూ 18 గ్రామాలకు త్రాగునీరు ఇచ్చే అన్నమయ్య ప్రాజెక్టు 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుచేత శంఖుస్థాపన చేయబడి 2001లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో పూర్తి చేయబడింది. 2020సంవత్సరం, నవంబరులో అకస్మాత్తుగా అన్నమయ్య ప్రాజెక్టు అప్పటి వర్షాలకు కొట్టుకుపోయింది. కానీ దానిని పునః నిర్మించేందుకు గత ప్రభుత్వంనామమాత్రపు ప్రయత్నం కూడా చేయకపోవడం దురదృష్టకరం. వాస్తవంగా రాజంపేట నియోజక వర్గం అన్ని విధాలుగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమనడంలో ఎటువంటి సందేహం లేదు. బ్రిటీషు వారి కాలం నుంచే రాజంపేటలో సబ్ కలెక్టర్ కార్యాలయం నెలకొని ఉంది. రాజంపేట నియోజక వర్గంలోని పెన్నా నది ఒడ్డున ఉన్న సిద్ధవటంలో గతంలోనే నవాబుల పాలనలో 1807 నుంచి 1812 వరకు జిల్లా కేంద్రం ఉండేది. వర్షాలు వచ్చినప్పుడు పెన్నా నది పొంగుతూ ఉండడంతో సిద్ధవటం నుంచి జిల్లా కేంద్రాన్ని అప్పట్లో కడపకు మార్చడం జరిగింది. క్రీ.శ 1303 లో రాజులు సిద్ధవటంలో బలమైన కోటను నిర్మించుకుని అక్కడి నుంచి సుదీర్ఘ కాలం పరిపాలించినట్లు చరిత్ర తేటతెల్లం చేస్తూఉంది. సిద్ధవటాన్ని దక్షిణ కాశీ ముఖ ద్వారం అని కూడా పిలుస్తారు. రాజంపేట నియోజక వర్గంలోని ఒంటిమిట్ట కూడా ఎంతో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక నేపథ్యాన్ని కలిగి ఉండడం గమనార్హం. 1408 నుంచి 1503 వరకు అన్నమయ్య తిరగాడిన రాజంపేటను కాదని అదే అన్న మయ్య పేరుతో గత పాలకులు రాయచోటిని జిల్లా కేంద్రం చేయడం రాజకీయ విశ్లేషకులను, మేధావులను, చరిత్రకారు లను విస్మయానికి గురిచేసింది. రాజంపేటలో ఇప్పటికి ప్పుడు జిల్లా కేంద్రం నెలకొల్పేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయి. చరిత్రను, సదుపాయాలను, నైసర్గికతను విస్మరించి సుదూర ప్రాంతా న్ని జిల్లా కేంద్రం చేసిన గత పాలకుల తప్పును సరిదిద్ది గత ఎన్నికల సమయంలో తాము ఒకే వేదికపై నుంచి రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని ఇచ్చిన ఉమ్మడిహామీని నిలబెట్టుకోవలసిన బాధ్యత కచ్చితంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై ఉందనేది నిర్వివాద అంశం. ●

## ధాన్యం రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఆర్డీవో మాధురి

ఎ కొండూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : ఎన్టిఆర్ జిల్లా తిరువూరు ఆర్డీవో కె.మాధురి ఎ కొండూరు తహశీల్దార్ కె.లక్ష్మి కోడూరు గ్రామంలో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన వరిపంట ధాన్యం వాతావరణ శాఖ తుఫాన్ ప్రకటనతో అన్నదాతలు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాధురి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల వర్షం వచ్చే అవకాశం ఉండడంతో



అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని ఆరబోసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని హమాలీలు లేని పక్షంలో చుట్టపక్కల గ్రామాల నుండి హమాలీలను ఏర్పాటు చేస్తామని అత్యవసర పరిస్థితుల్లో వ్యవసాయశాఖ అధికారుల నుండి టార్పాలిన్స్ తీసుకుని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్మకాలు జరపాలని ఆర్డీవో మాధురి రైతులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కోడూరు గ్రామంలో ప్రభుత్వ రేషన్ డిపో పోలిశెట్టిపాడు గ్రామంలో తిరుమలధర్మ పెట్రో మార్ట్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు జరిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎ కొండూరు కిడ్నీ ప్రభావిత గ్రామాలకు కృష్ణాజలాల సరఫరా షురూ

ఎ కొండూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : ఎన్టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలంలో సుమారు 50కోట్ల జలజీవన్ నిధులతో కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు చురుగ్గా జరుగుతున్న కృష్ణాజలాల పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసుకుని ప్రస్తుతం ఎ కొండూరు మండలంలో 38 గ్రామాలకు గాను 22 గ్రామాలకు కృష్ణాజలాల పంపిణీ జరుగుతుందని ఆర్‌డబ్లుఎస్ ఎఈ సిహెచ్ నాగలక్ష్మి తెలిపారు. ఈస్ట్ వెస్ట్ మాధవరం మీటియా తండా రేపూడి తండా, కుమ్మరికుంట్ల, పాత రేపూడి, కొత్త రేపూడి, ఎ కొండూరు తండా మత్రియా తండా చైతన్యనగర్, కృష్ణారావుపాలెం, మాన్‌సింగ్ తండా, కేశా తండా, పెద్ద తండా, చీమలపాడు, వెంకట తండా, రామచంద్రాపురం శివారు లక్ష్మీపురం, ఎ కొండూరు, పాత కొండూరు, అట్లప్రగడ, కంభంపాడు, గొల్లమందల, గొల్లమందల తండా గ్రామాల్లో ఎఇఇసిహెచ్ చల్లంచర్ల, సాయి వెంకటలక్ష్మి జలజీవన్ మిషన్ పథకం సూపర్‌వైజర్ ఎస్‌కె వలీ తెలిపారు. మండలంలోని కోడూరు, కరుణాపురం, గున్న చింతలపాడు మారేపల్లి, పోలిశెట్టిపాడు గోపాలపురం, జీళ్ళకుంట వల్లంపట్ల గ్రామాలకు మరో వారం రోజుల్లో కృష్ణాజలాల సరఫరా జరుగుతుందని ఎఈ సిహెచ్ సాయి వెంకటలక్ష్మి జలజీవన్ మిషన్ సూపర్‌వైజర్ ఎస్‌కె వలీ బుధవారం తెలిపారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) విశేష కృషితో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ప్రత్యేక శ్రద్ధ వల్ల కృష్ణావాటర్ సరఫరా జరుగుతుండడం పట్ల కిడ్నీ ప్రభావిత గ్రామాలు హరిజన లంబాడా తండా గ్రామాల ప్రజలు, దళితులు, గిరిజనులు, బిసి మైనార్టీ వర్గాల ప్రజలు ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## దత్తత గ్రామం మోరుసుమిల్లిలో 3వ రోజు ప్రత్యేక శిబిరం

మైలవరం, డిశంబర్ 3, ప్రభాతవార్త : లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన మొరుసుమల్లి మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో వికసిత్ భారత్, మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా, సూర్య మర్ సెంట్రల్ గవర్నమెంట్ స్కీం అనే



అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఎలక్ట్రికల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం ఉమారాణి మైలవరం ఎలక్ట్రికల్ ఏఈ గార్లపాటి రమేష్ బాబు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన, వారు ప్రసంగిస్తూ కరెంట్ బిల్లు కట్టేయడం సమయంలో ఆలోచన పడతారని సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకొని తగినంత కరెంటు ఉత్పత్తి చేర్చుకునేందుకు కేంద్రం ఒక ప్రత్యేక పథకం ప్రవేశపెట్టిందని ఎక్కువైన విద్యుత్ విక్రయించుకొని ఆదాయం కూడా పొందవచ్చని తెలిపారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుందని ఈ పథకం ద్వారా విద్యుత్ భారం నుండి విముక్తి పొందటమే కాకుండా అదనంగా ఉత్పత్తి అయిన విద్యుత్తును ప్రభుత్వానికి విక్రయించి డబ్బు సంపాదించుకోవాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్ వికసిత్ భారత్, మేకిన్ ఇండియా మేడిన్ ఇండియా అనే అంశాలపై తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ ఎస్.ఉమామహేశ్వర్ రెడ్డి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ చల్లా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇదేనా...స్వచ్ఛంధ్ర ..స్వర్ణాంధ్ర?

తిరువూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : తిరువూరు పట్టణం నడి బొడ్డున వున్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రత కు నిలయంగా మారాయి. ప్రభుత్వం ప్రతి వారంలో ఒక రోజున ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర' కార్యక్రమం ఫ్యాషన్ షోగా మారాయని



విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇది నిజమేనా అన్నట్లుగా పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయం, పంచాయితీ రాజ్, హౌసింగ్, ఆర్డబ్ల్యుఎస్, వ్యవసాయ శాఖ కార్యాలయ పరిసరాలు చిట్టడవిలా దర్శన మిస్తున్నాయి. పిచ్చి మొక్కలు, చెత్త చెదారం పేరుకుని విష సర్పాలకు ఆవాసంగా మారి "స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర" కార్యక్రమాన్ని వెక్కిరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ రోజు తిరువూరు మున్సిపాలిటీ వారు పరిసరాల పరిశుభ్రతలో భాగంగా పట్టణంలో ఖాళీగా వున్న నివేశన స్థలాల్లో మెరుగు చేసి, వాటికి ఇంటి పన్ను చెల్లించాలని లేని యెడల ఆ యొక్క స్థలాలు స్వాధీనం చేసుకునేందుకు చట్ట పరంగా చర్యలు తీసుకోవటం జరుగుతుందని అధికారులు మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ప్రజారోగ్యం దృష్ట్యా ప్రైవేట్ స్థలాల విషయమై మున్సిపల్ అధికార యంత్రాంగం స్పందిస్తున్న తీరు హర్షనీయం. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు పరిశుభ్రత, పారిశుధ్యంపై సంబంధిత కార్యాలయాలకు నోటీసులు ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రముఖ అడ్వకేట్ పల్లెపాటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

తిరువూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : ఎన్ టి ఆర్ జిల్లా తిరువూరు పట్టణంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తిరువూరు మండల విద్యాశాఖ అధికారి నందిగామ డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి గవర్నమెంటు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ శ్యామ్ సుందరరావు దివ్యాంగుల నుద్దేశించి మాట్లాడుతూ ఐడిపిడి వార్షిక ఆచారాన్ని 1992లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం 47/3



ద్వారా ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 3న జరుపుకునే ఐడిపిడి వికలాంగుల చేరికను సంబంధించిన క్లిష్టమైన సమస్యలను మద్దతును సమీకరిస్తుంది, వైకల్య సమస్యల గురించి అవగాహన పెంచడాన్ని ప్రోత్సహిస్తుంది మరియు అందరికీ అందుబాటులోని ఉండే సమాజం యొక్క ప్రయోజనాలపై దృష్టిని ఆకర్షిస్తుంది. యుఎన్ ఏజెన్సీలు, పౌర సమాజ సంస్థలు, విద్యాసంస్థలు మరియు ప్రైవేట్ రంగం వికలాంగుల సంస్థలతో కలిసి కార్యక్రమాలు మరియు కార్యకలాపాలను ఏర్పాటు చేయడం ద్వారా ఐడిపిడికి మద్దతు ఇవ్వాలని ప్రోత్సహించబడ్డాయని వారు తెలియజేసారు. సభ అనంతరం ఆహ్వానించబడిన వందమంది దివ్యాంగులకు ఆత్మీయ నిర్వాహకులు వెంపాటి ఆధ్యాత్మ మణిరత్నం, మనసులోని కృష్ణకుమారి ఏర్పాటు చేసిన దుప్పట్లను వారు దివ్యాంగులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు తీగల అంజనేయులు సుబ్బాచారి సయ్యద్ బషీర్ వెంపాటి అభిషేక్ గంటా మహేష్ ఐక్ వివిధ గ్రామాల దివ్యాంగులు పాల్గొన్నారు.

## రైతన్నా మీకోసం వర్క్ షాప్ యాక్షన్ ప్లాన్

తిరువూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో రైతన్న మీకోసం వర్క్ షాప్ నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి పి పద్మ తెలియచేశారు. రబీ 2025-26, ఖరీఫ్ 2026, రబీ 2026-27



సీజన్లకు గాను కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయడం జరిగిందని తెలియచేశారు. ముఖ్యమంత్రి వారి సూచనల మేరకు పంచ సూత్రాలను రైతులకు వివరించి, గ్రామాలలో నీటి వనరులు, యంత్ర పరికరాల లభ్యత, సాగుచేయదగిన భూమి, స్వంత భూమి కలిగిన రైతులు, కౌలురైతుల సంఖ్య, వర్షపాతం, స్టోరేజ్ సౌకర్యాలు, మార్కెట్ సదుపాయాలు భూసారం, తదితర అంశాలను బట్టి రాబోయే మూడు సీజన్లలో పండించే పంటల ప్రణాళికను తయారు చేస్తున్నామని తెలియచేశారు. రైతులు డిమాండ్ ఉన్న చిరుధాన్యాల పంటలు పండించడం, ప్రకృతి వ్యవసాయ విస్తీర్ణము పెంచడం ఆరోగ్యకరమైన ఆహారాన్ని రైతు తన కుటుంబానికి అందించడమే కాక, మార్కెట్లో అమ్ముకొనుట ద్వారా అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలియచేశారు. రైతు సేవ కేంద్ర సిబ్బంది ఎ.పవన్ కళ్యాణ్, వెటర్నరీ అసిస్టెంట్ నాగేంద్ర బాబు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## మై నహీ తో కౌన్ బి ప్రచారంతో రాయల్‌చాలెంజ్ డ్రింకింగ్ వాటర్

అమరావతి, డిసెంబర్ 3, ప్రభాతవార్త : తమ కొత్త ప్రచారం మై నహీతో కౌన్ బి తో రాయల్‌చాలెంజ్ డ్రింకింగ్ వాటర్ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రజలు ఏమనుకుంటున్నారు, నేను ఏమనుకుంటున్నాను అనే మార్పును సూచించేలా ఈ ప్రచారం క్రికెటర్ స్మృతి మంధాన, యూత్‌ఐకాన్ రణ్వీజయ్ సింఘా, గేమింగ్ దిగ్గజం నమన్ మోర్టల్ మాథుర్ దృష్టి లతో ఆకర్షిస్తుందన్నారు.

# విజయవాడ వార్త



## భవానీ భక్తులకు సౌకర్యాలు మరిన్ని పెంచాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాల వేడుకల్లో విజయవాడ నగరపాలక సంస్థ వారే చేసిన ఏర్పాట్ల కంటే భవాదీ ధీక్ష విరమణకు వచ్చే భవానీ భక్తులకు మరిన్ని సౌకర్యాలను పెంచాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఇంజనీరింగ్



అధికారులను ఆదేశించారు. బుధవారం తన పర్యటనలో భాగంగా ఆయన కృష్ణవేణి ఘాట్, బ్రాహ్మణ వీధి, అంబేద్కర్ రోడ్, కెటీ రోడ్ ప్రాంతాలని పర్యటించి, క్షేత్రస్థాయిలో భవానీ దీక్ష విరమణకు వచ్చే భక్తులకు నగరపాలక సంస్థ వారు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీ దీక్ష విరమణ కొచ్చే భక్తులకు గిరి ప్రదక్షిణ ప్రదేశాల్లో సౌకర్యాలను మరిన్ని పెంచాలని ఆదేశించారు. 50 ప్రదేశాలలో త్రాగునీటి పాయింట్లు 15 ప్రదేశాల్లో తాత్కాలిక మరుగుదొడ్లు, ప్రతిపాదించగా, గిరి ప్రదక్షిణ చేసే ప్రదేశాల్లో త్రాగునీటి పాయింట్లు, మరుగుదొడ్లను మరిన్ని పెంచాలని రెండు రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసి పెంచిన వాటితో తనకు నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. భవానీ దీక్ష విరమణకు భవానీ భక్తులు కాలినడకన వస్తారు కాబట్టి భవానీ దీక్షా విరమణ సమయంలో వారు ప్రయాణించే ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో లోపం లేకుండా చూసుకోవాలని, రోడ్డులో కూడా ఎటువంటి గుంతలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత సంవత్సరం లాగానే సామాన్లు భద్రపర్చు గది, చెప్పుల స్టాండు భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భవానీ భక్తులు విడిచి పెట్టే ఎర్ర దుస్తులను ఎప్పటికప్పుడు తొలగించేటట్లు చర్యలు తీసుకోవాలని, కన్వేయర్ బెల్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ యుటి పర్వీన్ జాహిద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంఛార్జ్ పి.సత్యకుమారి, జోనల్ కమీషనర్ రమ్యకీర్తన, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లో ఏదో ఒక సమయంలో ఆకస్మికంగా నోడల్ ఆఫీసర్లు ఆహారాన్ని తీసుకోవాలి : కమీషనర్

విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: అన్న క్యాంటీన్‌లో ఆహార నాణ్యతను మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర స్వయంగా తానే తిని పరిశీలించారు. బుధవారం ఉదయం ఆర్టీసీ వర్క్‌షాపు



రోడ్‌లోని అన్న క్యాంటీన్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అన్న క్యాంటీన్ లోని నోడల్ ఆఫీసర్లు ఖచ్చితంగా ఏదో ఒక సమయంలో ఎప్పుడో ఒక సారి ఆకస్మికంగా ఆహార నాణ్యతను పరిశీలించేందుకు అక్కడ ఆహారాన్ని తీసుకోవాలన తద్వారా వారికి ఆహార నాణ్యత ఖచ్చితంగా తెలుస్తుందని, అక్కడికి వచ్చే ప్రజలను తరచుగా వారి అభిప్రాయాలు తెలుసుకుంటూ ఉండాలని, ప్రతి రోజు పర్యవేక్షిస్తూ అన్న క్యాంటీన్‌లో ఉండే వసతులలో ఎటువంటి మరమ్మత్తులు లేకండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ యుటి ఫర్వీన్ జాహిద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంఛార్జి పి.సత్యకుమారి, జోనల్ కమీషనర్ రమ్య కీర్తన, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరంలో పందులను పునరావాసాలకు తరలించండి

విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: నగరంలో పందులు తిరగడం నిషేధం, వాటిని కేటాయించిన పునరావాసానికి తరలించాలని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖరరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కమీషనర్



ధ్యానచంద్ర ఆదేశాల మేరకు చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె.అర్జునరావు సూచనల మేరకు ప్రధాన కార్యాలయం, నూతన భవనం లోని సమావేశపు హాల్లో పందుల పెంపకందారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నగరంలో పందుల స్వైర విహారం నిషేధమని, వారు వారి పందులను కేటాయించిన పునరావాస కేంద్రాలకు తరలించాలని లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బిపిఎస్,ఎల్ఆర్ఎస్ పెండింగ్ ధరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: భవనాల క్రమబద్ధీకరణ(బిపిఎస్), లే అవుట్ క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) పథకాలపై పెండింగ్ ధరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అధికారులను మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు, టౌన్ ప్లానింగ్ విభాగం పనితీరుపై బుధవారం సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన విభాగాధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో బీపీఎస్, ఎల్ఆర్ఎస్ అమలు



పురోగతి, పీజీఆర్ఎస్ ధరఖాస్తుల పరిష్కారం, డిస్‌ప్లే పరికరాల ఫీజు, జీవో అమలు, టీడీఆర్ ఫైళ్ళ పరిశీలన, ఆర్‌డీపీలు సిద్ధం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను ఆలస్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలన్నారు. పట్టణంలో పెరుగుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, వాటిని మొదటి దశలోనే గుర్తించి అడ్డుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా టీడీఆర్ సంబంధిత ఫైళ్ళను వేగంగా పూర్తి చేయాలని రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్స్‌ను నిర్ణీత గడువులో సిద్ధం చేయాలని సూచించారు. ఉదయం జరిగే ఫీల్డ్ తనిఖీలు పట్టణ నియంత్రణలో అత్యంత ముఖ్యమని ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతానికి ఇవి తప్పనిసరిగా కొనసాగాలని ఆయన అధికారులకు తెలిపారు. సమావేశం ముగింపులో జారీ చేసిన ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం సహించబోమన్నారు. పట్టణ ప్రణాళికా నిబంధనలను కఠినంగా అమలు చేయడం ద్వారా పౌరులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మెహన్‌బాబు, రాంబాబు, పట్టణ ప్రణాళికా సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటాం

విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 3, ప్రభాతవార్త: ప్రతి సారి డ్రైవ్ చేస్తున్నప్పటికీ ఎటువంటి మార్పు రావడం లేదని ఈ సారి ఈ విధంగా ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసిపి రామచంద్రరావు హెచ్చరించారు. సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డిసిపి షిరీన్ బేగం సూచనల మేరకు వన్ ట్రాఫిక్ ఏసిపి రామచంద్రరావు అధ్వర్యంలో సిఐ ఉమామహేశ్వరరావు, ఆర్ఎస్ఐ శ్రీధర్ వారి సిబ్బందితో కలిసి టాక్టికల్ అర్బానిజం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఋషివాలయం వీధిలో ట్రాఫిక్‌కు, పాదచారులకు అంతరాయం కల్గిస్తున్న వివిధ రకాలైన దుకాణాదారులు షాపుల ముందు రోడ్డుపై పెట్టిన వస్తువులు తొలగించి వారికి కౌన్సిలింగ్‌ను గతంలో



నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఆ స్పెషల్ డ్రైవ్‌ను కొనసాగిస్తూ శివాలయం వీధి నుంచి పులిపాటి వారి వీధి వరకు పాదచారులకు, ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్న వివిధ రకాలైన షాపుల వస్తువులను తొలగటించి, సదరు షాప్‌ల యజమానులను, గుమాస్తాలను పిలిచి అక్కడే కౌన్సిలింగ్ నిర్వహించారు. మహా మండపం నుంచి రథం సెంటర్ వరకు ఇదే డ్రైవ్‌ను కొనసాగిస్తూ బస్ షెల్టర్ నందు పెట్టిన వీధి వ్యాపారులతో తోపుడు బండ్లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదచారులకు, ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కల్గించరాదని కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం రోడ్డుపై అస్తవ్యస్తంగా నిలిపిన వాహనాలను తొలగించారు.

## క్రీడలతోనే విద్యార్థులకు మానసికోల్లాసం



పెనమలూరు డిసెంబరు 3, ప్రభాతవార్త : విద్యార్థుల అభివృద్ధికి, శారీరక ఎదుగుదలకు క్రీడలు అత్యంత ప్రాముఖ్యత వహిస్తాయని ఇండియన్‌రైల్వే డిఎస్‌పి జి.రత్నరాజు అన్నారు. కానూరు భాష్యం పాఠశాల ఆవరణలో భాష్యంకృష్ణాజోన్ క్రీడల పోటీలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యాలు చదువుతోపాటు ఆటలకుకూడా సమప్రాధాన్యం ఇవ్వాలని విన్నవించారు. తల్లిదండ్రులు కేవలం చదువులకు మాత్రమే కాకుండా తమ పిల్లలను క్రీడలవైపుకు కూడా ప్రోత్సహించాలని సూచించారు. సిఐ దుర్గారావు మాట్లాడుతూ ఆరోగ్యమేమహాభాగ్యమని గాంధీగారి నానుడిన ఆచరిస్తూ విద్యార్థులకు కేవలం విద్యాబోధనే కాక శారీరక, మానసికధారుడ్యం కోసం ప్రణాళికలు పాఠశాల యాజమాన్యాలు సమాయాత్తపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జోసఫ్‌జోషి, శివ, అరుణ, ప్రధానోపాధ్యాయులు, పి.ఇ.టిలు పాల్గొన్నారు.

## లాంఛనంగా మొదలైన ఉద్భవ్-2025 ఉత్సవాలు

### -- ప్రారంభించిన కేంద్రమంత్రి జువల్ ఓరమ్

తాడేపల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త : గిరిజన విద్యార్థులు చదువుమాత్రమే కాకుండా సంస్కృతి, సాంప్రదాయాలు కూడా నేర్చుకోవాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్ వెల్లడించారు. ఈఎంఆర్ఎస్ బాలబాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. అమరావతి లోని కేఎల్ యూనివర్సిటీ వేదికగా ఉద్భవ్-2025 వేడుకలు కేంద్రమంత్రి తొలిరోజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థులకు హిందీ, ఇంగ్లీషు, ప్రాంతీయ భాష కూడా ముఖ్యమే అన్నారు. గిరిజన వ్యవహారాల శాఖకు వాజ్‌పేయి హాయాంలో నామకరణం జరిగిందని ప్రస్తావించారు. జవహర్‌లాల్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ళ



తరహాలోనే ఈఎంఆర్ఎస్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి స ్పష్టం చేశారు. ఉద్భవ్ అంటే హృదయాంతరాల నుంచి బయటకు తీయడం అనే అర్థం అని, అందుకే ఈ ఉత్సవాలకు ఆ పేరు పెట్టడం జరిగిందన్నారు. ఎంతోకష ్టపడి ఉత్సవాల్లో లోటుపాట్లు లేకుండా నిర్వహిస్తున్న ఏపి ప్రభుత్వం, గిరిజన శాఖమంత్రి సంధ్యారాణి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్‌లను ఆయన అభినందించారు. ఈ సందర ్భంగా 6వ జాతీయ ఈఎంఆర్ఎస్ సంస్కృతి, సాహిత్య, కళా ఉత్సవాన్ని జువల్ ఓరమ్ ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర మంత్రి జువల్



ఓరమ్‌ను రాష్ట్రమంత్రి గుమ్మిడి సంధ్యారాణి సన్మానించి, కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహుకరించారు. గిరిజన సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటుచేసిన ప్రదర ్శనను ఆసక్తిగా తిలకించి, విల్లును పట్టుకుని బాణాన్ని ఆకాశానికి ఎక్కుపెట్టి కేంద్ర మంత్రి సందడి చేశారు.

**--ఉద్భవ్-2025 వేడుక కాదు గొప్పమార్పుకు వేదిక : ఏపి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి**

ఉద్భవ్-2025 వేడుక కాదు... గొప్పమార్పుకు వేదిక అని ఏపి గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి వెల్లడించారు. చిన్నారుల్లోని ప్రతిభ, సృజనాత్మకతను బయటకు తీసి విశ్వాసం నింపాలనేదే లక్ష్యమన్నారు. కొత్త పరిచయాలు, కొత్త సాంప్రదాయాలను తెలుసుకునే అవకాశం ఈ ఉత్సవం వల్ల సాధ్యమవుతుందన్నారు. 405ఈఎంఆర్ఎస్ సూ ్కళ్ళ నుండి 1647మంది తరలివచ్చారని మంత్రి స్పష్టంచేశారు. 110మంది ఆంధ్ర ప్రదేశ్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంత పెద్దసంఖ్యలో చిన్నారులు పాల్గొనే వేదిక ఏపి కావడం సంతోషకరమన్నారు.

**--ఉద్భవ్ 2025ను నిర్వహిస్తున్నందుకు గర్విస్తున్నాం : గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్**

28లక్షల మంది గిరిజనులున్న ఏపిలో ఉద్భవ్-2025కు ఆతిథ్యమిస్తున్నందుకు గర్వపడుతున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 740ఈఎంఆర్ఎస్‌లు ఉన్నాయని, 440ఈఎంఆర్ఎస్ భవనాలను కేంద్ర నిర్మిస్తుందన్నారు. రాష్ట్రాలవారీగా గిరిజనుల జీవనవైవిధ్యం, సంస్కృతిని దేశవ్యాప ్తంగా తెలిపే వేదికగా ఉద్భవ్-2025మారుతుందన్నారు. 20ప్రత్యేక బృందాలను నియమించి పోటీలకు తగిన వసతులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలకు తగ్గ భోజన, వసతి సదుపాయాలు సిద్ధంగా ఉందన్నారు. కెఎల్ యూనివర్సిటీలో 2థియేటర్లు, 3సెమినార్ హాల్స్, 10తరగతి గదులు, ఓపెన్ ఎయిర్ థియేటర్, పెద్ద సెమినార్ హాల్లో వివిధ కేటగిరీలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. గ్రూప్ ఈవెంట్లు, స్టోరీ టెల్లింగ్, క్రియేటివ్ రైటింగ్ పోటీలు కూడా జరగనున్నాయన్నారు. జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. నెస్ట్ ్స ఆధ్వర్యంలో 36బృందాలను సంసిద్ధం చేసినట్లు స్పష్టంచేశారు. క్లినిక్, అంబులెన్స్ వంటి అత్యవసర సదుపాయాలు కల్పించామన్నారు. చిన్నారుల రక్షణ, రవాణాకు లోటు రాకుండా పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో ఏ ఇబ్బంది రాకుండా నిర్వహించేందుకు రాష్ట్ర మంత్రి సంధ్యారాణి నిరంతరం సమీక్షించారన్నారు.

కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ, వక్ ్ఫబోర్డు చైర్మన్ షేక్ హసన్‌బాషా, టిడిపి ఎస్టీసెల్ ప్రెసిడెంట్ దారునాయక్, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్, నెస్ట్ ్స కమీషనర్ అజిత్‌కుమార్ శ్రీవాత్సవ, ఏపి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదా బార్గవి, గురుకులం కార్యదర్శి ఎం.గౌతమి, నెస్ట్ ్స జాయింట్ కమీషనర్ బిపిన్‌చంద్ర రటూరీ, కెఎల్ డీమ్డ్ యూనివర ్సటీ డీన్, ప్రొఫెసర్ జిపిఎస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను వణికిస్తున్న క్యాన్సర్!

### - అమరావతి రాజధానిలో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలి

ఎ కొండూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామ పంచాయతీలో క్యాన్సర్ మహమ్మారి జబ్బు గత కొన్నేళ్ల నుండి జెట్ స్పీడ్‌తో దాడిచేయడంతో చాలామంది వ్యాధిబారిన పడి తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ చీమలపాడు గ్రామంలో కరోనా మహమ్మారి వ్యాక్సినేషన్ వేయించుకున్న అనేక మంది క్యాన్సర్‌తో పాటు గుండె సంబంధిత జబ్బులు ఇంకా ఇతర రుగ్మతలతో పురుషులు, మహిళలు యువతీ యువకులు అనేకమంది ఈ క్యాన్సర్, గుండె జబ్బులు సోకుతుండడంతో మృత్యువు కబళిస్తోందని పలువురు విమర్శించారు. చీమలపాడు ఉద్యమంలో అలాగే శివారు హరిజనవాడలో ఈ క్యాన్సర్ జబ్బులకు గురై అనేకమంది తెలంగాణ రాష్ట్రం (టిఎస్)లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి అనేకమంది వైద్యం కోసం వెళుతున్నారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుండడంతో ఈ మహమ్మారి జబ్బుకు ఆపరేషన్ చేయించుకుంటున్నామని, అయినా ఇంకా అనేక టెస్టుల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తోందని పలువురు క్యాన్సర్ రోగులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు. ఎపి స్టేట్ అమరావతి రాజధానిలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణానికి ఇటీవల కూటమి ప్రభుత్వం స్థలం కేటాయించి ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన జరిపించడం శుభపరిణామని ఈ స్టేట్‌లో అమరావతి రాజధాని ప్రాంతంలో వెంటనే క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకొని ఆదుకోవాలని పలువురు రోగులు తెలుగుదేశం కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అంధకార బంధురం నుండి ఎల్ఈడి బల్బుల కాంతిలోకి ఆర్‌సి పురం



**'వార్త' ప్రభావం**

ఎ కొండూరు, డిశంబర్ 3, ప్రభాతవార్త : ఎ కొండూరు మండలం చీమలపాడు గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం అనే శీర్షికలో వచ్చిన కథనానికి గ్రామ పంచాయతీ సెక్రటరీ యరమల కోటిరెడ్డి స్పందించి గ్రామంలో బిసి కాలనీలో ఎల్ఈడి విద్యుత్ దీపాలను బాగు చేయించి ఎల్ఈడి విద్యుత్ దీపాల కాంతిని ప్రసరింపచేశారు. గత కొన్ని రోజులుగా గ్రామంలో బిసి కాలనీలో వీధి దీపాలు డ్రైన్‌లు అంతర్గత రహదారులు అధ్వాన్నంగా ఉన్న వైనంపై ప్రజా సంఘాలు మహిళా సంఘాలు ఇటీవల గ్రామ పంచాయతీ సచివాలయాన్ని ముట్టడించి ధర్నా చేసిన విషయం పాఠకులకు విధితమే. రామచంద్రాపురం గ్రామం బిసి కాలనీ అంధకార బంధురం నుండి విముక్తి కల్పించిన పంచాయతీ సెక్రటరీ వై.కోటిరెడ్డిని వార్త డైలిని గ్రామప్రజలు అభినందించారు.

## కోటక్ మ్యూచువల్‌ఫండ్ వార్షిక నివేదిక విడుదల

విజయవాడ, డిసెంబర్ 3, ప్రభాతవార్త : రాబోయే సంవత్సరంలో భారత ఆర్థిక మార్కెట్లను ప్రభావితం చేసే మాక్రో ఆర్థిక పరిస్థితులు కీలక పెట్టుబడి ధోరణులపై సమగ్ర దృష్టిని తమ మార్కెట్ అవుట్‌లుక్ 2026 నివేదికలో వెల్లడించినట్లు కోటక్ మహీంద్రా అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ లి ప్రతినిధులు తెలిపారు.

## పంచసూత్రాల అమలుతో రాష్ట్ర వ్యవసాయం కొత్తపుంతలు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ అన్న ఖ్యాతి చిరకాలం కొనసాగాలన్నా..రాష్ట్ర వ్యవసాయ విధానాలు ప్రపంచ సేద్యానికి ఆదర్శంగా నిలవాలన్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టిన పంచసూత్రాల పై ప్రతిరైతు అవగాహన పెంచుకొని, ఆచరణలో పెట్టాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ప్రభుత్వం



ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్నా మీకోసం ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆయన బుధవారం రైతుల్ని ఉద్దేశించి ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొన్ని రోజులుగా వ్యవసాయంలో అనుసరించాల్సిన నూతన విధానాలు, సాగు మెళకువలపై ప్రజాప్రతినిధులు, కూటమిశ్రేణులు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు తెలియచేసి, సాగువిధానంలో వారిని చైతన్యవంతుల్ని చేయడం జరిగింది. రైతన్నా మీకోసం కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనల్లోని అంతర్యాన్ని ప్రతి రైతు అర్థం చేసుకోవాలి. మారుతున్న కాలానుగుణంగా.. ప్రజల జీవనశైలి, ఆహారపు అలవాట్లకు తగినట్టుగా రైతాంగం కొత్త పంటల సాగుపై దృష్టి సారించేలా చేయాలన్నదే ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీకోసం కార్యక్రమం ప్రధానోద్దేశం. ప్రభుత్వం ప్రతిపాదించిన పంచసూత్రాల్ని సాగులో అమలుచేస్తే రాష్ట్ర వ్యవసాయం కొత్తపుంతలు తొక్కడం ఖాయం. తక్కువ నీటితో ఎక్కువ సాగు.. అధిక దిగుబడులు పొందడంపై దృష్టి పెట్టాలి. మార్కెట్లో ఎక్కువగా డిమాండ్ ఉన్న పంటలు, ప్రజలు విరివిగా వినియోగించే పంటల సాగుచేపట్టే దిశగా చేయాల్సిన మరో ఆలోచనే.. డిమాండ్ ఆధారిత వ్యవసాయం. అన్నింటి కంటే ముఖ్యమైన అంశమైన వ్యవసాయంలో సాంకేతికత ప్రతి రైతు విధిగా ఆచరించాల్సిన విధానం. తుపాన్లు, చీడపీడల ప్రభావం నుంచి పంటల్ని కాపాడుకోవాలన్నా.. నేలకు అనువైన పంటల్ని ఎంపిక చేసి, ఎక్కువ దిగుబడులు పొందాలన్నా .. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మేళవించక తప్పని పరిస్థితి. మూస ధోరణలకు భిన్నంగా రైతులు తప్పనిసరిగా సాగులో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టి, వాటిపై పూర్తి స్థాయిలో పట్టుసాధించాలి. అప్పుడే తక్కువ శ్రమ.. పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందగలరు. శ్రమించి పండించిన పంట ఉత్పత్తుల్ని సొమ్ముచేసుకోవడంలో అతి ముఖ్యమైంది ఫుడ్ ప్రాసెసింగ్ విధానం. తాము పండించే పంట ఉత్పత్తుల్ని తామే పలురకాలుగా ప్రాసెస్ చేసి నిల్వచేసి వినియోగదారులకు అందించడంద్వారా రైతులు మరిన్ని లాభాలు పొందే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అలానే నియోజకవర్గ పొగాకు రైతులకు మేలు చేసేందుకు ప్రభుత్వం గతంలో బర్లీ పొగాకు కొనుగోళ్లను విరివిగా చేపట్టింది. రైతు ఉత్పత్తుల కొనుగోళ్లలో రైతులకు నష్టం చేకూర్చేలా ఉన్న పలు నిబంధనల్ని మార్చడం.. సరళతరం చేయడంపై కేంద్రప్రభుత్వం వెంటనే దృష్టి సారించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాల సూచనలు, సలహాలకు అనుగుణంగా రాష్ట్ర రైతాంగం తాము అనుసరించే సాగు విదానాలతో పాటు పంచసూత్రాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. వ్యవసాయ యంత్రపరికరాలు, టార్పాలిన్లు, ట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు, డ్రోన్లను రైతులకు సబ్సిడీపై అందించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. దానిలో భాగమే రైతుల ఇళ్లకు వచ్చి వ్యవసాయ సిబ్బంది, అధికారులు సేకరిస్తున్న వివరాలు. అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వసాయం.. సబ్సిడీ సకాలంలో అందించడంలో వ్యవసాయ యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలి. " అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒక ప్రకటనలో సూచించారు.

## వికాస్ విద్యార్థుల చేయూత

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పెదనందిపాడు రోడ్డు లో ఉన్న "వికాస్ స్కూల్ "విద్యార్థులు తమ దాతృత్వ గుణాన్ని చాటుకున్నారు. మార్టూరులో ఉన్న " శారద విద్యానికేతన్ అనాధాశ్రమానికి" మేము సైతం చేయూత అందిస్తాం"అంటూ ముందడుగు వేసి



తమ సేవా గుణంతో ఆశ్రమ విద్యార్థులకు నిత్యావసర వస్తువులను,మరియు బుక్స్, ప్యాడ్స్, కలములు మొదలైన వస్తువులను " శారద విద్యానికేతన్ అనాధాశ్రమాన్ని "సందర్శించి తమ వంతు సాయం చేశారు. వికాస్ స్కూల్ యాజమాన్యం వారు కేవలం చదువు మాత్రమే కాకుండా తోటి వారి మీద మానవత్వం కలిగి ఉండడం చాలా అవసరం అని గమనించి విద్యార్థులకు స్వయంగా అవగాహన కలిగించుటకు ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా వికాస్ స్కూల్ డైరెక్టర్స్ శ్రీ దండా పవన్ కుమార్ గారు, శ్రీమతి దండా రోజశ్రీ గారు విద్యార్థుల్లో ఉన్న దయాగుణాన్ని ప్రశంసించారు. విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రంగుల పిచ్చితో పేదల సొంతింటి కలను నీరుగార్చిన పాపం వైసీపీదే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల్ని నిరుపయోగంగా మార్చి లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం చేసిందని, గత పాలకులు రంగుల పిచ్చితో పేదల సొంతింటి కలను నీరుగార్చారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణం.. కేటాయింపు.. లబ్ధిదారులకు రుణ మంజూరు తదితర అంశాలపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి, మీడియాతో మాట్లాడారు. ఫేజ్ 1లో ఇళ్లు మంజూరైన 520 మంది లబ్ధిదారులకు ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ద్వారా



రుణం.. ఇళ్లు పొందిన లబ్ధిదారులకు జాతీయ బ్యాంకులు ఇప్పటికే వివిధ కారణాలతో రుణాలు మంజూరు చేయలేదని, వారికి రుణాలు అందించేందుకు కొన్ని హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని ప్రత్తిపాటి చెప్పారు. ఈజీ హౌసింగ్ ఫైనాన్స్, ఐ.ఐ.ఎఫ్.ఎల్ ఫైనాన్స్ సంస్థలు టిడ్కో లబ్ధిదారులకు రుణాలివ్వడానికి ముందుకొచ్చాయన్నారు. ఇళ్లను సద్వినియోగం చేసుకునేవారికి నిబంధనలు సడలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని సదరు సంస్థల ప్రతినిధులు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. ఫేజ్ 1 లో అర్హత పొందిన 520 మంది లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాల్సి ఉందని, వారంతా ఒకేసారి పూర్తిసొమ్ము కట్టినా, లేదా బ్యాంకులు, ప్రైవేట్ సంస్థల రుణం తీసుకున్నా ఇళ్ల రిజిస్ట్రేషన్ చేయడం జరుగు తుం దన్నారు. ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు పదిరోజుల్లో రుణాలు అందించేలా చూస్తామని హామీ ఇచ్చారని ప్రత్తిపాటి చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ పద్ధతిలో కేటాయించిన ఇళ్లను కూడా జగన్ రద్దుచేసి, పేదల ఆశలపై నీళ్లు చల్లారు 2014లో టీడీపీ ప్రభుత్వం పేదలకు సొంతిళ్లు అందించి వారి కలలను నిజం చేయాలనే గొప్పఆశయంతో కేంద్రప్రభుత్వ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో గృహాల నిర్మాణం చేపట్టిందన్నారు. 80 నుంచి 90శాతం వరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి రాజకీయాలకు అతీతంగా..ఎలక్ట్రానిక్ పద్ధతిలో డ్రా తీసి లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. కానీ తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను కూడా రద్దుచేసి, లబ్ధిదారుల ఆశలపై నీళ్లు చల్లిందని, తామే సొంతంగా ఇళ్లు నిర్మించి ఇస్తామన్న వైసీపీనేతలు చివరకు పేదల్ని నమ్మించి మోసగించిందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా పేదలకు ఇళ్లు అందిస్తామని నమ్మబలికిన జగన్.. టీడీపీప్రభుత్వం నిర్మించిన ఇళ్లపై తన పార్టీ రంగులు వేయించి, ఇళ్లపై తన బొమ్మలు వేయించుకొని చివరకు పేదల ఇళ్లను తాకట్టు పెట్టి రుణం పొందాడన్నారు. ఆ రుణభారం తమపై పడటంతో ఏం చేయాలో తెలియక పేదలు గగ్గోలు పెడుతున్నారని, జగన్ అధికారం కోల్పోయినా.. ఆయన పాపాలు మాత్రం ప్రజల్ని వేధిస్తూనే ఉన్నాయని ప్రత్తిపాటి చెప్పారు. గెలిచిన వెంటనే టిడ్కో గృహాలపై దృష్టి పెట్టి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశాను కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ తప్పుల్ని సరిచేస్తూ.. అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందన్నారు. గతంలో దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు, సచివాలయ భవనాలు, కుటుంబాలకు వారికి ప్రత్యేక గదులు, శ్మశానం ఏర్పాటు వంటివి టిడ్కో గృహ సముదాయం వద్ద చేపట్టినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లలో నివాసముండే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదన్న సదుద్దేశంతో తాను వచ్చాక టిడ్కో సముదాయంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయించానని, అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయించడం జరిగిందని ప్రత్తిపాటి చెప్పారు. వచ్చే ఏప్రియల్ నాటికి 5,520 ఇళ్లల్లో గృహ ప్రవేశాలు చేయిస్తాం.. వచ్చే ఉగాది నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలనే కృత నిశ్చయంతో కూటమిప్రభుత్వం ఉందన్న ప్రత్తిపాటి. ఆ క్రమంలో పట్టణంలో నిర్మించిన 5,520 ఇళ్లల్లో ఏప్రియల్ నాటికి గృహప్రవేశాలు జరిగేలా కార్యాచరణ చేపట్టామన్నారు.

## గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం పై వర్క్ షాప్

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ప్రభుత్వం వారి ఆదేశాలు అనుసారం మరియు జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ వారి ఆదేశానుసారం రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరితో కలిపి గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం పై వర్క్ షాప్ నిర్వహించడం జరిగినది, ముఖ్యంగా సాగు నీటి వాడకం, డిమాండ్ ఉన్న పంటలపై అవగాహన కల్పించడం, అగ్రి టెక్, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ప్రభుత్వం వారు కల్పించే మద్దతు ధరలు ఈ పంచ సూత్రాలు పై గ్రామంలోని రైతులు,నాయకులతో చర్చించడం జరిగింది. అలాగే గ్రామాలలో ఉన్న ఉత్పతులపై చర్చించి గ్రామానికి అవసరమైన



వ్యవసాయం, ఉద్యానం, బిందు సేద్యం,పాడి పంటలపై చర్చించి విలేజ్ యాక్షన్ ప్లాన్ తయారు చేసే సిద్ధం చేసే లాగాన ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.పసుమర్రు గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి, సహాయ వ్యవసాయ సంచాలకులు కె. వి శ్రీనివాసరావు , మండల రెవెన్యూ అధికారి షేక్ మొహమ్మద్ , మండల వ్యవసాయ అధికారిని, సరిత , ఉద్యాన అధికారి లక్ష్మి , మరియు మార్కెట్ యార్డ్ చైర్మన్ కరిముల్లా , మునిసిపల్ చైర్మన్ రఫాని పార్టీ నాయకులైన నెల్లూరి సదాశివరావు గారు, మదన్ , సొంపాలు హాజరై రైతన్న మీకోసం రైతులతో ముఖా ముఖి గా మాట్లాడటం జరిగింది.అన్నంతరం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మండల వ్యవసాయ అధికారిని గారి కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది అందరి కోత ప్రయోగం, విలేజ్ యాక్షన్ పై వ్యవసాయ సహాయకులు శ్రీనివాసరావు , అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారిని, మండల వ్యవసాయ అధికారిని అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# పల్నాడు జిల్లా వార్త



## నూజెండ్లలో రైతన్నా మీ కోసం గ్రామసభ



నూజెండ్ల, డిసెంబర్3, ప్రభాతవార్త: మండలకేంద్రమైన నూజెండ్లలోని రైతు సేవా కేంద్రం నందు ఎంపిడివో ఉమాదేవి ఆధ్వర్యంలో రైతన్నా మీ కోసం గ్రామసభ బుధవారం నిర్వహించారు. రైతులు పెట్టుబడులు తగ్గించి ఆదాయం పెంచుకునే దిశగా ఆలోచించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన, మైక్రో ఇరిగేషన్ వంటి పలు రకాల శాఖల ద్వారా అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలు వివరించారు. సేంద్రియ, జీవ ఎరువుల వాడటం మంచిదని అవగాహన కల్పించారు. సొసైటీ జిల్లా మాజీ డైరెక్టర్ గంగినేని ఆంజనేయులు, నూజెండ్ల సొసైటీ సీఈవో గంగినేని శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ లాలు, వ్యవసాయ సహాయకులు బాలాజీ, రైతులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు: చీఫ్‌విప్ జీ.వీ, మక్కెన

ఈపూరు, డిసెంబర్3, ప్రభాతవార్త: కూటమి పాలనలో నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని గోపువారిపాలెం గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో నూతన నిర్మించిన సిమెంటు రోడ్డును డీసీసీబీ ఛైర్మన్ మక్కెనతో కలసి జీ.వీ ప్రారంభించారు. అలాగే



రూ.32లక్షల వ్యయంతో నూతన నిర్మించనున్న పంచాయితీ భవానికి భూమి పూజతో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన, జనసేన నాయకులు ఎన్. శ్రీనివాసరావు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపాడులో ఘనంగా రైతన్నా మీ కోసం కార్యక్రమం

నూజెండ్ల, డిసెంబర్3, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఛైర్మన్ మీసాల





మురళీకృష్ణయాదవ్ అన్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. పశుపోషకులకు ఉచితంగా అందించేప్రత్యేక స్టాల్స్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలు పొందడంతోపాటు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి మెరుగైన ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో ఉప్పలపాడు తెదేపా యూనిట్ ఇంచార్జి రొడ్డా వీరాంజనేయరెడ్డి, ఏవో ఆంజనేయనాయక్, బత్తుల గోవిందరాజులు, సొసైటీ డైరెక్టర్ పరబ్రహ్మరెడ్డి, రాయల్ శ్రీకాంత్, రెడ్డి వెంకటరత్నం, హౌసింగ్ ఏఈ యలమంద, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా గెలుపే లక్ష్యం

### రాష్ట్ర నాయిబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్


బొల్లాపల్లి, డిసెంబర్3, ప్రభాతవార్త: స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని ఏపీ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. మండలంలోని మూగచింతలపాలెం గ్రామంలోని 57వ పోలింగ్ బూత్‌కు తెదేపా



తరుపున పరిశీలకులుగా నియమితులైన గంగాధర్ అక్కడి బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇంచార్జులు ,క్లస్టర్ ఇంచార్జ్ నాయకులు, కుటుంబ సాధికార సారధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి బూత్‌లో పార్టీ అత్యధిక మెజార్టీ సాధించేలా సమిష్టిగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో బోయపాటి కోటయ్య, బూత్ కన్వీనర్ ఏసోబు, కో కన్వీనర్ బాబు, నారాయణ, కోటేశ్వరరావు, ఏడుకొండలు, నరసింహారావు, నాసరబాబు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌తో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతం: కన్నా


సత్తెనపల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం భృగుబండ గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న సత్తెనపల్లి నియోజకవర్గ శాసనసభ్యులుకన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ, డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం జరిగిందన్నారు. వ్యవసాయం లాభసాటి కావాలని, అన్నదాతల బతుకులు మారాలనేదే కూటమి ప్రభుత్వ ధ్యేయం అన్నారు. జగన్ వంచనలతో మోసపోయిన రైతుకు.. కూటమి ప్రభుత్వంతో నిజమైన భరోసా



కల్గిందన్నారు. శాస్త్రీయ వ్యవసాయంతోనే రైతుకు గిట్టుబాటుప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహంరైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గాలిపండించిన పంటకు మరింత విలువ జోడించేలా చర్యలువ్యవసాయ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెటింగ్ ఉందన్నారు. రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజు చేసేందుకు, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతుసంక్షోభం నుంచి సంక్షేమం దిశగా సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ప్రతి హామీని అమల్లోకి తెచ్చామన్నారు.17 నెలల కాలంలో సూపర్ సిక్స్ ని సూపర్ హిట్ చేశాంతల్లికి వందనం, స్త్రీ శక్తి, ఉచిత బస్సు,దీపం 2, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, మెగా డీఎస్సీ, అన్నదాత సుఖీభవ, వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశాం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు 90 శాతం అమలు చేశామన్నారు. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తున్నాం. రికార్డుస్థాయిలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాం.. ధాన్యం విక్రయించే రైతుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ తీసుకొచ్చామని తెలిపారు. గత ప్రభుత్వం పంటల బీమా కూడా చెల్లించలేదని, రైతు జీవితానికి నమ్మకంగా నిలిచింది సిఎం చంద్రబాబే అన్నారు. రైతుల సంక్షేమాన్ని నిజమైన అర్థంలో కాపాడే పథకం "అన్నదాత సుఖీభవ". పీయం కిసాన్తో కలిపి ఈ పథకం ద్వారా రైతు కుటుంబాలకు సంవత్సరానికి రూ.20,000 ఆర్థిక సహాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం ముందుకొచ్చిందన్నారు. వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## దివ్యాంగుల సేవలో జ్యోతి ఫౌండేషన్

సత్తెనపల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణంలోని సుగాలీ కాలనీలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా 30 మంది దివ్యాంగులకు నిత్యావసర సరుకుల కిట్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలను సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ వేశారు. అనంతరం సభా కార్యక్రమం నిర్వహించారు. సభా



అధ్యక్షుపి గా సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ జ్యోతి పౌండేషన్ అధ్యక్షురాలు వలేటి కుమారి అనేక సేవా కార్యక్రమాలు చిన్న వయస్సులో చేస్తూ పలువురికి ఆదర్శనీయం అని అన్నారు. ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి వెలకట్టలేనిది అని అన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వ పరంగా అనేక పథకాలు అమల్లో ఉన్నాయి అని అన్నారు. సత్తెనపల్లి మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, ఆర్య వైశ్య యువజన సంఘం నాయకులు కొత్త రామకృష్ణ, సత్తెనపల్లి అగ్రికల్చర్ మార్కెటింగ్ యార్డ్ డైరెక్టర్ పోతుగంటి రామకోటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు, నంద్నిగ చిట్టిబాబు, సొలస ప్రసాద్, ఇమ్మడిశెట్టి సంపత్ కుమార్ ,బక్క సుబ్బారావు వలేటి కుమారి పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం అన్ని పంచాయితీలలో గ్రామ సభలు

యడ్లపాడు, డిసెంబర్ 3, ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్య మంత్రి నారాచంద్రబాబు నాయుడు సూచనల మేరకు మండల వ్యాప్తంగా 2025నవంబర్ 24నుండి29 వరకు రైతన్న మీకోసం వారోత్సవాలు నిర్వహించటం జరిగిందని ఏవో హరిప్రసాద్ తెలిపారు. వ్యవసాయ మరియు అనుబంధ రంగాలు బృంధాలు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్ర పరిధిలో రైతులతో సంభాషించి ప్రభుత్వం తెలిపిన ఐదు సూత్రాలు అయిన నీటి భద్రత, డిమాండ్ అధారిత పంటల సాగు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ మరియు ప్రభుత్వ మద్దతు గురించి వివరించడం జరిగిందన్నారు. వారోత్సవాలలో కొనసాగింపుగా రైతు సేవా సిబ్బంది రాబోవు మూడు సీజన్లకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం కొరకు అన్ని సచివాలయ పరిధిలో గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా ఉన్నవ



గ్రామసభలో జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి మరియు మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రహ్మణ్యం పాల్గొగి ప్రసంగిస్తూ స్థిరమైన అదాయం గ్రామీణ ఉపాధి మహిళలకు అర్థిక సాధికారత మరియు పట్టు పరిశ్రమలకు ప్రభుత్వం మద్దతు తదితర అంశాలపై వివరించారు. తదుపరి పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం నాగేశ్వరరావు విచ్చేసి వివరిస్తూ వ్యాధి నిరోధక టీకాలు సామూహిక నట్టల నివారణ కార్యక్రమం యానిమల్ హెల్త్ క్యాంప్స్ మరియు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా బహువార్షిక పశుగ్రాసాల సాగు, నీటి తొట్టెల నిర్మాణం, మినీ గోకులం షెడ్, గడ్డి విత్తనాల సరఫరా, పశుదాన సరఫరా, భీమా పథకం, లింగ నిర్ధారణ వీర్యం, నేషనల్ లైఫ్ స్టాక్ మిషన్ వంటి అంశాల గురించి వివరించారు. అనంతరం గ్రామ వారి కార్యాచరణ ప్రణాళిక తయారీ కొరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి ప్రిన్సిపల్ సైంటిస్ట్ కీటక విభాగం నుండి డాక్టర్ సాంబశివరావు, బ్రీడింగ్ డిపార్ట్మెంట్ నుండి డాక్టర్ చాముండేశ్వరి, అగ్రికల్చర్ ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ నుండి డాక్టర్ రామారావు విచ్చేసి మాట్లాడుతూ రైతులు వారి యొక్క గ్రామ పరిధిలోఉన్న ఇబ్బందులు గమనించి వాటినుండి అధికమించుటకు సరైన ప్రణాళిక రచించుకొని దానికి అనుగుణంగా సాగుచేసిన అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. సంఘటితంగా ఉంటేనే మంచి అభివృద్ధి సాధించగలుగుతారని, దీని కొరకు ఫార్మర్ ప్రోడ్యూసర్ అర్గనైజెషన్ ఏర్పాటు చేసుకోవాలని, తదుపరి ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ వేసవిలో పిఎమ్‌డిఎస్ విధానంలో 365రోజులు భూమిని ఖాళీగా ఉంచకుండా ఏదో ఒక పంటతో భూమిని కప్పి ఉంచినచో భూమిలో పోషకాలు బాగా పెరిగి ప్రకృతి వ్యవసాయ సాగుకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపి అధ్యక్షుడు కామినేని సాయిబాబు, మర్రిపాలెం పిఎసిఎస్ ఛైర్మన్ కుర్రా రత్తయ్య, ఎంపీడీవో హేమలత, రైతులు పాల్గొన్నారు.

## చిలకలూరిపేట పట్టణ బిజెపి పార్టీ ఉపాధ్యక్షునిగా అడుసుమల్లి వెంకటేశ్వర్లు

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవ్నర్గ చిలకలూరిపేట భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు ఏలూరి శశి కుమార్



ఆదేశాల మేరకు పట్టణ ప్రధాన కార్యదర్శి సింగరేసు పోలయ్య చేతుల మీదుగా అడుసమల్లి వెంకటేశ్వర్లు కి పట్టణ బిజెపి ఉపాధ్యక్షులుగా నియామక పత్రం అందించడం జరిగింది, అడుసు మల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ నియమావళి ప్రకారం నడుచుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి సింగిరేసు పోలయ్య, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల శివ నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యులు వరికూటి నాగేశ్వరరావు, పట్టణ మీడియా ఇంచార్జ్ రావికింది రామకృష్ణ మైనార్టీ మోర్చా అధ్యక్షులు మాబు సుభాని బిజెపి నాయకులు రాయుడు, కోట చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్, కాలేజీ బస్సుల తనిఖీ

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: రాష్ట్ర రవాణా శాఖ కమీషనర్ ఆదేశాలమేరకు 28.11. 2025 నుండి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుచున్న స్కూల్ , కాలేజీ బస్సుల ప్రత్యేక తనిఖీలలో భాగంగా



బుధవారం స్థానిక స్కూల్ బస్సులను పల్నాడు జిల్లా రవాణా శాఖాధికారి జి.సంజీవ్ కుమార్ ఆధ్వర్యములో తనిఖీలు నిర్వహించడం జరిగింది. సరిగా లేని వాటికీ నోటీసులు ఇచ్చామని, 17 బస్సులను తనిఖీ చేసి 8 బస్సులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 71 బస్సులను తనిఖీ చేసి 30 బస్సులకు నోటీసులు ఇవ్వడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.

## హలో యువత మేలుకో చెడు వ్యసనాల నుండి నిన్ను నువ్వు కాపాడుకో

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: మత్తు పదార్థాల బారి నుండి యువతను కాపాడుకుందాం... దేశ అభివృద్ధిలో



యువతను భాగస్వామ్యం చేద్దాం..ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్ ను విడుదల చేసిన పల్నాడు జిల్లా ఎఎస్పి సంతోష్, డిఆర్వో ఏకా మురళి. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ,.సిపిఐ సుభాని, ఎఐవైఫ్ నాయకులు కె మల్లికార్జున్, రాంబాబు నాయక్, రవి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

నాదెండ్ల, డిసెంబర్ 3, ప్రభాతవార్త: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నాదెండ్ల మండలం గణపవరం గ్రామం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల శాంతినగర్ నందలి భవిత కేంద్రం నందు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాదెండ్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి సి. హెచ్



శ్రీనివాసరావు దివ్యాంగులైన బాలలకు సరైన తర్ఫీదు చేసి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు చేస్తున్నందుకు భవిత కేంద్రం సిబ్బందిని అభినందించారు. నాదేండ్ల మండల విద్యాశాఖ అధికారి ఈమని కృష్ణారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయిని, వి. కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, భవిత కేంద్రం రిసోర్స్ టీచర్స్ నిర్మలా జ్ఞాన జ్యోతి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ టి. వెంకటేశ్వరరావు , వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రాధ, మరియు ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిల్ప పాల్గొన్నారు.

## మర్రి రాజశేఖర్‌కు ఘన సత్కారం

చిలకలూరిపేట, డిసెంబర్ 3, ప్రభాతవార్త: కూటమి లోకి విచ్చేసిన సందర్భంగా తాజా మాజీ ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించిన చిలకలూరిపేట నియోజకవర్గ రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు జనసేన పార్టీ నాయకులు అచ్చుకోల మురళీకృష్ణ , మరియు మిత్రమండలి సభ్యులు చిలకలూరిపేట రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు, ప్రస్తుత శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ గారు మన కూటమి పార్టీలోకి చేరినందున వారిని అభినందిస్తున్నామన్నారు. రాధా రంగా మిత్రమండలి తరఫున ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఉన్నాము ఇకనుండి కూడా చేసే సేవా కార్యక్రమాల్లో మర్రి రాజశేఖర్ అన్న సహాయ సహకారాలతోటి వారి ఆశీస్సులు అండదండలు ఈ మిత్రమండలికి ఎప్పుడూ ఉండాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రాధా రంగా మిత్రమండలిలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారిని అన్ని



కులాల వారిని సభ్యులుగా చేర్చుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. రాజకీయ పార్టీలు గాని, స్వచ్ఛంద సంస్థలు గాని, మిత్రమండలి గాని ఏదైనా మరేదైనా కానీ ప్రజలకు సేవ చేసేందుకే అందరం ఉన్నాం. దాని కోసమే ఏ సంస్థ ని స్థాపించినా. రాధా రంగా మిత్రమండలి తోటి మన అచ్చుకోల మురళి ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో తనకు ఉన్నటువంటి ఆర్థిక వనరులతో ప్రజలకు సేవ చేస్తూ అందరికీ అండగా ఉండటం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇంకా ముందు ముందు కూడా ఇలాగే సేవా కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. అందరం కూడా కూటమి లోనే ఉన్నాం కాబట్టి అందరం కలిసి పని చేద్దాం ప్రజలకు మెరుగైన సేవలను అందించేలా కృషి చేద్దామని ఈ విషయంలో మిత్రుడు మురళీ కి తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తోట శ్రీనివాసరావు ,గనిమిశెట్టి శ్రీనివాసరావు ,మరియు మిత్ర మండలి సభ్యులు తోట శ్రీనివాసరావు , తోట మారుతీ రావు , ఆవుల శివశంకర్ ,దేవిశెట్టి బాలకృష్ణ, మెట్టు శేషగిరి , తోట కిషోర్ , తోట సతీష్ ,తన్నీరు వీరయ్య , గుజ్జర్ల శీను , ఈదుపల్లి బుజ్జి , అల్లడి హరిబాబు, పుల్లకూర లక్ష్మి , పొన్నూరు శివ , ముప్పల ఏసోబు , యడ్ల జాన్ తదితరులున్నారు.

## సిఎం సహాయ నిధితో లబ్ధిదారులకు మేలు:ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు(రేపల్లె), డిసెంబరు 3, ప్రభాతవార్త:ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి భట్టి ప్రోలు మండలానికి చెందిన 11 మంది బాధితులకు ఆర్థిక సహాయం అందింది.భట్టిప్రోలుకు చెందిన వి.శ్రీనివాసరావుకు రూ.7969,ఎం.సత్యనారాయణకు రూ.23,645,ఎన్.మేరీరాణికి రూ.8 వేలు,సమీర్ బేగ్‌కు రూ.32,639,బి.ఉషారాణికి రూ.46 వేలు,ఎ.రామారావుకు రూ,67 వేలు,బెగ్ రహమతున్నిసాకు రూ.31,084, ఎస్.రాజకుమారికి రూ.20 వేలు,గుత్తావారిపాలెంకు చెందిన వి.సామ్రాజ్యంకు రూ.22,110,వెల్లటూరుకు చెందిన బి.విజయలక్ష్మికి రూ.25 వేలు,వి.పద్మకు రూ.20 వేలు వెరసి రూ.3 లక్షల 3 వేల 437 నిధులు మంజూరయ్యాయి.వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన వారికి సిఎం సహాయ నిధి కింద ప్రయోజనం చేకూరిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా,వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణకుమారి,మైనేని మురళీకృష్ణ కుమారి,రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్యశ్రీనివాసరావు,జి.జ్ఞానానంద కుమార్,పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## దివ్యాంగులు అభివృద్ధి సాధించాలి

రేపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:దివ్యాంగులు విభిన్న రంగాలలో అభివృద్ధిని సాధించాలని రేపల్లె రసాయల సంస్థ అధినేత కోడె గౌరీశంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్వశాంతి రెసిడెన్షియల్ పాఠశాల ప్రాంగణంలో అరుణశ్రీ వికలాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య,ఉద్యోగ, విద్యుత్,హెల్త్, బ్యాంకింగ్,రైల్వే,ఆర్టీసీ తదితర ప్రభుత్వ రంగాలలో దివ్యాంగులకు రిజర్వేషన్ సౌకర్యం లభిస్తున్నదన్నారు.దివ్యాంగులు ఉన్నత చదువులు చదవాలని ఆయన సూచించారు.రేపల్లె పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకా రామకృష్ణ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు రేషన్ కార్డులు, పెన్షన్ల తదితర సమస్యలు ఉంటే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో రేపల్లె మండల డిప్యూటీ తహశీల్దార్ టి.నిరంజన్‌బాబు,సిఐటియు నాయకుడు సిహెచ్.మణిలాల్,రాష్ట్ర దివ్యాంగుల సంఘం నాయకుడు నీలా జోజిబాబు,అరుణశ్రీ వికలాంగుల సేవా సంఘం అధ్యక్షుడు జానం మురళీకృష్ణ,సభ్యులు ఎస్‌కె ఖాదర్,ఎం.ఉమామహేశ్వరరావు,పి.గౌతమ్ బుద్ధ,ఎన్.ఓబులేసు,డి.గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



**మండల పరిషత్ కార్యాలయంలో...** రేపల్లె మండల న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రత్యేక అవసరాలు గల భవిత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం జరిగింది.దివ్యాంగుల సంక్షేమంపై వక్తలు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.రవిబాబు,ఇఒఆర్‌పిడి ప్రసాద్,ఎంఇఒ రత్నశ్రీధర్,ప్రిన్సిపాల్ అనూరాధ,పారా లీగల్ వాలంటీర్లు చెన్ను నాగమల్లేశ్వరరావు,సయ్యద్ తాహిర్ అహ్మద్,ఆర్.శ్రీనివాసరావు,ఆలా మోషే,కోర్టు సిబ్బంది,వికలాంగ విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పార్టీ సంక్షేమం కోసం పాటుపడాలి

రేపల్లె, డిసెంబరు 3, ప్రభాతవార్త:తెలుగుదేశం పార్టీ సంక్షేమం కోసం ప్రతి కార్యకర్త పాటుపడాలని విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థాన పాలక మండలి సభ్యుడు జి.వి.నాగేశ్వరరావు అన్నారు.బుధవారం రేపల్లె తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ టిడిపి వార్డు అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,క్లస్టర్,యూనిట్,అనుబంధ సంఘాల నాయకుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని చెప్పారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి,కె.డబ్ల్యు.డి ప్రాజెక్ట కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధర రావు మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశానుసారం పార్టీ కార్యకలాపాల దిశా నిర్దేశంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలనా న్నరు.రాష్ట్ర పార్టీ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నదన్నారు.ప్రభుత్వ పాలనపై ప్రజాదరణ మెండుగా ఉందని ఆయన చెప్పారు.ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు మేకా రామకృష్ణ,గోగినేని పట్టాభి రామారావు, మల్లికార్జునరావు,కొక్కిలగడ్డ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





## వ్యవసాయ రంగం అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

నగరం,డిసెంబరు 3, ప్రభాతవార్త:వ్యవసాయ రంగంలో నూతన ఒరవడి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు,టిడిపి నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు.బుధవారం మండలంలోని చినమట్లపూడి రైతు సేవా కేంద్రంలో రైతన్న మీ కోసం వారోత్సవాలలో భాగంగా వర్క్‌షాప్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధిక వృద్ధి రేటు పెరుగుదలకు సిఎం చంద్రబాబు నాయుడు ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకుంటునా న్నరని తెలిపారు.ఎప్పటికప్పుడు పంటల మార్పిడితో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసే విధంగా కృషి చేయటం అభినందనీయమన్నారు.రైతు సేవా కేంద్రంలో మద్దతు ధర లభిస్తున్నందున రైతులు ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఆయన చెప్పారు.దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారిణి ఎన్.రామలక్ష్మి మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో రైతును రాజును చేసేందుకు ఐదు రకాల కార్యాచరణలు అమలు చేయటం జరుగుతుందన్నారు.నీటి భద్రత,డిమాండ్ ఆధారిత పంటలు,అగ్రిటెక్ ఫుడ్ ప్రాసెసింగ్,ప్రభుత్వం నుంచి మద్దతు ధర,పాడి రైతులకు అండ వంటి కార్యాచరణతో స్వర్ణాంధ్ర 2047కు అనుగుణంగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించేందుకు వ్యవసాయ అనుబంధ రంగాలలో సగటు సంవత్సరానికి 15 శాతం వృద్ధి రేటు సాధించే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు రామలక్ష్మి వివరించారు.ఇటువంటి విధానాలు రైతుల సంక్షేమానికి ఎంతగానో దోహదపడతాయని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వి.రమేష్‌బాబు,తహశీల్దార్ జి.నాంచారయ్య,ఎంపిడిఓ బి.శ్రీనివాసరావు,డిప్యూటీ తహశీల్దార్ ఎన్.సత్యనారాయణ,పశుసంవర్థక శాఖ ఎడి నాంచారయ్య,మండల టిడిపి అధ్యక్షుడు సిహెచ్.సుబ్బారావు,రేపల్లె నియోజకవర్గం పిఏసి మత్తి భాస్కరరావు,మాజీ ఎంపిపి వి.వీరయ్య,అధికారులు,నాయకులు పాల్గొన్నారు.



## ఐదు సూత్రాల ప్రాతిపదికపై రైతుల సంక్షేమం

భట్టిప్రోలు(రేపల్లె), డిసెంబరు 3, ప్రభాతవార్త:రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే ఐదు సూత్రాల విధానం ఆశించిన ఫలితాలు సాధిస్తుందని బాపట్ల జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి,భట్టి ప్రోలు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ బి.వేణుగోపాల్ చెప్పారు.బుధవారం భట్టి ప్రోలు మండలంలోని పల్లెకోనలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి భద్రత,డిమాండ్‌కు తగిన ఆధారిత పంటలు,అగ్రిటెక్,ఫుడ్ ప్రాసెసింగ్,మద్దతు ధర వంటి అంశాలు రైతులకు ఆర్థిక పరిపుష్టి కలిగిస్తాయని తెలిపారు.పాడి పరిశ్రమ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి ఏర్పాటు చేసిందన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ రైతన్న మీ కోసం పథకంలోని ఐదు సూత్రాలపై రైతులు అవగాహనతో ఉండాలన్నారు. మండలంలో 13051 ఎకరాలలో వరి సాగవుతున్నదని ఆయన చెప్పారు.పంటకి ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని, కొంత వరకు హార్వెస్ట్ ద్వారా వరి కోతలు జరిగాయని,తుఫాన్ ప్రభావం అంతగా లేనందున నష్టపోయే పరిస్థితులు లేవని ఆయన వివరించారు.మండల తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ళలో ఎటువంటి ఇబ్బందులు లేవని చెప్పారు.తడిసిన ధాన్యాన్ని ప్రత్యేక సడలింపులతో కొనే విధంగా ఆదేశాలు జారీచేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శాంతలక్ష్మి,రత్నరాజు,రైతులు పాల్గొన్నారు.



## జనసేనలో వీరమహిళలకు ప్రాధాన్యత

భట్టి ప్రోలు(రేపల్లె), డిసెంబరు 3, ప్రభాతవార్త:రాష్ట్రంలోని ప్రతి గ్రామ,మండల,నియోజకవర్గ స్థాయిల్లో ఐదుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేస్తామని జనసేన పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రకటించారని బాపట్ల జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి సోమరౌతు అనూరాధ చెప్పారు.బుధవారం ఆమె మాట్లాడుతూ కేంద్ర కార్యాలయం పర్యవేక్షణలో కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ నియామకం జరుగుతుందన్నారు.ప్రతి కమిటీలో మహిళలకు ప్రాధాన్యత లభించే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు ఆమె పేర్కొన్నారు.జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశంతో పార్టీ నాయకులు పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ నియోజకవర్గం స్థాయి వరకు జరిగే అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని ఆమె పిలుపునిచ్చారు.ప్రజలకు మౌలిక సదుపాయాలు అందడంలో పార్టీ శ్రేణులు కీలకంగా వ్యవహరించాలని కోరారు.ఐదుగురు సభ్యుల కమిటీలో ఒకరిద్దరు వీర మహిళలకు స్థానం లభిస్తుందని అనూరాధ తెలిపారు.11 మంది సభ్యులు గల కమిటీలో ముగ్గురు వీర మహిళలకు స్థానం కల్పిస్తారని ఆమె చెప్పారు.

# బాపట్ల జిల్లా వార్త



## ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పోలీసు శాఖ ముఖ్య ఉద్దేశ్యం

బాపట్ల,డిసెంబర్ 3,ప్రభాతవార్త: శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం పోలీసు శాఖ ముఖ్య ఉద్దేశమని, రౌడీ షీటర్లు నేర ప్రవృత్తిని విడనాడి సత్ప్రవర్తనతో మెలగాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ హెచ్చరించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుండి జిల్లాలోని పోలీసు అధికారులతో ఆయన జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలోని పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు నేరప్రవృత్తి విడనాడి సత్ప్రవర్తనతో సమాజంలో మెలగేందుకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు ఎంతమంది ఉన్నారు, వారు ఏ నేరాలకు పాల్పడటంతో రౌడీ షీట్లు తెరవబడ్డాయి, వారిలో ఎంతమంది సత్ప్రవర్తనతో ఉన్నారు, ఎంతమంది చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అవకాశముంది, వారి జీవన విధానం, ఎక్కడ నివాసముంటున్నారు, సత్ప్రవర్తన కోసం నిర్వహించే కౌన్సెలింగ్‌కు వారు హాజరవుతున్నారా లేదా, హాజరుకాకుంటే కారణం ఏమిటి, ఆ సమయంలో వారు ఎక్కడ ఉన్నారు వంటి విషయాలను గురించి ఎస్పీ ఆరా తీశారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ ప్రశాంత వాతావరణం కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీసు శాఖ ముఖ్య కర్తవ్యమన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లు వేరే స్టేషన్ పరిధిలో నివసిస్తే లేదా వేరే జిల్లాలకు వలస వెళ్ళితే, ఆ సమాచారం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు తెలియజేయాలన్నారు. పల్లె నిద్ర, గ్రామ సందర్శన వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలను సులభంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్థులు నేరం చేయాలనే ఆలోచన కూడా రాకుండా ఉండేవిధంగా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పాత నేరస్థులు లేదా రౌడీ షీటర్లు ఏదైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే సంబంధిత పోలీసు అధికారులే బాధ్యత వహించవలసి వస్తుంది హెచ్చరించారు. చీరాల డిఎస్పీ ఎం.డి. మోయిన్, రేపల్లె డిఎస్పీ ఏ.శ్రీనివాసరావు, సీసీఎస్ డిఎస్పీ పి.జగదీష్ నాయక్, ఎస్.బి., డిసిఆర్బి సిఐలు, జిల్లాలోని సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.



## ఇతరులను ప్రేమించడమే నిజమైన క్రిస్మస్

కర్లపాలెం,,డిసెంబర్3,ప్రభాతవార్త: అపదలో ఉన్న ఇతరులను అదుకొని వారికి ఏసుక్రీస్తు చూపిన ప్రేమను పంచడమే నిజమైసన క్రిస్మస్ అని దైవ సేవకులు విన్నకోట ఇమ్మాన్యుయేల్ స్పంష్టం చేశారు. కర్లపాలెం మండల నర్రావారిపాలెం పెనుయేలు ప్రార్ధన మందిరంలో బుధవారం దైవ సేవలకుల క్రిస్మస్ వేడుకలు జరిగాయి,ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిదిగా విచ్చేసిన దైవ సేవకులు విన్నకోట ఇమ్మానుయేలు మాట్లాడుతూ ఈ లోకంలో యేసు క్రీస్తు మానవాళిగా జిన్మించి మనుషలను సన్మార్గంలో నడిపించడానికి తన ప్రాణాన్ని సైతం అర్పించారన్నారు. అపదలో ఉన్న మన తోటి వారిని అదుకున్నప్పుడే క్రీస్తు చూపించిన బాట నెరవేరుతుందన్నారు. అనంతరం పాస్టర్ పాముల వినోద్,జి.స్వర్ణనరాజ్,బి.రవికుమార్ దైవ సేవకులకు వాక్యపదేశం చేశారు. అనంతరం బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో పెనుయేలు ప్రార్ధన మందిరం వ్యవస్థాపకులు పాస్టర్ కాగిత డేవిడ్,పాస్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పధకాలు అమలు

కర్లపాలెం,డిసెంబర్ 3,ప్రభాతవార్త: దేశానికి రైతులే వెన్నుముక అని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఆర్‌డివో గ్లోరియా అన్నారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామం లో "రైతన్న మీ కోసం వర్క్ షాప్" కార్యక్రమం ఆర్‌డివో గ్లోరియా అధ్యక్షతన పేరలి రైతు సేవా కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఇక్కడనుండి మూడు సీజన్ల వరకు రైతుల యొక్క వ్యవసాయ ఉత్పాదకత మరియు నికర ఆదాయం పెంచడానికి తగిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆర్ డి ఓ గ్లోరియా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, శిలీ కిసాన్, సున్నా వడ్డీకి రుణాలు, కనీస మద్దతు ధర మొదలగు సంక్షేమ పథకాలు అందించడం ద్వారా రైతు అభివృద్ధిని ప్రభుత్వం కోరుకుంటుందన్నారు. తదుపరి ప్రకృతి వ్యవసాయ దీశిలీ హుస్సేన్ గారు మాట్లాడుతూ రైతుల నికర ఆదాయం పెంచడానికి ప్రకృతి వ్యవసాయం ఎంతగానో ఉపకరిస్తుందని, పిఎండిఎస్ (నవధాన్యాలను పచ్చిరొట్టగ వేసి కలియదున్నడం) మరియు సేంద్రీయ పద్ధతులను ఆచరించడం ద్వారా సేంద్రీయ కర్బనం పెరిగి భూమి గుల్లబరుతుందని, సూక్ష్మ జీవులతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమిలో లభించి భూమి సారవంతమవుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ద్వారా వ్యవసాయ వ్యయం తగ్గడంతో పాటు నాణ్యమైన, పురుగుమందు రహిత పంటను పండించి ఎక్కువ ధరకు అమ్మవచ్చునని, దీని వలన మన ప్రకృతిని, ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సుమంత్ కుమార్ మాట్లాడుతూ రైతులు సాగులో మేలైన అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను ఎంచుకోవాలని, భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా డ్రోన్ ల ద్వారా పురుగుమందుల పిచికారీ యొక్క ఉపయోగాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ షాకిర్ పాషా, ఆర్ ఐ మాధవ కిరణ్, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు గ్లోరి, అభ్యుదయ రైతు మోహిద్దీన్ బేగ్, ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు..




## మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి

బాపట్ల,డిసెంబర్3,ప్రభాతవార్త: విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పెంచుకొని వాటిని ఆచరిస్తూ, వాటి ప్రాముఖ్యతను ఇతరులకు వివరించాలని, మత్తు పదార్థాల వలన కలిగే దుష్పరిణామాల పట్ల తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ ఉమామ హేశ్వర్ తెలిపారు. జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఫోక్సో చట్టాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్ ముఖ్యంగా మాదకద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాల పై జిల్లా పోలీస్ అధికారులు విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థులు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని, విద్యాలయాల్లో ర్యాగింగ్‌కు చోటు ఇవ్వకూడదన్నారు. ర్యాగింగ్ కేసు నమోదు అయితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజల భద్రత, యువత భవిష్యత్తు రక్షణ కోసం బాపట్ల జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉంటుందన్నారు.




## ఉర్దూ అకాడమీ కేంద్రకార్యాలయం విజయవాడ నుండి మంగళగిరికి

తాడేపల్లి,డిసెంబర్ 3,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ కేంద్ర కార్యాలయంలో భవానిపురం విజయవాడ నుండి మంగళగిరికి మార్పు,ఛైర్మన్ జనాబ్ ఫారూక్ షిబ్లీ నూతన కార్యాలయం సందర్శంచి పనుల పురోగతిపై సమీక్షించారు.ఈ సందర్భంగా షిబ్లి భవన యజమాని,కాంట్రాక్టర్లతో మాట్లాడి,పనులను వేగవంతం చేసి నెలరోజుల్లోగా భవనాన్ని ఉర్ధూ అకాడమీకి అప్పగించాల్సిందిగా కోరారు.డిసెంబర్ 31,2025 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉర్ధూ అకాడమీ ఏర్పడి 5సంవత్సరాలు పూర్తయ్యే నాటికి నూతన కేంద్ర కార్యాలయం నుండి పరిపాలన ప్రారంభించడం జరుగుతుందని అన్నారు.కార్యక్రమంలో అకాడమీ ఛైర్మన్ జనాబ్ ఫారూక్ షిబ్లి తోపాటు డైరెక్టర్, షేక్ మహ్మద్ గౌస్‌పీర్,వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జనాబ్ మహ్మద్ అక్రం,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## చెరుకుపల్లి గుళ్లపల్లిలో జాతీయ రహదారిపైనే చిరు వ్యాపారాలు, ఆటో స్టాండ్

చెరుకుపల్లి, డిసెంబర్ 3, ప్రభాతవార్త : రోడ్డు ప్రమాదాల నివారణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చర్యలు తీసుకోమని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ స్థానిక అధికారుల నిరక్ష్యంల్ల కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని విమర్శలు మండల కేంద్రమైన చెరుకుపల్లి, గుల్లపల్లి గ్రామాల్లో వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాగరమాలగా చెప్పుకునే 216 జాతీయ రహదారి పై నిత్యం వేల కొద్ది వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. కేరళ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాల నుండి ఈ 216 జాతీయ రహదారిపై ప్రయాణిస్తూ ఒరిస్సా ,ఢిల్లీ, బాంబే రాష్ట్రాలకు సైతం ఈ వాహనాలు చేరుకుంటూ ఉంటాయి. మోటారు సైకిల్ నుండి అతి భారీ వాహనాలు సైతం ఈ జాతీయ రహదారిపై నిత్యం ప్రయాణిస్తుండడంతో వాహనాల రద్దీ ఈ రహదారిపై అధికంగా ఉంటుంది. దశాబ్ద కాలంలోనే ఈ జాతీయ రహదారి ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. దేశ రక్షణ వ్యవస్థ సైతం ఈ జాతీయ రహదారి పై ఫ్లయింగ్ వాహనాలతో ప్రయోగాలు చేసిందంటే ఇది ఎంతటి ప్రాధాన్యత గల జాతీయ రహదారో అవగతమవుతుంది. వేల కోట్ల రూపాయల నిధులతో దేశంలోనే మొట్టమొదటి కాంక్రీట్ మెటీరియల్ తో ఈ రహదారిని నిర్మించి ఎంతో ప్రయోజనాత్మకంగా తీర్చిదిద్దినప్పటికీ ఇటు నిర్వాహకుల నిర్వహణ లోపం మరో ప్రక్క సంబంధిత శాఖల అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా జాతీయ రహదారిపై ఆక్రమణలు చోటుచేసుకుని రోడ్డు ప్రమాదాలకు మరింత అవరోధాలుగా ఏర్పడ్డాయి. మండలంలోని రాంబొట్ల వారి పాలెం నుండి కనగాల గ్రామం వరకు ఈ జాతీయ రహదారిపై అనధికారికంగా, నిరక్ష్యంల్లగా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయటం తో పాటు భవనాల నిర్మాణం కు ఉపయోగించే ఇసుక కంకర ఇటుక వంటి వాటిని కూడా జాతీయ రహదారిపైనే నిల్వలు చేస్తుండటం పట్ల ప్రయాణికులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన అనతి కాలంలోనే పదుల సంఖ్యలో ఈ రహదారిపై ప్రయాణికులు ,వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకున్నారంటే ఈ రహదారిపై రద్దీ ఏ పాటితో అర్థమవుతుంది. జాతీయ రహదారిపై అనధికారికంగా వాహనాలే నడపకూడదు అనే నిబంధన ఉన్నప్పటికీ ఇవేమీ తమకు వర్తించవన్నట్లు రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారస్తులు తమకు ఇష్టం వచ్చినట్లు వ్యాపార సముదాయాలను జాతీయ రహదారిపై ఏర్పాటు చేయడం, మరికొందరైతే తమ దుకాణాలు ముందు జాతీయ రహదారిపై చిరు వ్యాపారులకు అద్దెకు ఇవ్వటం కూడా గమనార్హం. దీనికి తోడు కారు స్టాండ్లు, ఆటో స్టాండ్లు సైతం జాతీయ రహదారిపై ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఏర్పాటు చేసుకోవడం రహదారి భద్రత, నిర్వహణ లోపాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. చెరుకుపల్లి గుల్లపల్లి గ్రామాలలో అయితే ఈ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న ఫుట్పాత్ ..! అంటే ప్రయాణికులు ,బాటసారులు నడిచే దారి పూర్తిగా ఆక్రమణలకు గురవటం రహదారి నిర్వహణ లోపాన్ని మరింతగా ప్రస్ఫుటం చేస్తుంది. జాతీయ రహదారిపై ఆక్రమణలు తొలగించి వాహనాల రాకపోకలకు పూర్తి వెసులుబాటు కల్పించమని పలుమార్లు ప్రయాణికులు మొత్తుకున్న పట్టించుకోవడం లేదు. పోతే ప్రయాణికుల ప్రాణాలేగా... అన్నట్లుగా ఉంది జాతీయ రహదారి పర్యవేక్షణ అధికారులు తీరు. నిర్మాణ దశలోనే ఎన్నో అవకతవకలు చోటు చేసుకున్న ఈ రహదారి కనీసం నిర్మాణం పూర్తయిన తర్వాత అయినా వాహనాల రాకపోకలకు అవరోధాలు లేకుండా నిర్వహణ అయినా సరిగ్గా చేస్తారా....! అనుకుంటే అది కూడా సక్రమంగా లేదని ప్రజలు ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మరిన్ని ప్రమాదాలు చోటు చేసుకోక ముందే జాతీయ రహదారిపై అక్రమణాలను తొలగించి మరోసారి ఆక్రమణ సైతం చోటు చేసుకోకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికుల విజ్ఞప్తి చేస్తున్నారు.





## భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రత వేడుకలు

పొన్నూరు, డిసెంబర్ 3,ప్రభాతవార్త: టెంపుల్ సిటీగా ప్రసిద్దిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వస్వామి దేవాలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వీరాంజనేయస్వామివారికి హనుమద్రవ్రత వేడుకలను ఘనంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున 4.30గంటలకు స్వామివారికి పంచామృత స్నపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి అభిషేక కార్యక్రమంలో పాల్గొంటే సర్వసుఖాలు కలుగుతాయని, ఈతి బాధలు తొలుగుతాయని భక్తుల విశ్వాసం. దీంతో జిల్లా, రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి వ్రతాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం లక్ష తమలపాకు లార్చన నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది. ఉత్సవం సందర్భంగా దేవాలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో, వివిధ రకాల పుష్పాలతో దేదీవ్యమానంగా అలంకరించారు. దేవాలయానికి నిర్వహించిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మంచి డెకరేషన్ చేశారని, ఆధ్యాత్మిక భావన ఉట్టిపడుతుందని పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఛైర్మన్ గుప్తా ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాధ్ పర్యవేక్షణలో సిబ్బంది భక్తులకు ఏర్పాట్లు చేశారు.



## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి

### -ఈ నెల 5న జరిగే మెగా పేరెంట్స్‌డేని విజయవంతం చేయాలి

### -మండల ప్రత్యేకాధికారి కొండా వీర వెంకట సత్యనారాయణ

పొన్నూరు, డిసెంబర్ 3,ప్రభాతవార్త: ఉపాధ్యాయులు-విద్యార్థుల తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్, మండల ప్రత్యేకాధికారి కొండా వీర వెంకట సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు-విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి మాట్లాడుకున్నట్లయితే విద్యార్థుల యొక్క ప్రగతిపై చర్చించుకొని, ఉన్నతులుగా తీర్చిదిద్దే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ మెగా పేరెంట్స్ డేని నిర్వహించేందుకు సన్నాహాలు చేసినట్లు చెప్పారు. ఉపాధ్యాయులంతా ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం సమావేశాన్ని నిర్వహించి సత్ఫలితాలను సాధించాలని కోరారు. సాంఘికసంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్, మునిసిపల్ ప్రత్యేకాధికారి యు.చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థుల స్థాయిని, విద్యార్థుల ప్రగతి నివేదికలను వారి తల్లిదండ్రులకు తెలియజేసి, విద్యార్థుల యొక్క ఉజ్వల భవిష్యత్‌కు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



## ఘనంగా జక్కా వర్ధంతి

పొన్నూరు, డిసెంబర్ 3,ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి స్వర్గీయ జక్కా శ్రీనివాసరావు వర్ధంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కా కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. 1981-82పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. వడ్డిముక్కల రోడ్డులోని గోతాలస్వామి ఆశ్రమంలోని పేదలకు భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ కరీముల్లా, చక్కా శ్రీనివాసరావు, కాకుమాను లాజర్‌బాబు, షేక్ గౌస్ తాళ్ళూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## పాఠశాలను సందర్శించిన సబ్‌కలెక్టర్ సంజనా సిన్హా

చేబ్రోలు(పొన్నూరు), డిసెంబర్ 3,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా సందర్శించి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. ఈ నెల ఐదవ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్ మీటింగ్‌ను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా జాగ్రత్తగా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల సంఖ్య, పాఠశాలలో ఉన్నటువంటి వసతులు తదితర అంశాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసశర్మ, తదితర అధికారులున్నారు.






బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

## కెటిఆర్! నీకు రాజకీయ విలువలు ఉంటే.. రాహుల్ గురించి తప్పుగా మాట్లాడకు

### దేవుళ్లపై రేవంత్ రెడ్డి మాటలకు బిజెపి వక్రీకరణ

### కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

**హైదరాబాద్,డిసెంబరు 3,ప్రభాతవార్త:** కెటిఆర్‌నీకు రాజకీయ విలువలు ఉంటే తెలంగాణ ఇచ్చిన రాహుల్ గాంధీ గురించి తప్పుగా మాట్లాడకు అంటూ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి హితవు చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నేను చట్టసభలకు వచ్చాను అంటే కేసీఆర్ వల్లనే. నాకు రాజకీయ విలువలు ఉన్నాయి కాబట్టి కెసిఆర్ పట్ల తప్పుగా మాట్లాడను.బిజెపి లో రాజకీయంగా ఎదగకుండా చేస్తున్న సమయంలో కేసిఆర్ పిలిచి నన్ను చట్టసభలకు పంపారు. కెసిఆర్ ఇచ్చిన బి ఫార్మ్ తో సంగారెడ్డి కి ఎమ్మెల్యే అయిన రాజకీయంగా సక్సెస్ కోసం టిఆర్ఎస్‌లో చేరిన నాకు విలువలు ఉన్నాయి కాబట్టి కెసిఆర్ తోనే సభలోకి వచ్చిన అని చెప్పను రాహుల్ గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే . మీ ఇంట్లో పవర్ కొట్టాల.. ఫైనల్ కొట్టాల జరిగేది కాదని ఆయన గుర్తుచేశారు. మీ కుటుంబం అంత సోనియా గాంధీ ఇంటికి వెళ్ళింది మర్చిపోయావా అని ఆయన నిలదీశారు.రాహుల్ గాంధీ గురించి కెటిఆర్ మాట్లాడటం అవివేకమే. నేను కెసిఆర్ గురించి అనేక విషయాలు బయట మాట్లాడాల్సి వస్తదని హెచ్చరించారు.రాహుల్ గాంధీకి దేశ భవిష్యత్తుపై విజన్ లేదని కెటిఆర్ వయసుకు మించి మాటలు మాట్లాడు తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాహుల్ గాంధీని విమర్శించే పర్సనాలిటీ కెటిఆర్‌ది కాదని అన్నారు. కెటిఆర్ నువ్వు మాజీసిఎం కేసీఆర్ కొడుకువి రాజకీయ పోరాటంలో మీరు బెనిఫిట్ పొందారు కానీ త్యాగాలు చేసిన కుటుంబం మీదికాదు అని జగ్గారెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఆస్తులు,ప్రాణ త్యాగాలు చేసిందని చరిత్ర చెప్పారు.తెలంగాణ ఇవ్వవద్దని ఆంధ్రానాయకులు చెప్పినా ఓటమికి వెరవకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రవిభజన చేశారని ఆయన తెలిపారు. కెసిఆర్ తెలంగాణకు సిఎం కావడం, నువ్వు సిఎం కొడుకువు అయ్యావు అంటే అదీ రాహుల్ గాంధీ బిక్ష అని ఆయన తెలిపారు. కెటిఆర్‌కు కొంత పద్ధతితో ఉంటాడు అనుకున్నానీ ఇదేపద్ధతి, రాహుల్‌గాంధీ గురించి మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడాలనిసూచించారు. దేవుళ్ళపై రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలు బిజెపి వక్రీకరిస్తుందని దీనిపై తర్వాత మాట్లాడతాఅని ఆయన అన్నారు.

## కిష్టారంవద్ద రోడ్డు ప్రమాదం

## మృతి చెందిన ఇద్దరు విద్యార్థులు

### సత్తుపల్లి ,చంద్రుగొండలో విషాద ఛాయలు

**సత్తుపల్లి, డిసెంబరు 3 ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం సమీప అంబేద్కర్ నగర్ కాలనీ వద్ద బుధవారం తెల్లవారుజామున కారు డివైడర్ను ఢీ కొట్టిన ఘోరరోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడకు అక్కడే మృతిచెందగా మరో ఇద్దరూ వ్యక్తులు తీవ్ర గాయాలై విషమంగా ఉంటంతో చికిత్స నిమిత్తంఖమ్మం తరలించారు. అతివేగంగా, నిద్రమత్తుతో కారు నడపడం వల్ల డివైడర్ను ఢీ కొట్టి పల్టీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు యువకుల్లో ముగ్గురు యువకులు 50 మీటర్ల దూరంలో శవాలుగా పడి ఉన్నారు. మరో ఇద్దరూ తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్నారు. చనిపోయిన వారు ఇద్దరు విద్యార్థులు కాగా, కారులో ప్రయాణించేవారు అందరూ మైనర్లు గాని స్థానికులు పేర్కొంటున్నారు. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం చుంద్రుగొండ మండలం తిప్పనపల్లి గ్రామపంచాయతీ మహబూబ్నగర్ గ్రామానికి చెందిన ఎస్ డి సాజిద్ (18) సత్తుపల్లి మండలం కొమ్మేపల్లి చెందిన సిద్దేసి జాయ్ (16) మర్సకట్ల శశివర్ధన్ (12) లతోపాటు అన్నపురెడ్డిపల్లి మండలం కి చెందిన తలారి అజయ్, చుంద్రుగొండ మండలానికి చెందిన షేక్ ఇమ్రాన్ లు కారులో వి ఎం బంజర్ వైపు నుంచి సత్తుపల్లి వస్తుండగా కిష్టారం గ్రామ సమీప అంబేద్కర్ నగర్ కాలనీ సమీపంలో రాగానే డివైడర్ను వేగంగా వచ్చి కారు



ఢీకొనడంతో ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో ఎస్డి సాజిద్, సిద్దేసి జాయ్, మర్స కట్ల శశివర్ధనలు అక్కడక్కడే మృతి చెందారు. అతివేగంగా కారు వచ్చి డివైడర్నుఢీకొట్టటం దంతో కారు నుజ్జునుజ్జు కాగా ఈ మృతదేహాలు సైతం 50 మీటర్ల దూరంలో చల్లాచెదురుగా పడి ఉన్నాయి. కారులో ప్రయాణిస్తున్న మరో ఇద్దరు తలారి అజయ్, షేక్ ఇమ్రాన్ లకు తీవ్ర గాయాలయి పరిస్థితి విషమిం చటంతో వీరిని మెరుగైన వైద్యం కొరకు ఖమ్మం వైద్యశాలకు తరలించారు. సమాచారం తెలియటంతో 108 సిబ్బంది హుటాహోటిన సం ఘటన ప్రదేశానికి వచ్చి తీవ్ర గాయాలైన ఇద్దరు యువకుల్ని చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం రిఫర్ చేయగా, చనిపోయిన మృతదేహాలను సత్తుపల్లి ఏరియా ఆసుపత్రికి పీఎం కొరకు తరలించారు. సంఘటన ప్రదేశాన్ని సందర్శించిన ఏసిపి....మండల పరిధిలోని కిష్టారం సమీప అంబేద్కర్ నగర్ వద్ద బుధవారం తెల్లవారుజామున కారు అతివేగంగా వచ్చి డివైడర్ను ఢీ కొట్టిన రోడ్డు ప్రమాదం సంఘటన తెలుసుకున్న కల్లూరు ఏసిపి వసుందర యాదవ్, సీఐ తుమ్మలపల్లి శ్రీహరి లతోపాటు సిబ్బంది ప్రమాదం జరిగిన ప్రదేశంకు వచ్చి ప్రమాదం తీరును పరిశీలించారు. మృతి చెందిన యువకుల మృతదేహాలను ఏరియా ఆసుపత్రిలో ఉండగా స్వయంగా ఏసిపి వసుంధర యాదవ్ వెళ్లి ఎక్కడెక్కడ దెబ్బలు తగిలాయి అనేది ఆమె పరిశీలించారు. ప్రమాదం జరిగిన సంఘటనపై సీఐతుమ్మలపల్లి శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గూగుల్ డేటా సెంటర్‌కు భూముల బదలి ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ,డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి:** విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు భూముల బదిలీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థలు కలిసి ఏర్పాటు చేయనున్న 1,000 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్‌కు ప్రోత్సాహకాలు చెల్లించేందుకూ సమ్మతించింది. డేటా సెంటర్ క్యాంపస్ అభివృద్ధికి వీలుగా రైడెన్,నోటిఫైడ్,భాగస్వామ్య సంస్థలకు భూముల బదిలీకి అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిర్దేశిత వ్యవధిలో ప్రాజెక్ట్ పూర్తవక ఆలస్యానికి సరైన కారణాలు చూసుకుంటే రైడెన్,దాని నోటిఫైడ్ భాగస్వామ్య సంస్థలపై వాణిజ్యపరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రపంచ ప్రమాణాలతో డేటా సెంటర్ ఏర్పాటుకు ఆ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ప్రాజెక్ట్‌ను ఉన్నతస్థాయి ప్రమాణాలతో,నిర్ధేశిత వ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని...దీని కోసం ప్రాజెక్ట్ అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని రైడెన్ పేర్కొంది.డేటా సెంటర్ల క్యాంపస్ కోసం ఏపీఐఐసీ గుర్తించిన భూములు గమనిస్తే విశాఖ జిల్లా అడవివరం,ముడసర్లోవ గ్రామాల్లో 120 ఎకరాలువిశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో 200 ఎకరాలుఅనకాపల్లి జిల్లా రాంబిల్లిలో 160 ఎకరాలుప్రాథమిక నోటిఫైడ్ భాగస్వామిగా అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా)ప్రైవేటు లిమిటెడ్‌కు ఏపీఐఐసీ ద్వారా భూములు అప్పగించాలని రైడెన్ కోరింది. ప్రాథమిక పనుల తర్వాత భూములను ప్రాజెక్ట్ అవసరాలకు అనుగుణంగా వివిధ సంస్థల మధ్య అంతర్గత బదిలీ చేసుకుంటామని ప్రతిపాదించింది.డేటా సెంటర్ క్యాంపస్,అభివృద్ధి కోసం ఎన్‌ఎక్స్‌ట్రా డేటా లేదా దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేయాలని రైడెన్ నిర్ణయించింది.తర్లువాడ,అడవివరం,ముడసర్లోవ భూములు : డేటా సెంటర్ క్యాంపస్‌ల అభివృద్ధి కోసం అదానీ కనెక్ట్స్ లేదా దాని అనుబంధ సంస్థలకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది.అదానీ ఇన్‌ఫ్రా (ఇండియా)ప్రైవేట్ లిమిటెడ్అదానీ కనెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్అదానీ పవర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ఎన్‌ఎక్స్‌ట్రా డేటా లిమిటెడ్ (భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్థ)ఎన్‌ఎక్స్‌ట్రా వైజాగ్ లిమిటెడ్(భారతీ ఎయిర్‌టెల్ అనుబంధ సంస్దలు భాగస్వామ్య సంస్దలుగా ఉన్నారు.డేటా సెంటర్,అనుబంధ పర్యావరణ వ్యవస్థ ఏర్పాటుకు నోటిఫై చేసిన భాగస్వామ్య సంస్థలకూ అందుబాటులో ఉండేలా ప్రోత్సాహకాలు సులభతరం చేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. భాగస్వామ్య సంస్థలకు సంబంధించి ముందుగా అనుమతి తీసుకోవాలని స్పష్టం చేసింది. అవి ప్రోత్సాహకాలు పొందేందుకు తప్పనిసరిగా పెట్టుబడి పెట్టాలని నిర్ధేశించింది.2025 ఆగస్టు 22న సమర్పించిన డీపీఆర్‌కు అనుగుణంగా ప్రాజెక్ట్ ఉంటుంది. రైడెన్,గూగుల్,గూగుల్ క్లౌడ్ సహా దాని అనుబంధ సంస్థలు దీని అభివృద్ధికి కట్టుబడి ఉంటాయని రైడెన్ పేర్కొంది.డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణాలు గూగుల్ మౌలిక సదుపాయాలకు అనుగుణంగా...ప్రపంచ డేటా సెంటర్ ప్రమాణాల మేరకే ఉంటాయి.సెర్చ్,యూట్యూబ్,వర్క్‌స్పేస్ వంటి గూగుల్ సేవలకు అనుగుణంగా అదే స్థాయి ప్రమాణాలతో డేటా సెంటర్ నిర్వహిస్తారు.

## రాష్ట్ర అభివృద్ధిలో జనసేన శ్రేణులు భాగం కావాలి : డి సిఎం పవన్

### - గ్రామ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు కమిటీల ఏర్పాటు

**విజయవాడ,డిసెంబరు3,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అభివృద్ధిలో క్రియాశీలక భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన సమావేశమై పార్టీ నిర్మాణంపైనా, భవిష్యత్ కార్యాచరణపైనా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు స్థానిక అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ లక్ష్య సాధన కోసం గ్రామ స్థాయి నుంచి పార్టీ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పవన్ తెలిపారు. ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించాలని, వారు స్థానిక అభివనులను పర్యవేక్షించాలని చెప్పారు. ఇదే తరహాలో మండల, అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో ఇప్పటికే ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని, దాని పనితీరును సమీక్షించి రాష్ట్రవ్యాప్తంగా ఈ విధానాన్ని అమలు చేస్తామని వివరించారు. పార్టీ కమిటీల నియామకంలో మహిళలకు తప్పనిసరిగా ప్రాధాన్యం ఇవ్వాలని పవన్ స్పష్టం చేశారు. ఐదుగురు సభ్యుల కమిటీలో కనీసం ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు ఉండాలని, 11 మంది సభ్యుల కమిటీలో ముగ్గురికి స్థానం కల్పించాలని నిర్ణయించారు. పార్టీలో అంతర్గత వివాదాల పరిష్కారం కోసం కేంద్ర కార్యాలయం పర్యవేక్షణలో 11 మంది సభ్యులతో 'కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్' విభాగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే భర్తీ అయిన నామినేటెడ్ పదవుల వివరాలను పవన్,సమీక్షించారు. మిగిలిన పదవుల భర్తీలో కూటమి ధర్మాన్ని పాటిస్తూనే, పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని సూచించారు. జనసేన కమిటీల నిర్మాణంలో భాగంగా గ్రామస్థాయిలో ఐదుగురితో కమిటీని నియమించాలని కోరారు. గ్రామ అభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు ఐదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. నామినేటెపదవులపై సమీక్షించారు.పవన్ దిష్టి వ్యాఖ్యల వివాదం వేళ మరో సంచలనం. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకు జనసేన పొందిన పదవుల వివరాలను పరిశీలించారు. మిగిలిన పదవుల భర్తీపై పలు సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతో పాటు పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసిన వారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలు అందించేలా ప్రయాణిస్తున్నా మని తెలిపారు. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దే శించిన కాన్‌ఫ్లిక్ట్ మేనేజ్‌మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచి పర్య వేక్షించాలని స్పష్టం చేశారు.

## ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణం జోరుగా టిమ్స్ పనులు

**పభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్3:** ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది.ప్రభుత్వాసుపత్రుల్లోని సేవలను బలోపేతం దిశగా పలు కార్యక్రమాలు చేపట్టారు. వాటి ఫలితాలు నేడు కళ్లకు కనిపిస్తున్నాయి. ప్రసవాలకు ఏజెన్సీ ప్రాంత గర్భిణులు ప్రభుత్వాసుపత్రులకు వస్తున్నారు. గర్భిణీలకు అందే వైద్యం నుంచి వృద్ధులకు వచ్చే సమస్యల వరకు ప్రతి రుగ్మతకు ప్రభుత్వాసుపత్రుల్లోనే సేవలు అందాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలుమార్లు నొక్కిచెప్పారు. ఈ మేరకు బుధవారం సిఎం కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ క్రమంలోనే వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నియామకం, ఆసుపత్రుల నిర్మాణం, వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాల సంఖ్యను పెంచడంతో పాటు సీట్లను పెంచారు. జూనియర్ డాకర్ల స్టైఫండ్ పెంపు మొదలు ప్రతి సమస్యను పరిష్కరించడంతో పాటు వైద్యారోగ్య రంగాన్ని బలోపేతానికి కృషి చేస్తున్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్య పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచింది. 1375 వైద్య చికిత్సల ధరలను సుమారు 22 నుంచి 25 శాతం వరకూ పెంచడంతో పాటు కొత్తగా 163 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఫలితంగా ఆరోగ్య శ్రీ కింద అందే చికిత్సల సంఖ్య 1835కి పెరగడంతో లక్షలాది మందికి ప్రయోజనం కలిగింది.

ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్ల సంఖ్యను క్రమంగా ప్రభుత్వం పెంచుకుంటూ పోతోంది. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

## తెలంగాణ గవర్నర్‌ను కలిసిన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

### భజన మందిరాలు నిర్మించేందుకు నిధులు ఇవ్వండి

### మంత్రి కొండా సురేఖతో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్3:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాజ్‌భవన్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడు కలిసారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను స్వామి వారి శాలువాతో సత్కరించి స్వామి వారి తీర్థప్రసాదాలను టిటిడి చైర్మన్ అందించారు. టిటిడిలో భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలు రుచికరంగా, నాణ్యంగా ఉన్నాయని, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు భేషుగ్గా ఉన్నాయని గవర్నర్ అభినందించారు. గవర్నర్ స్వరాష్ట్రమైన త్రిపురలో శ్రీవారి ఆలయాన్ని నిర్మించాలని టిటిడి చైర్మన్ బీఆర్ నాయుడును కోరారు. త్రిపురలో శ్రీవారి ఆలయానికి స్థలం కేటాయిస్తే ఆలయ నిర్మాణాన్ని టిటిడి చేపడుతుందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు







బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల ఆమె నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని ఆయన శాలువా, స్వామివారి ప్రసాదంతో సత్కరించారు. అనంతరం మంత్రి సురేఖ, టీటీడీ చైర్మన్‌ను కూడా యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి వారి ప్రతిమను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు దేవాలయాల నిర్మాణానికి టీటీడీ చేస్తున్న చర్యలు, ప్రత్యేకించి దళిత కాలనీల్లో నిర్మిస్తున్న హిందూ దేవాలయాల గురించి ప్రస్తావిం చారు. ఈ నిర్మాణాలు మంథని, కొడంగల్, ఖమ్మం ప్రాంతాల్లో చేపడుతున్నట్టు మంత్రికి స్పష్టం చేశారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన కొండ ప్రాంతాల్లోని దేవాలయాల్లో రోప్‌వే నిర్మాణ పనులు చేపట్టడానికి టీటీడీ నుంచి నిధులు కేటాయించేందుకు సాయం చేయాలని మంత్రి కొండా సురేఖ, టీటీడీ చైర్మన్ దృష్టికి తీసుకెళ్ళారు.

ఇందులో ప్రముఖంగా వికారాబాద్ జిల్లాలోని పరిగిలో గల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, హన్మకొండలోని పద్మాక్షి అమ్మవారి టెంపుల్, వరంగల్ జిల్లాలోని గోవింద రాజుల ఆలయంలో రోప్ వే నిర్మాణం అవసరం ఉందని ఆయనకు ప్రత్యేకంగా గుర్తు చేశారు. ఈ ఆలయాలకు ఎంతో చారిత్రకత ఉందని, వీటి దర్శనానికి దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు.

దాంతోపాటు, రాష్ట్రంలోని ముఖ్యమైన ఆలయాల్లో భజన మందిరాలు నిర్మించుకునేందుకు టీటీడీలోని శ్రీవాణి ట్రస్టు నిధులు గతంలో ఇచ్చేవారని, ఈ మధ్య కాలంలో వాటిని నిలిపివేశారని, అయితే, వీటిని మళ్ళీ ఇవ్వాలని మంత్రి సురేఖ కొండా సురేఖ, టీటీడీ చైర్మన్‌ను కోరారు. ఈ ట్రస్టు ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుందని గుర్తు చేయగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు.

## 2 వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్‌కు గ్రీన్‌సిగ్నల్

### 10 వేల మెగావాట్ల మేర ఉత్పత్తికి నిర్ణయం

### త్వరలో మరో 3 వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు

**హైదరాబాద్, డిసెంబరు 3, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్, రాబోయే పదేండ్లకు అవసరమయ్యే విద్యుత్తు సరఫరా, విద్యుత్తు ఉత్పత్తి అంచనాలపై సర్కార్ దృష్టిసారించింది. ఇందులో భాగంగా రాష్ట్ర విద్యుత్తు అవసరాలు దృష్టిలో ఉంచుకుని అదనపు విద్యుత్తు కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. తాజాగా 2వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ విద్యుత్తును కొనుగోలుచేసేందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విద్యుత్తు కొనుగోళ్లకు టీజీ జెన్‌కో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా, ఐదేండ్ల కాల వ్యవధికి 6+2 గంటలపాటు 2వేల మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు ముందుకొచ్చింది. అయితే ఈ విద్యుత్తును కాంపిటేటివ్ బిడ్డింగ్ పద్ధతిలో కొనుగోలు చేయాలని ఆదేశించింది. ఇక సోలార్ పవర్ తరహాలోనే పంప్డ్ స్టోరేజ్ పవర్ వినియోగం పెంచాల్సి ఉంది. 2000 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ పవర్ కొనుగోలుకు టెండర్లు పిలవాలని ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అయిదేళ్ళ కాల పరిమితితోనే ఈ టెండర్లు కూడా పిలవనుంది. ఇక రాష్ట్రంలో పలు చోట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతాలున్నాయి. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే కంపెనీలు, పెట్టుబడిదారులకు అనుమతి ఇవ్వనుంది. ఇప్పటికే విద్యుత్ పంపిణీ సంస్థల వద్ద ఉన్న ఎంవోయూలను కూడా పరిశీలించింది. ఈ నేపధ్యంలోనే రాష్ట్రంలో 10 వేల మెగా వాట్ల పంప్డ్ స్టోరేజ్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ ప్లాంట్ల ఏర్పాటుకు ఆసక్తి ప్రదర్శించే కంపెనీలకు ప్రభుత్వమే అవసరమైన భూమిని కేటాయించి, నీళ్లను అందిస్తుంది. ఈ ప్లాంట్లలో ఉత్పత్తి చేసే విద్యుత్ ను ముందుగా మన డిస్కమ్ లకే అమ్మాలనే షరతుతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుంది. మరోపక్క పునరుత్పాదక విద్యుత్తు వినియోగం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నిబంధనల ప్రకారం రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 3000 మెగా వాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు వీలైనంత తొందరగా టెండర్లు పిలవాలని నిర్ణయం తీసుకుంది. అయిదు ఏళ్ల పాటు విద్యుత్ సరఫరా చేసే కాల పరిమితి ఒప్పందాలతో ఈ టెండర్లు పిలవనుంది.

## మత్తు ఇంజక్షన్లు తీసుకొని ఇద్దరు యువకులు మృతి

**హైదరాబాద్ (చార్మినార్), డిసెంబరు 3 ప్రభాతవార్త :** మత్తు ఇంజక్షన్ల మోతాదును ఎక్కువ తీసుకోవటంతో ఇద్దరు యువకులు మృతి చెందిన పాత బస్తీ చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.గోపీ కథనం ప్రకారం ఫహాడిషరీఫ్‌కు చెందిన జహంగీర్ (25,) ఆటో డ్రైవర్,రియాసత్ నగర్‌కు చెందిన ఇర్ఫాన్ (25),షహీన్ నగర్‌కు చెందిన అక్రమ్ (22)లకు మత్తు ఇంజక్షన్లు తీసుకునే అలవాటు ఉంది.

కాగా మంగళవారం రాత్రి ఆటో డ్రైవర్ జహంగీర్ మత్తు ఇంజక్షన్లు,సిరంజన్లు తీసుకుని చాంద్రాయణగుట్ట మహబూబ్‌నగర్ చౌరస్తా వద్దకు వచ్చాడు. షహీన్ నగర్‌కు చెందిన అక్రమ్ స్థానికంగా ఉండే అతని స్నేహితుడు కలిసి చాంద్రాయణగుట్ట చౌరస్తా వద్దకు ఇద్దరు వచ్చారు.అక్కడ ఆటోలో జహంగీర్,ఇర్ఫాన్‌తో పాటు షహీన్ నగర్‌కు చెందిన అక్రమ్‌లు కలిసి ముగ్గురు మత్తు కోసం మత్తు ఇంజక్షన్లు తీసుకున్నారు.కాగా వారు తీసుకున్న మత్తు మోతాదు ఎక్కువ కావటంతో జహీంగీర్,ఇర్ఫాన్ అపస్మారక స్థితికి చేరుకున్నారు.ఇది గమనించిన షహీన్ నగర్‌కు చెందిన అక్రమ్ స్నేహితుడు అక్కడ నుంచి పారిపోయాడు.

ఈ సంఘనటలో జహంగీర్, ఇర్ఫాన్‌లు మృతి చెందారు.కాగా తక్కువ మోతాదులో మత్తు ఇంజక్షన్ తీసుకున్న అక్రమ్ కోలుకున్నాడని పోలీసులు తెలిపారు.ఆటోలో ఇంజక్షన్,మూడు సిరంజిలు, రెండు పెయిబాన్ టాబ్లెట్లు లభించాయి.మత్తు ఇంజక్షన్లు తీసుకో వటం వల్లనే ఇద్దరు మరణించారని పోలీసులు భావిస్తున్నారు.ఈ కేసును చాంద్రాయ ణగుట్ట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# పంచాయతీ ఎన్నికతో పెరిగిన నాన్‌వెజ్ విక్రయాలు

### తలలు తెగుతున్న కోళ్లు, గొర్రెలు

### మూడింతలు పెరిగిన చేపల విక్రయం

**హైదరాబాద్,డిసెంబరు 3,ప్రభాతవార్త:** తెలంగాణ లో గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి ఊపందుకోవడంతో నాన్‌వెజ్ ముఖ్యంగా చికెన్,మటన్ చేపలు వినియోగం పెరుగుతుండటంతో వాటి విక్రయ ధరలు పెరిగిపోతున్నాయి. బుధవారం మొదటి విడత సర్పంచులు వారు మెంబర్లు బరిలో నిలువగలరో ఉపసంహరణ తరువాత తేలడంతో ఎన్నికల గుర్తులు కేటాయించారు.గ్రామానికి ప్రథమ పౌరుడు సర్పంచే. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ మేర ముందు ఆహ్వానం సర్పంచికే అందుతుంది. పల్లె అభివృద్ధిలో సర్పంచిదే కీలకపాత్ర. ఈ పదవిని అలంకరించిన వారికి ప్రభుత్వం నెలకు రూ.6500 గౌరవ వేతనం అందిస్తుంది. ఈ సర్పంచ్ పదవి అందుకోవడం కోసం పోటిలో కొనసాగే వారు ఇక తమ గుర్తు ప్రచారం చేసుకోవడం వేగం పెంచడానికి విందు రాజకీయాలు చేయాల్సి వస్తోంది. తెలంగాణ వ్యాప్తంగా 12728 సర్పంచ్‌లు112242 వార్డులకు నోటిఫికేషన్ విడులైంది. రాష్ట్రంలో తొలి విడుత 4236 పంచాయతీలకు ఎన్నికలు డిసెంబర్ 11న జరుపడానికి నోటిఫికేషన్ జారీచేశారు. రెండోవిడుత 4333గ్రామాలకు ఈనెల 14న, మూడో విడుస్తూ 4159 గ్రామాల్లో ఎన్నికలు డిసెంబర్ 17న జరుగుతాయి.ఓటర్లతో పాటు ప్రచారంలో పాల్గొనే వారికి మద్యం, మాంసాహారం రోజూ పెట్టాల్సి ఉంటుంది. డిమాండ్ పెరగడంతో చికెన్ మాంసం వ్యాపారులు ధర పెంచేశారు.ఎన్నికల ప్రక్రియకు ముందు గ్రామాల్లో కిలో చికెన్ రూ.185 నుంచి రూ.205 ఉంది. నాలుగైదు రోజులుగా రూ.245 వరకు పెరిగింది. అక్కడే వండిస్తే రూ.340 వరకు తీసుకుంటున్నారు. రోజూ ఎంత మంది ఓటర్లకు, ఎంత పంపిణీ చేయాలో అభ్యర్థులు లెక్కలేసుకుంటున్నారు. ఆంధ్రా నుంచి రొయ్యలు, బొచ్చలు వంటి సముద్ర చేపలు కూడా దిగుమతి చేసుకొని పల్లెలో పెరుగుతున్న డిమాండ్‌కు తగినట్లు సరఫరాచేస్తున్నారు. రొయ్యలు కిలోకు 350 వరకు ధర పెంచారు. గొర్రె,మేక మాంసం వ్యాపారులు కూడా వాటి ధరలను పెంచారు. పదికిలోల గొర్రెపిల్లకు గతంలో 8వేల రూపాయలు ఉండగా ఇప్పుడు పది నుంచి 12వేలకు పెంచి విక్రయిస్తున్నారు. కిలో మటన్‌కు దాదాపురూ.900ధర పలుకుతోంది. బోటి, తలకాయ కాళ్ళు ధరలు కూడా పెంచేశారు. గ్రామాల్లో ఒక్కో కుటుంబానికి అరకిలో చికెన్,తోపాటు కల్లు, మద్యం తాగనివారికి కూల్‌డ్రింక్స్ అందించేందుకు అభ్యర్థుల సన్నాహాలు చేసుకొంటున్నారు. దీనితో గ్రామాల్లో కూరగాయల భోజనం కంటే మాంసాహార భోజనం చేసే వారి సంఖ్యపెరుగుతోన్నది. ఒక్కో గ్రామంలో అభ్యర్థులు కోట్లరూపాలలో మద్యం,మాంసంపై పెట్టుబడి పెడుతున్నారు. సర్పంచి బాధ్యతలు కీలకమైనా నిధులు అరకొరగా వస్తుండటంతో అప్పులపాలై పదవి విరమణ చేసేవారి సంఖ్యపెరుగుతోన్నది. సర్పంచ్ కనీసం నెలకోసారి పంచాయతీ పాలకవర్గ సమావేశం, రెండు నెలలకోసారి గ్రామసభ నిర్వహించాలి. గ్రామ ఖాతాల వార్షిక ఆడిట్ పూర్తి చేయించడం, అభివృద్ధి నిధులను పారదర్శకంగా వినియోగించడం ఇతడి కర్తవ్యం. పర్యావరణ పరిరక్షణలోనూ కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. నర్సరీల ఏర్పాటు, మొక్కల పెంపకం. వాటిలో 85 శాతం మేర సంరక్షించడం తప్పనిసరి. స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. రోడ్డుపై ఎవరైనా చెత్త వేస్తే రూ.500 జరిమానా విధించే అధికారం ఉంది. ఇంటింటికీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మింపజేయాలి. రాజకీయ ఎత్తుగడలు, ప్రజలను ప్రలోభపెట్టి ఓట్లు వేసుకొని సర్పంచ్ పదవి చేపట్టినా బాధ్యతలు సక్రమంగా నిర్వహించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవు. వరుసగా గ్రామసభలు నిర్వహించకపోతే పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచి పదవి రద్దయ్యే అవకాశముంది. అవినీతి ఆరోపణలు నిరూపితమైతే అనర్హత వేటు పడుతుంది. పంచాయతీ ఆడిట్లు, లెక్కలు పూర్తి చేయకపోయినా పదవి నుంచి తొలగిస్తారు. ఉపసర్పంచి, వార్డు సభ్యులకు మాత్రం ఎలాంటి వేతనం ఉండదు. వరుసగా మూడు సమావేశాలకు వార్డు సభ్యులు, ఆరు సమావేశాలకు మహిళా సభ్యులు గైర్హాజరైతే కలెక్టర్ వారిని పదవికి అనర్హులుగా ప్రకటించే అవకాశముంది.

## కేటీఆర్‌తో మారిషస్ విదేశాంగ సహాయ మంత్రి భేటీ

### తెలంగాణ ప్రగతి, వాణిజ్య అవకాశాలపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,డిసెంబర్3:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో మారిషస్ దేశ విదేశాంగ, ప్రాంతీయ సమైక్యత, అంతర్జాతీయ వాణిజ్య శాఖ సహాయ మంత్రి హంబైరాజన్ నర్సింఘెన్ సమావేశమయ్యారు.బుధవారం కేటీఆర్ నివాసంలో ఈరోజు ఈ మర్యాదపూర్వక భేటీ జరిగింది. ఈ సందర్భంగా గత దశాబ్ద కాలంలో తెలంగాణ రాష్ట్రం సాధించిన అద్భుతమైన ప్రగతి, అభివృద్ధి గురించి ఇరువురు చర్చించుకున్నారు. అలాగే భవిష్యత్తులో ఇరు ప్రాంతాల మధ్య వాణిజ్య విస్త రణకు ఉన్న అవకాశాలు, పెట్టుబడులు, పరస్పర సహకారం వంటి అంశాలపై కూడా వారి మధ్య కీలక చర్చలు జరిగినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలను కేటీఆర్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ, మారిషస్ మంత్రిని కలవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

4-12Pg5 9_4-12Pg5.qxd 03/Dec/25 10:07 PM Page 1



# అమెరికాలో హెల్త్‌కేర్ స్కామ్..

## భారతీయుడికి రెండేళ్లు జైలు

**వాషింగ్టన్, డిసెంబర్ 3:** అమెరికాలో భారత సంతతికి చెందిన వ్యక్తి రూ.10 కోట్లకు పైగా హెల్త్‌కేర్ కుంభకోణానికి పాల్పడ్డాడు. ఒక డయాగ్నస్టిక్ ల్యాబ్ ద్వారా జరిగిన ఈ మోసానికి గాను కోర్టు నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ మేరకు యూఎస్ అటార్నీ చార్లెస్ నైల్ ఫ్లోయిడ్ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా అటార్నీ మాట్లాడుతూ ఈ మెడికేర్ నిధులు ముఖ్యమైన వైద్య సంరక్షణ కోసం వినియోగించాల్సి ఉండగా, వాటిని పక్కదారి పట్టిస్తున్నారన్నారు. దీనివల్ల ప్రభుత్వంతో పాటు పన్ను చెల్లించేవారికి ఎక్కువ నష్టం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహ్మద్ ఆసిఫ్ ఈ యేడాది ఏప్రిల్‌లో చికాగో ఓహేర్ ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కుతుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అతడు వాషింగ్టన్‌లో ఓ డయాగ్నస్టిక్ టెస్టింగ్ లాబోరేటరీ ద్వారా ఈ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. వృద్ధులు, పేదలకు చికిత్స అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెడికేర్ వ్యవస్థను అతడు పక్కదారి పట్టించినట్లు తెలుస్తోంది. ఆసిఫ్ మరికొందరితో కలిసి కొవిడ్ నిర్ధారణతో సహా ఇతర శ్వాసకోశ సమస్యలకు పరీక్షలు చేయకుండానే నకిలీ బిల్లులు తయారుచేసినట్లు ప్రాసిక్యూటర్లు తెలిపారు. కోర్టు వివరాల ప్రకారం ఓ ల్యాబ్‌ను 2021లో ఏర్పాటు చేశారు. దీని మెడికల్ లైసెన్స్ 2023లో పూర్తవగా ఫిర్యాదుల నేపథ్యంలో 2025లో దీన్ని మూసివేశారు. ఈ ల్యాబ్‌కు మెడికేర్ డైరెక్టర్‌గా ఆసిఫ్ ఉన్నాడు. అనేకమంది తాము ఎన్నడూ చేయించుకోని పరీక్షలకు కూడా ఛార్జీలు విధించినట్లు ఆరోపణలు చేశారు. కొన్నిసార్లు చనిపోయిన వ్యక్తుల పేర్ల మీద కూడా ఛార్జీలు విధించినట్లు ఆరోపణలు చేశారు. చనిపోయిన వ్యక్తుల పేర్ల మీద కూడా పరీక్షలు నిర్వహించినట్లు బిల్లులు రూపొందించినట్లు వెల్లడైంది. ఈ కంపెనీ ఆర్థిక లావాదేవీలను ఆసిఫ్ నిర్వహించేవాడని అధికారులు గుర్తించారు. ఈ క్రమంలోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు కూడా మోసాన్ని అంగీకరించిన నేపథ్యంలో తాజాగా జైలు శిక్ష పడింది. ఈ జైలు శిక్ష పూర్తయిన అనంతరం నిందితుడిని దేశం నుంచి బహిష్కరించే అవకాశాలు ఉన్నాయి.



# సంచార్ సాథీపై కేంద్రం యుటర్న్

- ఆ యాప్ వ్యక్తిగత గోప్యతకు భంగం - పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- ప్రిఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని జ్యోతిరాదిత్య వివరణ - మాస్కులతో పార్లమెంటుకు ఎంపిలు - రేణుకాచౌదరిపై ప్రివిలేజ్ మోషన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** సైబర్ నేరాల నుంచి రక్షణ కోసం సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగానే ఇన్‌స్టాల్ చేసి ఇవ్వాలన్న కేంద్రం ఆదేశాలు పార్లమెంట్‌లో దుమారం రేపాయి. ఇది ప్రజల వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడటమేనని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బుధవారం పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ అంశంపై చర్చకు అనుమతించాలని విపక్షాలు పట్టుబట్టాయి. అయితే, యాప్‌ను ఇన్‌స్టాల్ చేసినప్పటికీ, వినియోగదారులు తొలగించుకోవచ్చని, రిజిస్టర్ అయిన తర్వాతే అది పనిచేయడం ప్రారంభిస్తుందని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అయినప్పటికీ, ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. సైబర్ సెక్యూరిటీ యాప్‌ను కొత్త డివైస్‌లను ప్రీలోడ్ చేయాలని స్మార్ట్‌ఫోన్ కంపెనీలకు కేంద్రం ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో వస్తున్న ఆరోపణలకు మంత్రి ఈ మేరకు లోక్‌సభలో ప్రకటన చేశారు. "సంచార్ సాథీ సేఫ్టీ యాప్‌తో స్నూపింగ్ జరగదు" అని సింధియా స్పష్టంచేశారు. యాప్ ప్రీఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని ప్రజల రక్షణ కోసమే ఆ యాప్‌ను తయారు చేసినట్లు ఆయన వెల్లడించారు. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రజలు తమను తాము రక్షించుకునేందుకు వారికే అధికారాన్ని ఇస్తున్నట్లు మంత్రి చెప్పారు. స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలని నవంబర్ 28వ తేదీన కేంద్ర ప్రభుత్వం టెక్ కంపెనీలకు ఆదేశాలు ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైన నేపథ్యంలో, ఈ యాప్ ప్రీఇన్‌స్టలేషన్ తప్పనిసరి కాదని కేంద్రం స్పష్టం చేసింది. ఈ మేరకు ముందస్తు ఇన్‌స్టలేషన్ ఉత్తర్వును వెనక్కి తీసుకుంది.

**మాస్కులతో పార్లమెంట్‌కు ఎంపిలు:** దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వాయు కాలుష్యం ప్రమాదకరస్థాయిలో కొనసాగుతోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400గా నమోదవుతోంది. దీంతో కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యంపై ఎంపిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు గ్యాస్ మాస్కులు ధరించి పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు హాజరయ్యారు.

**కొత్త కార్మిక చట్టాలపై ఆందోళన:** మరోవైపు కొత్త కార్మిక చట్టాలను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. లోక్‌సభలో కొత్త లేబర్ చట్టాలపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్ వాయిదా తీర్మానం అందజేశారు. ఇటీవల కేంద్ర సర్కారు నాలుగు లేబర్ కోడ్‌లను ప్రకటించింది. కోడ్ ఆఫ్ వేజెస్ 2019, ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020, కోడ్ ఆన్ సోషల్ సెక్యూర్టీ 2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్, వర్కింగ్ కండీషన్స్ కోడ్‌ను అమలు చేయనున్నారు. నవంబర్ 21వ తేదీ నుంచి కొత్త కార్మిక చట్టాలను అమలులోకి తెచ్చారు. పార్లమెంట్ ఆవరణలో బ్యానర్, ప్లకార్డులు చేతబూని నిరసన చేపట్టారు. కార్పొరేట్ జంగిల్ రాజ్‌కు నో చెప్పాలని ఆ బ్యానర్‌లో డిమాండ్ చేశారు.

**ఫేక్ న్యూస్ ప్రజాస్వామ్యానికి ముప్పు:** నకిలీ వార్తలు (ఫేక్ న్యూస్) ప్రజాస్వామ్యానికి పెనుముప్పుగా పరిణమించాయని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై తప్పుడు సమాచారం, ఎఐ ఆధారిత డీప్‌ఫేక్‌లపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ఎఐ ఆధారిత డీప్‌ఫేక్‌లను కట్టడి చేయడానికి బలమైన చట్టపరమైన చట్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.

లోక్‌సభలో డీప్‌ఫేక్‌లపై సభ్యులడిగిన ప్రశ్నలకు అశ్వినీ వైష్ణవ్ సమాధానమిస్తూ, తాజాగా తెచ్చిన కొత్త నిబంధనలు అమలు చేస్తున్నామని, నోటిఫికేషన్ వచ్చిన 36 గంటల్లోపు కంటెంట్ తొలిగించాలి. లేదంటే కఠిన చర్యలుంటాయని కేంద్ర మంత్రి వివరించారు.

**రేణుకాచౌదరిపై ప్రివిలేజ్ మోషన్:** పార్లమెంట్ ఆవరణలో కుక్కను తీసుకురావడమే కాక, పార్లమెంట్ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి ఎంపి షెహ్‌జాద్ పూనావాలా రాజ్యసభలో ప్రివిలేజ్ మోషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ఎంపి రేణుకాచౌదరిపై ప్రత్యేక హక్కుల తీర్మానం ప్రస్తుతం పరిశీలనలో ఉందని రాజ్యసభ ఛైర్మన్ విపి రాధాకృష్ణన్ తెలిపారు. ప్రివిలేజ్ మోషన్‌పై రేణుకాచౌదరి స్పందిస్తూ, తానేమీ పార్లమెంట్ సభ్యులను కించపరచలేదని వ్యాఖ్యానించారు.

## 'ఆరావళి' సవరణలు డెత్ వారంట్ లాంటిదే!

### కేంద్రంపై సోనియా ఆగ్రహం



**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఆరావళి పర్వత శ్రేణికి సంబంధించి కేంద్ర పర్యాటక శాఖ నూతన మార్పులు తీసుకువచ్చింది. వంద మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ ఆరావళి పర్వతాల విషయంలో సవరణలు చేసింది. దీనిపై ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తీవ్రంగా స్పందించారు. ఆరావళి పర్వతాల భౌగోళిక స్వరూపాన్ని మార్చేలా తీసుకుంటున్న చర్యలు డెత్ వారెంట్ లాంటివని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థకు రాసిన కథనంలో ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. వాటిలోని కొన్ని అంశాలను కాంగ్రెస్ సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకుంది. గుజరాత్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న ఈ పర్వతాలకు దేశ చరిత్ర, భౌగోళిక స్వరూపంలో కీలక స్థానం ఉందని ఆమె అన్నారు. అక్రమ మైనింగ్ కారణంగా ఇప్పటికే వాటి సహజ సంపద తరిగిపోతుండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వం వాటికి డెత్ వారెంట్ ఇచ్చిందని అన్నారు. 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఉన్న కొండల్లో మైనింగ్‌కు అనుమతించడం మైనింగ్ మాఫియాకు బహిరంగ ఆహ్వానం పలకడమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యావరణం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనమని అన్నారు. ఇది వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ నూతన విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## మృతుల కుటుంబంలోని 13 యేళ్ల బాలుడితో హంతకుడికి మరణశిక్ష అమలు

### అఫ్ఘాన్‌లో కొనసాగుతున్న తాలిబన్ల ఉరితీతలు



**కాబూల్, డిసెంబరు 3:** ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్ల పాలనలో అనాగరిక, ఆటవిక న్యాయం మరోసారి బయటపడింది. ఒకే కుటుంబంలో 13 మందిని దారుణంగా హత్య చేసిన వ్యక్తికి, మృతుల కుటుంబానికి చెందిన 13 ఏళ్ల బాలుడి చేత మరణశిక్షను అమలు చేయించారు. కోస్త్ ప్రావిన్స్‌లోని ఓ క్రీడా మైదానంలో సుమారు 80,000 మంది ప్రేక్షకుల సమక్షంలో ఈ బహిరంగ శిక్షను అమలు చేయడం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. మంగళ్ అనే వ్యక్తి సుమారు 10 నెలల క్రితం అబ్దుల్ రెహమాన్‌తో పాటు అతని కుటుంబంలోని 13 మందిని, అందులో తొమ్మిది మంది పిల్లలను హత్య చేశాడు. ఈ కేసులో దోషిగా తేలిన మంగళ్‌కు తాలిబన్ల సుప్రీంకోర్టు "కిసాస్" (ప్రతీకారం) చట్టం కింద మరణశిక్ష విధించింది. ఈ శిక్షను అమలు చేసేందుకు అధికారులు ప్రజలను బహిరంగంగా ఆహ్వానించారు. శిక్ష అమలుకు ముందు, దోషిని క్షమించే అవకాశం ఉందా అని ఆ 13 ఏళ్ల బాలుడిని అడిగారు. అయితే, అందుకు ఆ బాలుడు నిరాకరించడంతో అతని చేతికే తుపాకీ ఇచ్చి దోషిని కాల్చి చంపమని ఆదేశించారు. 2021లో తాలిబన్లు అధికారం చేపట్టిన తర్వాత ఇలా న్యాయవ్యవస్థ ద్వారా మరణశిక్ష అమలు చేయడం ఇది 11వ సారి. ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి తీవ్రంగా స్పందించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని మానవ హక్కుల ప్రత్యేక ప్రతినిధి రిచర్డ్ బెన్నెట్ ఈ చర్యను అమానవీయమైన, క్రూరమైన శిక్ష అని అభివర్ణించారు. ఇది అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, ఇలాంటి వాటిని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. తాలిబన్లు షరియా చట్టం పేరుతో బహిరంగ ఉరిశిక్షలు, కొరడా దెబ్బలు వంటి కఠిన శిక్షలను తిరిగి ప్రవేశపెట్టడంపై మానవ హక్కుల సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



## రూ.53 లక్షల వాచ్‌తో

### సిద్ధరామయ్య మరోసారి వైరల్

**బెంగళూరు,డిసెంబరు 3:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మరోసారి తన ఖరీదైన వాచ్ కారణంగా మళ్లీ వార్తల్లో నిలిచారు. తనను తాను సోషలిస్టు నేతగా అభివర్ణించుకునే ఆయన, తాజాగా రూ. 43 లక్షలకు పైగా విలువైన వాచ్ ధరించి కనిపించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గతంలో హుబ్లో వాచ్‌తో తీవ్ర వివాదంలో చిక్కుకున్న ఆయన, ఇప్పుడు మరోసారి అదే తరహా విమర్శలను ఎదుర్కొంటున్నారు. డికె ఇంట్లో జరిగిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరి చేతులకు కార్టియర్ బ్రాండ్ వాచ్‌లు ఉండగా, అందరి దృష్టి సిద్ధరామయ్య ధరించిన వాచ్‌పైనే పడింది. ఆయన చేతికి ఉన్నది శాంటోస్ డి కార్టియర్ మోడల్ అని, దాని ధర రూ. 43 లక్షల 20 వేలు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది పూర్తిగా 18 క్యారెట్ల రోజ్ గోల్డ్‌తో తయారు చేసిన అత్యంత ఖరీదైన మోడల్. ఇదే తరహాలో 2016లోనూ సిద్ధరామయ్య తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. అప్పట్లో ఆయన రూ. 50 నుంచి 70 లక్షల విలువైన వజ్రాలు పొదిగిన హుబ్లో వాచ్ ధరించడంపై ప్రతిపక్షాలు దుమారం రేపాయి. పేదల పక్షపాతిగా చెప్పుకునే నేత ఇంతటి ఖరీదైన వస్తువులు ఎలా వాడతారని నిలదీశాయి. ఆ సమయంలో సిద్ధరామయ్య స్పందిస్తూ.. ఆ వాచ్‌ను దుబాయ్‌లో ఉండే తన స్నేహితుడైన ఒక ఎన్నారై డాక్టర్ బహుమతిగా ఇచ్చారని, అది సెకండ్ హ్యాండ్ వాచ్ అని వివరణ ఇచ్చారు.

## విమాన ప్రయాణాలకోసం ఎంపి సర్కారు భారీ వ్యయం!

**భోపాల్, డిసెంబరు 3:** విమానాలు, హెలికాప్టర్లలో ప్రయాణం కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తున్నది. విమానయాన బిల్లు రోజుకు రూ.21 లక్షలకు చేరింది. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ మండిపడింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రతాప్ గ్రేవాల్, పంకజ్ ఉపాధ్యాయ్ లేవనెత్తిన ప్రశ్నలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం ఇచ్చింది. 2021 జనవరి నుంచి 2025 నవంబర్ వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.290 కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రైవేట్ వైమానిక ఆపరేటర్లకు అత్యధికంగా రూ. 90.7 కోట్లు చెల్లించింది. జనవరి 2024 నుంచి నవంబర్ 2025 వరకు ప్రైవేట్ విమానాలు, హెలికాప్టర్ల అద్దెల కోసం మధ్యప్రదేశ్ ప్రభుత్వం రూ.143 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 23 నెలల్లో నెలకు దాదాపు రూ. 6.2 కోట్లు లేదా రోజుకు సగటున రూ. 2021 లక్షలు వ్యయం చేసింది. దీనికి ముందు మూడు ఏళ్లల్లో 2021 జనవరి నుంచి 2023 డిసెంబర్ వరకు ప్రభుత్వం రూ.147 కోట్లు ఖర్చు చేసింది. అంటే నెలకు దాదాపు రూ. 4.1 కోట్లు లేదా రోజుకు సగటున రూ.13 నుంచి రూ.14 లక్షలు వ్యయమైంది. మరోవైపు 2019లో మధ్యప్రదేశ్ రాష్ట్ర విమానాల అద్దె వ్యయం ఏటా రూ.1.63 కోట్లు ఉన్నది. అయితే 2025 నాటికి అది రూ.90.7 కోట్లకుపైగా పెరిగిందని సీఎం మోహన్ యాదవ్ అంగీకరించారు. కోవిడ్ తర్వాత పర్యాటకంతోపాటు విమానాల డిమాండ్ పెరగడం, లోక్‌సభ ఎన్నికలు, ఇంధనంతోపాటు నిర్వహణ ఖర్చులు తీవ్రంగా పెరుగడం వంటి కారణాల వల్ల అద్దె రేట్లను ఆ రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. దీంతో ప్రైవేట్ విమానం, హెలికాప్టర్ ఛార్జీలు 20నుంచి30 శాతం పెరిగాయి. 2022-23లో గంటకు రూ.4.45 లక్షలుగా ఉన్న ధరలు 2024లో రూ.5.70 లక్షలకు పెరిగాయి. కొన్ని సంస్థల హెలికాప్టర్ ధరలు గంటకు రూ.5.29 లక్షలకు చేరుకున్నాయి. 2021 మేలో కూలిపోయిన ఆ రాష్ట్ర ప్రభుత్వ విమానం గ్వాలియర్ ఎయిర్‌బేస్‌లో నిలిచిపోయింది.

## భారత్‌తో యుద్ధానికి ఆసిమ్ మునీర్ తహతహ!



**రావల్పిండి, డిసెంబరు 3:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సోదరి అలీమా ఖాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఆసిమ్ మునీర్ భారత్‌తో యుద్ధం చేయాలని తహతహలాడుతుంటే, తన సోదరుడు ఇమ్రాన్ ఖాన్ మాత్రం పొరుగు దేశంతో స్నేహాన్ని కోరుకుంటారని ఆమె అన్నారు.ఒక ఆంగ్ల ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఆసిమ్ మునీర్ ఛాందసవాద ఇస్లామిస్ట్. అందుకే ఇస్లాంను విశ్వసించని వారితో యుద్ధం చేయాలని ఆయన కోరుకుంటున్నారు. ఇమ్రాన్ ఖాన్ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి భారత్‌తో, చివరికి బీజేపీతో కూడా స్నేహం చేయడానికి ప్రయత్నిస్తారు. కానీ, మునీర్ లాంటి వ్యక్తి ఉన్నప్పుడు భారత్‌తో యుద్ధం తప్పదని అలీమా స్పష్టం చేశారు. ఈ ఏడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్ర స్థావరాలపై దాడులు చేసిన విషయం తెలిసిందే. గతంలో ఇమ్రాన్ ఖాన్ ప్రధానిగా ఉన్నప్పుడు, ఆయన భార్య బుష్రా బీబీపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు అప్పటి ఐఎస్ఐ చీఫ్‌గా ఉన్న మునీర్ ఆసక్తి చూపారు. దీంతో ఆగ్రహించిన ఇమ్రాన్, మునీర్‌ను ఎనిమిది నెలల్లోనే ఆ పదవి నుంచి తొలగించారు. అప్పటి నుంచి వారి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇమ్రాన్ ఖాన్ 2023 ఆగస్టు నుంచి రావల్పిండిలోని అదియాలా జైల్లో ఉన్నారు. ఇటీవల ఆయన మరో సోదరి డాక్టర్ ఉజ్మా ఖాన్ జైల్లో కలిసి, తన సోదరుడిని మానసికంగా హింసిస్తున్నారని ఆరోపించారు.

# సంక్షిప్తంగా..

## వలసలపై ఆంక్షలు విధిస్తే సొంత ప్రయోజనాలకు దెబ్బ : జైశంకర్



**న్యూఢిల్లీ, డిసెంబర్ 3:** అమెరికా, ఐరోపా దేశాల్లో వలసల ఆంక్షలపై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. వలసలు, నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలపై మితిమీరిన ఆంక్షలు విధిస్తే వాటి సొంత ప్రయోజనాలే దెబ్బతినే అవకాశం ఉందన్నారు. చివరకు ఆ దేశాలే నష్టపోతాయని హెచ్చరించారు. ఢిల్లీలో ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు మాట్లాడారు. చాలా సందర్భాల్లో వాళ్లే ఈ సమస్యను సృష్టించారని, కాబట్టి స్వయంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగుల రాకపోకలకు, ఈ సంక్షోభానికి ఎటు వంటి సంబంధం లేదు. వలసలకు సంబంధించి అమెరికా, ఐరోపా దేశాల్లో ఏమైనా ఆందోళనలు ఉంటే అవి ఆ దేశాలు అమలు చేసిన దీర్ఘకాలిక విధానాల ఫలితమే. గత రెండు దశాబ్దాల్లో ఉద్దేశపూర్వకంగా, అన్ని తెలిసే తమ వ్యాపారాలను విదేశాలకు విస్తరించాయి.

## గాజాలో పెళ్లి సందడి.. పెద్దఎత్తున సామూహిక వివాహాలు



**గాజా, డిసెంబర్ 3:** గాజా రెండేళ్లపాటు బాంబ్ దాడులతో దద్దరిల్లింది. భీకర దాడులతో గాజా కకావికలం అయింది. ఇటీవల గాజా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం జరగడంతో ప్రస్తుతం ప్రశాంతంగా ఉంది. దీంతో ఎప్పు డెప్పుడా అంటూ ఎదురుచూసిన జంటలన్నీ ఒకేసారి వివాహ బంధంలోకి అడుపెట్టాయి. పెద్ద ఎత్తున సామూహిక వివాహాలు జరిగాయి. దీంతో గాజాలో సందడి వాతవరణం నెలకొంది. గాజాలో 54 జంటలు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టాయి. గాజాలోని ఖాన్ యూనిస్‌లోని హమద్‌నగర్‌లో జరిగిన వేడుకలో 54 పాలస్తీనా జంటలు వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఈ వేడుక సందడి సందడిగా సాగింది. గాజాలో 2 మిలియన్ల మంది నివాసం ఉంటున్నారు. యుద్ధం కారణంగా అనేక మంది నిరాశ్రయలయ్యారు. ఇజ్రాయెల్ జరిపిన బాంబు దాడులతో భవనాలు నేలమట్టం అయ్యాయి. యుద్ధ సమయంలో బంధువుల ఇళ్లకు వెళ్లి తలదాచుకున్నారు.

## చాయ్‌వాలా మోడీ విడియోవైరల్!

### కాంగ్రెస్‌పై ధ్వజమెత్తిన బిజెపి



**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పార్లమెంట్ శీతాకాల సమావేశాల వేళ ప్రధాని నరేంద్ర మోదీని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ నాయకురాలు ఒకరు షేర్ చేసిన వీడియో రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. కాంగ్రెస్ నేత రాగిణి నాయక్, ప్రధాని మోదీని చాయ్ వాలాగా చిత్రీకరిస్తూ రూపొందించిన ఒక ఏఐ జనరేటెడ్ వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ వీడియోలో ప్రధాని మోదీ ఒక చేతిలో టీ కెటిల్, మరో చేతిలో కప్పులు పట్టుకుని టీ అమ్ము తున్న ట్లుగా ఉంది. ఈ వీడియో క్షణాల్లో వైరల్‌గా మారింది.

దీనిపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ చర్య సిగ్గుచేటని, ఇది ప్రధాని మోదీని ఉద్దేశపూర్వకంగా అవ మానించడమేనని బీజేపీ నేతలు మండిపడుతున్నారు. గతంలో కూడా చాయ్‌వాలా అంటూ కాంగ్రెస్ చేసిన విమర్శలను ప్రధాని మోదీ అనుకూలంగా మార్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి అదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఏఐ టెక్నాలజీతో వీడియోను సృష్టించడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

## బెంగాల్ 'సర్'పై ప్రధానిమోడీ బిజెపి ఎంపిలకు మార్గనిర్దేశనం

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పశ్చిమబెంగాల్ లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ ఓటరు జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. దాంతో ఎస్ఐఆర్ నిర్వహణపై బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎంపీల కు ప్రధాని నరేంద్రమోడీ కీలక సూచనలు చేశారు. ఆ ప్రక్రియ సరళంగా, పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న ఓటర్లను చేర్చడం, అర్హతలేని వారిని తొలగించడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని, ఇదే సందేశం క్షేత్రస్థాయికి చేరేలా చూసుకోవాలని ఎంపీలను ప్రధాని ఆదేశించారు. ఈ మేరకు ప్రధాని మోడీ సన్నిహితవర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు ప్రచురితమయ్యాయి. అదేవిధంగా 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉండాలని ఎంపీలకు మోదీ సూచించారు. తృణమూల్ కాంగ్రెస్, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్లను ప్రస్తావించకుండానే విపక్షాల ట్రాప్‌లో పడవద్దని ఎంపీలను హెచ్చరించారు. అదేవిధంగా ఆ రాష్ట్రంలో బీజేపీ ఎదిగిన తీరును ప్రస్తావించారు. 2011లో అసెంబ్లీలో ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారని, 2021లో ఆ సంఖ్య 65కు చేరిందని చెప్పారు.

## పాక్ ఐఎస్ఐకి గూఢచర్యం కేసులో లాయర్ అరెస్ట్!

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** పాకిస్థాన్ నిఘా సంస్థ ఐఎస్ఐకు గూఢచర్యం చేస్తున్నాడన్న ఆరోపణలపై హర్యానాలోని గురుగ్రామ్‌కు చెందిన న్యాయవాది రిజ్వాన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు డబ్బులు తీసుకోవడానికి ఏడుసార్లు అమృత్‌సర్ వెళ్లినట్లు తేలింది. ఈ విషయం పోలీసుల అదుపులో ఉన్న రిజ్వాన్ స్నేహితుడు ముషారఫ్ అలియాస్ పర్వేజ్ ద్వారా తేలింది. మూడేళ్ల క్రితం సోహ్నా కోర్టులో రిజ్వాన్, ముషారఫ్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వారిద్దరూ మంచి స్నేహితులయ్యారు. ఆ తర్వాత ఇద్దరూ వృత్తిరీత్యా వేరువేరు ప్రాంతాలకు వెళ్లిపోయారు. ముషారఫ్ ప్రాక్టీస్ కోసం నుహ్ కోర్టుకు వెళ్లగా.. రిజ్వాన్ గురుగ్రామ్ కోర్టుకు వెళ్లాడు. అయినప్పటికీ తరచూ కలుసుకునే వాళ్లు. అయితే, రిజ్వాన్ తరచూ అమృత్‌సర్ వెళ్లేవాడని ముషారఫ్ పోలీసులకు తెలిపాడు. ఈ జులైలో అతడితో కలిసి తాను కూడా అమృత్‌సర్ వెళ్లినట్లు చెప్పాడు.

## కేబినెట్‌మీట్‌లో నిద్రపోయిన అమెరికా అధ్యక్షుడు!



**వాషింగ్టన్, డిసెంబరు 3:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన ఆరోగ్యం విషయంలో వార్తల్లో నిలిచారు. నిన్న వైట్‌హౌస్‌లో జరిగిన సుదీర్ఘ క్యాబినెట్ సమావేశంలో ఆయన నిద్రమత్తులో జోగుతున్నట్టు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. తాను 25 ఏళ్ల క్రితం కన్నా ఎంతో చురుగ్గా ఉన్నానని మీడియా ముందు ప్రకటించిన కొద్దిసేపటికే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశం ప్రారంభంలో తన ఆరోగ్యంపై వస్తున్న కథనాలను ట్రంప్ తీవ్రంగా ఖండించారు. అయితే, మీటింగ్ మొదలైన 15 నిమిషాల నుంచే ఆయన కళ్లు మూతలు పడుతున్నట్లు కనిపించారు. పలువురు క్యాబినెట్ మంత్రులు తమ శాఖల పనితీరును వివరిస్తుండగా, ట్రంప్ పలుమార్లు 10 నుంచి 15 సెకన్ల పాటు కళ్లు మూసుకుని కునుకు తీస్తున్నట్లు వీడియో ఫుటేజీలో రికార్డయింది. విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఆయన పక్కనే కూర్చుని మాట్లాడుతున్నప్పుడు కూడా ట్రంప్ నిద్రమత్తులోనే ఉన్నారు. అయితే, ఈ ఆరోపణలను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ తోసిపుచ్చారు. అధ్యక్షుడు ట్రంప్ సమావేశాన్ని ఎంతో శ్రద్ధగా వింటున్నారని, మొత్తం మీటింగ్‌ను ఆయనే నడిపించారని ఆమె స్పష్టం చేశారు. సమావేశం చివర్లో విలేకరుల ప్రశ్నలకు ఆయన దీటుగా సమాధానాలు చెప్పడమే ఇందుకు నిదర్శనమని ఆమె అన్నారు. ఇటీవలి కాలంలో ఆయన ఆరోగ్యంపై తరచూ వార్తలు వస్తున్నాయి. ఆయన క్రానిక్ వీనస్ ఇన్సఫిషియన్సీ అనే రక్తనాళాల సమస్యతో బాధపడుతున్నట్లు వైట్‌హౌస్ గతంలో వెల్లడించింది. అయితే, అక్టోబర్‌లో జరిగిన వైద్య పరీక్షల అనంతరం సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారన్నారు.

## నాన్‌ఎసి ప్యాసింజర్లకు జనవరి నుంచి బెడ్‌రోల్స్!

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** రైలుప్రయాణం మరింత సౌకర్యంగా ఉండేందుకువీలుగా రైల్వే మంత్రిత్వశాఖ కొత్త కొత్తవసతులు కల్పిస్తోంది. నాన్ ఎసి స్లీపర్‌కోచ్‌లోప్రయాణించేవారికి కూడా బెడ్‌షీట్లు, దిండ్లు అందించనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. ఈ సౌకర్యం ఇప్పటివరకూ ఫస్ట్, సెకండ్, థర్డ్ ఎసి కోచ్‌లలో మాత్రమే లభించేంది. గరీబ్‌రథ్ వంటి కొన్ని ప్రత్యేక రైళ్లలో బెడ్‌రోల్‌కావాలంటే అదనంగా రూ.25 చెల్లించాల్సి ఉంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు. బెడ్‌రోల్స్‌లో రెండు దిండ్లు, రెండు బెడ్‌షీట్లు, ఒక దుప్పటి, ఒక టవల్ ఉంటాయి. స్లీపర్ క్లాస్ బెడ్‌రోల్స్ కొన్ని రైళ్లకే ఉండేది. అలాంటిది 2023-24 చలికాలం నుంచి నాన్‌ఎసి స్లీపర్‌ప్రయాణీకులకు అద్దెకు బెడ్‌షీట్లు ఇస్తోంది.

ప్రయాణీకులనుంచి మంచి స్పందన కూడా లభించిందన్నారు.

అదనంగా అద్దెఛార్జి 50 మాత్రమే తీసుకుంటారని తెలిపారు. 2026 జనవరి ఒకటినుంచి ఈ సౌకర్యం తొలుత చెన్నై డివిజన్ దక్షిణరైల్వేలో ప్రారంభిస్తారు.

## పార్లమెంటులో ప్రధాని వ్యాఖ్యలు సరికాదు

**సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ**

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రతిపక్షాలను పార్లమెంట్ సమావేశాల వేదికగా ప్రధాని మోడీ కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యల్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తప్పుబట్టారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే అది ఎందుకు డ్రామా అవుతుందో మోడీ సమాధానం చెప్పాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 ఏళ్లలో మోడీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ గణనీయంగా తగ్గిందన్నారు. 2014లో రూ.60 ఉంటే అది ప్రస్తుతం రూ.90.13కు చేరుకుందని తెలిపారు. రూ.55 లక్షల కోట్ల అప్పును రూ.200 లక్షల కోట్లకు పెంచారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేకపోతున్నారని పేర్కొన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మాజీ మంత్రి థామస్ ఐజాక్‌పై అక్రమ కేసులు బనాయించారన్నారు. కేవలం అప్రజాస్వామిక విధానాలతో మోడీ ప్రభుత్వాన్ని నడపగలనని భావిస్తున్నారన్నారు. ఇందుకు ఆయన తగిన మూల్యం చెల్లిస్తారన్నారు.

## మెగా పేరెంట్, టీచర్ సమావేశాల్లో టిడిపి కార్యకర్తలేంటి?

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్, టీచర్ సమావేశాల్లో పాల్గొనాలని టిడిపి కార్యకర్తలకు ముఖ్యమంత్రి పిలుపునివ్వడం తీవ్ర అభ్యంతరకరమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. అధికారిక కార్యక్రమాల్లో తమ పార్టీ కార్యకర్తలను పాల్గొనాలని చెప్పడం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తేడా లేకుండా చేయడమేనన్నారు. పాఠశాల అకడమిక్ కార్యకలాపాలను అధికార పార్టీ రాజకీయ ప్రచారానికి వినియోగించుకోవడం సరైంది కాదని, విద్యా కమిటీలు, తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను మాత్రమే వీటికి అనుమతించాలని కోరారు. బయట వ్యక్తులు, విద్యార్థి సంఘాలు విద్యా సంస్థల్లోకి ప్రవేశించరాదని, ఒకపక్క జిఓ ఇచ్చి మరోపక్కన తమ పార్టీ కార్యకర్తలను విద్యా సంస్థల్లో జరిగే సమావేశాల్లో పాల్గొనాలని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వెల్లడిస్తోందని విమర్శించారు. విద్యాసంస్థల్లో బయట వ్యక్తులనే పేరుతో విద్యార్థి సంఘాలను నిషేదిస్తూ జిఓ జారీ చేయడాన్ని రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులందరూ నిరశించినా ప్రభుత్వం తన మొండివైఖరి కొనసాగిస్తోందని వివరించారు.

## విద్య, వైద్యం ప్రైవేటీకరణతో వ్యవస్థ చిద్రం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య**

విజయవాడ, డిసెంబరు 3,ప్రభాతవార్తప్రతినిధి: విద్యా, వైద్య రంగాల ప్రైవేటీకరణతో వ్యవస్థ చిద్రం అవుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలను ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కూటమి ప్రభుత్వం తెరతీసింది. రాష్ట్రంలో విద్యారంగాన్ని శాసించే స్థాయికి శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ సంస్థలు, ప్రైవేట్ యూనివర్సిటీలు చేరుకున్నాయి. పిపిపి పద్ధతిలో 10 మెడికల్ కాలేజీలతోపాటు తొలివిడతగా 4 బోధనాసుపత్రులను ప్రైవేటుకు అప్పగించేందుకు చంద్రబాబు సర్కార్ రంగం సిద్ధం చేసింది. ప్రభుత్వ భూమి, వనరులు, భవనాల నిర్మాణం, సిబ్బంది నియామకం, జీతాల చెల్లింపు వంటి వందల కోట్ల ప్రజాధనాన్ని ప్రైవేటు శక్తులకు అప్పగిస్తున్నది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 107, 108లను రద్దు చేయాలి. పిపిపి విధానానికి స్వస్తిపలికి మెడికల్ కాలేజీలను, బోధన ఆసుపత్రులను ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని కోరారు.

## పిటిఎంలను టిడిపి ప్రచార కేంద్రాలుగా మార్చొద్దు: ఎస్ఎఫ్ఐ

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్తప్రతినిధి: మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ (పిటిఎం)లను టిడిపి ప్రచార కేంద్రాలుగా మార్చొద్దని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమావేశాల్లో టిడిపి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆదేశించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.రామ్మోహన్‌రావు, కె.ప్రసన్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సమస్యలు విద్యారంగ అభివృద్ధి చర్చించే వేదికగా ఉండాలని, రాజకీయ వేదికగా ఉండకూడదని సూచించారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకూడదని ఒకవైపు సర్క్యులర్‌ను విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. మరోవైపు నేరుగా పాఠశాలల సమావేశాలకు పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని ఆదేశించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఒకవైపు విద్యాసంస్థల్లోకి రాజకీయ ప్రసంగాలు, కార్యకలాపాలు, జెండాలు వద్దని చెప్తూనే వారి పార్టీ కార్యకర్తలతో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. ఈ నెల 5న జరిగే పిటిఎం సమావేశాలకు విద్యార్థి సంఘాలకు అనుమతులిచ్చి, విద్యార్థి సమస్యలు, అకడమిక్, మౌలిక సదుపాయాలపై చర్చించాలని కోరారు. ఈ సమావేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విద్యా రంగంలో సమస్యలు గాలికొదిలేసి ఇప్పుడు అది కప్పిపుచ్చేందుకు పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## శాస్త్రోక్తంగా కృత్తికా నక్షత్ర పూజలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 3 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం ఉదయం శాస్త్రోక్తంగా కృత్తికా నక్షత్ర పూజలను నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి ఆదేశాలతో ఆలయ పొరోహితులు అర్ధగిరి ప్రసాద్ పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే జ్వాలాతోరణానికి సంబందించిన పూజలు బుధవారం ఉదయం ఆలయంలోని నంది మండపం ఎదురుగా నిర్వహించారు. ఓ వైపు అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు అభిషేక గురుకుల్ వరదా గురుకుల్, ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, నిరంజన్ గురుకుల్ సారథ్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయంమేరకు పెద్దనంది విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన తాటి మానుకు పూజలు జరిపారు. ఇక్కడ కలశస్థాపన గావించారు. పొరోహి తులు వేద మంత్రాలను పఠిస్తుండగా అభిషేక గురుకుల్ డాక్టర్ స్వామినానాథన్, ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్, అభిషేక గురుకుల్స్ వరదగురుకుల్, నిరంజన్ గురుకుల్, దండ నాయకుడు డాక్టరనఅచ్చితా గురుకుల్ పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గుర్రప్పశెట్టి, ఆలయ డిప్యూటి కార్యనిర్వహణాధికారి ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్ పాల్గొన్నారు. ఏర్పాట్లను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు పర్యవేక్షించారు.

## దక్షిణకైలాసంలో 'గంగజాతర' సంబరాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 3 ప్రభాతవార్త: పుణ్యక్షేత్రంగా, శైవక్షేత్రంగా ప్రసిద్ధిపొందిన దక్షిణకైలాసమైన శ్రీకాళహస్తిలో ప్రతినెలా ఓ ధార్మిక కార్యక్రమం ప్రత్యేకతగా సాగుతోంది. ఈ ఏడాది జాతరకు శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఉంది. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సారథ్యంలో ఎన్నో ధార్మిక కార్యక్రమాలు చేపడుతున్నారు. దేశంలోనే మంచు కాలం జాతర నిర్వహించే ఒకే ఒక ప్రాంతం శ్రీకాళహస్తి. ఇక్కడ నిర్వహించే ప్రతి ధార్మిక కార్యక్రమంలోను దేవస్థానం భాగస్వామ్యం ఉంటోంది. మంచుకాలంలో పండుగ నెల ధనుర్మాసం ప్రారంభానికి ముందు నిర్వహించే ఏడు గంగమ్మల జాతర ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఏ ఏడాదికాఏడాది జాతర సంబరాల్లో నిర్వాహకులు ప్రత్యేకతను ఆపాదిస్తున్నారు యువకమిటీల సారథ్యంలో నిర్వహించే జాతరకు యువకులు అలంకారాల నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈఏడాది కూడా యువకమిటీలు చొరవచూపి భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. పదిహేను రోజులుగా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అమ్మవార్లకు బంగారు వెండినగలను కూడా తయారుచేస్తున్నారు. ఏడు గంగమ్మలకు సారెను అందించేందుకు మేళతాళాలు మంగళ వాయిద్యాలు ఏర్పాటు చేస్తున్నారు. సారెను అందించేందుకు ముత్యాలమ్మగుడివీధిలో మామిడి తోరణాలు, అరటిచెట్లతో ఇరు వైపులా ముస్తాబులు చేశారు.

### పెండ్లిమండపం కమిటీ ఏర్పాట్లు

శ్రీకాళహస్తిలో నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల జాతరలో పెండ్లిమండపం గంగమ్మ కమిటీ యువకులు తమదైనశైలిలో ఏర్పాట్లతో పాటు కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. సప్పరాల విషయంలో ఎవరికి వారు తమ ప్రత్యేకతను చాటుకునేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ఆదివారం రాత్రి చాటింపుకు సన్నాహాలు చేపట్టారు. ఈ నెల 9న మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఏడు ప్రాంతాల్లోని గంగమ్మలను ముత్యాలమ్మగుడి వీధిలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేర్చి అక్కడ పసుపుముద్దలతో అమ్మవారిని తయారుచేసి దీపం వెలిగించి బలి ఇవ్వడం ఆనవాయితీ. అయితే సప్పరాల విషయంలో ఎవరికి వారు ప్రత్యేకతను చోటు చేసుకుంది.రక రకాల సప్పరాను రూపకల్పనకు రూపొందిస్తున్నారు.

## భద్రాచలం- కొవ్వూరు రైల్వే లైన్ పూర్తి చేయండి

**రైల్వే మంత్రికి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ విజ్ఞప్తి**



ఏలూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త: హైదరాబాద్, విశాఖ మధ్య దాదాపు 150 కిలోమీటర్ల దూరం తగ్గించి, నాలుగు ఎస్సి అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు ఎస్టి అసెంబ్లీ నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ వెళ్లే అత్యంత ముఖ్యమైన భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్ పనులను త్వరగా చేపట్టాల్సిందిగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కోరారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ, భద్రాచలం కొవ్వూరు రైల్వే లైన్‌కు సంబంధించి డీపీఆర్ సిద్ధమైందని అధికారులు చెబుతున్నారని, దానిపై త్వరగానే నిర్ణయం తీసుకొని పనులు వెంటనే మొదలుపెట్టే విధంగా రైల్వే అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఒక లేఖను కేంద్ర మంత్రికి అందించారు. ఈ రైల్వే లైన్ కోసం అవసరమైన భూమిని ఉచితంగా అందించడానికి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పిన ఎంపీ, రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఆర్థిక వనరులు తక్కువగా ఉన్న కారణంగా 100 శాతం రైల్వే నిధులతో ఈ ప్రాజెక్టు చేపట్టాలని గతంలోనే కోరిన విషయాన్ని కూడా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన లేఖలో గుర్తుచేశారు. అదేవిధంగా ఏలూరు పార్లమెంట్ పరిధిలో ఇప్పటికే మంజూరైన 11 ఆర్వోబీ/ ఆర్యూబీల పనులను కూడా త్వరగా మొదలు పెట్టాలని కోరుతూ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మరో లేఖ అందించారు. ప్రాధాన్యత ప్రాతిపదికన ఈ ఆర్వోబీల పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వాల్సిందిగా తన లేఖలలో కేంద్ర రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## స్వాంతన కింద రూ.5 కోట్లతో నిధి

**- మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి**

సచివాలయం, డిసెంబరు 3 ప్రభాతవార్త: దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, సాంఘీక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఎవరైనా దురదృష్టవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి భరోసాగా స్వాంతన పథకం కింద కూటమి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థికసాయం అందిస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముగ్దురు విద్యార్థులు కుటుంబాలకు స్వాంతన చెక్కులను బుధవారం అమరావతి తాడేపల్లిలోని ఏపి ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యాలయంలో మంత్రి అందజేశారు. పల్నాడు జిల్లా ఆర్కేపురం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం 10వ తరగతి విద్యార్థి టి.నిహారిక, ప్రకాశం జిల్లా రాచర్ల గురుకులం 10వ తరగతి విద్యార్థిని కొఠారి కర్ణ, బాపట్ల జిల్లా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం 7వ తరగతి విద్యార్థిని బి.శ్వేత ఇటీవల దురదృష్టవశాత్తు అనారోగ్యంతో మరణించారు. బుధవారం వారి తల్లిదండ్రులకు కుటుంబ సభ్యులకు మంత్రి డాక్టర్ స్వామి ఒక్కొక్క విద్యార్థి కుటుంబానికి రూ.3లక్షల చొప్పున మొత్తం రూ.9లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ దురదృష్టవశాత్తు అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు బాసటగా ఉండేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో రూ.5 కోట్ల నిధులు కేటాయించి స్వాంతన పథకం తీసుకొచ్చాం. అనారోగ్యంతో మరణించిన విద్యార్థుల కుటుంబాలకు ఆర్థికసాయం అందించి భరోసానిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ బి.లావణ్య వేణి, ఏపి ఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ అడిషనల్ సెక్రటరీ సునీల్‌రాజ్ కుమార్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ భవన్‌లో నాగాలాండ్, అసోం ఆవిర్భావ దినోత్సవాలు

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా బుధవారం లోక్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో నిర్వహించిన నాగాలాండ్, అసోం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, నాగాలాండ్ పచ్చని కొండలు, దట్టమైన అడవులు, అద్భుతమైన లోయలతో నిండి ఉందని, నాగాలాండ్ పండుగలకు ప్రసిద్ధి అని, అక్కడ ప్రతి గిరిజన తెగకు వారి స్వంత పండుగలు, ఆచారాలు ఉన్నాయని అన్నారు. అసోం సంవత్సరంలో మూడుసార్లు జరుపుకునే రంగురంగుల బిహు పండుగను గుర్తుకు తెస్తుందని, ఆ రాష్ట్రం ఆధ్యాత్మిక అనుభవాల అద్భుత భూమి అని, ముఖ్యంగా కామాఖ్య ఆలయం దీనికి ప్రత్యేక కేంద్రంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం నాగాలాండ్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా, అసోం గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య వీడియో సందేశాలతో ప్రారంభమైంది, తరువాత ఐకాన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నాగాలాండ్, అసోం జానపద నృత్యాలు జరిగాయి. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. అనంత రాము, పి.ఎస్. సూర్యప్రకాష్, జాయింట్ సెక్రటరీ, లోక్ భవన్ అధికారులు, నాగాలాండ్, అసోం విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## అంధుల క్రికెట్ టీమ్‌కు సిఎస్ అభినందనలు

సచివాలయం, డిసెంబరు 3 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ అంధుల క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కలసింది. ఇటీవల అంధ మహిళల ప్రపంచ క్రికెట్ కప్ గెలుచుకున్న ఈ బృందం టీమ్ కెప్టెన్ దీపిక, టీమ్ సభ్యురాలు కరుణకుమారి నేతృత్వంలో సిఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా అంధుల క్రికెట్ టీమ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన అంధులైన క్రికెటర్లను ప్రభుత్వం నుంచి తగిన సహాయ సహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. సిఎస్‌ను కలసిన వారిలో ఏపి క్రికెట్ బ్లైండ్ అసోసియేషన్ అధ్యక్షులు చెన్న శరత్‌బాబు, కార్యదర్శి జి.రవీందర్, కోచ్ మరియు ట్రెజరర్ అర్జున అవార్డు గ్రహీత అజయ్‌కుమార్ రెడ్డి, టి20 ప్రపంచ కప్ బ్లైండ్ క్రికెట్ ఇండియా కెప్టెన్ దీపిక టిసి, టి20 ప్రపంచ కప్ బ్లైండ్ క్రికెట్ స్టార్ ప్లేయర్ కరుణకుమారి, టీం ఇండియా మేనేజర్ శిఖా శెట్టి, బోర్డు మేనేజ్ కె.కీర్తన, మెడికల్ హెడ్ డాక్టర్ జింకా లక్ష్మీ ప్రసన్న, లక్ష్మీనారాయణ్ కుర్రా తదితరులు పాల్గొన్నారు.





## సాంకేతికతతో రైతన్నకు మూడు రెట్ల ఆదాయం

**● రైతును రాజు చేసేలా ప్రభుత్వ ప్రణాళిక ● 3 మండలాల విలీనానికి సూత్రప్రాయ అంగీకారం: గంటా**

ఆనందపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త: సంప్రదాయ వ్యవసాయానికి సాంకేతికను జోడించడం ద్వారా రైతులు మూడు రెట్ల ఆదాయాన్ని ఆర్జించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోని గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన "రైతన్న మీ కోసం" కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్యపరంగా డిమాండ్ ఉన్న పంటల ద్వారా వ్యవసాయాన్ని పండగలా మార్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్తున్నారని చెప్పారు. చక్కని ఆరోగ్యాన్ని అందించే మిల్లెట్ వంటలు తనకు ఎంతగానో నచ్చాయన్నారు. పంటలతో పాటు పువ్వులు వంటివి నిల్వ చేసుకోవడానికి రైతులు సొసైటీగా ఏర్పడితే, కోల్డ్ స్టోరేజ్‌ల నిర్మాణం ద్వారా వారికి సహకరించడానికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చాయని తెలియజేశారు. ఇనాం భూముల్లో తరాలుగా వ్యవసాయ చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యకు తొందర్లోనే పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలను జీవీఎంసీలో విలీనం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేష్, మున్సిపల్ మంత్రి నారాయణ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారని ప్రకటించారు. రైతుకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి చిత్రపటానికి గంటా సహా కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వ్యవసాయ శాఖ పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, వ్యవసాయ శాఖ ఏడీ చంద్రశేఖర్, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, బి.ఆర్.బి.నాయుడు, కోరాడ రమణ, ఎస్. సత్యవరప్రసాద్, పాండ్రంగి అప్పలరాజు, శాఖారి శ్రీనివాస్, కురుమిన లీలావతి, గండ్రెడ్డి స్వామినాయుడు, బలిరెడ్డి మల్లిఖార్జునరావు, కొప్పల రమేష్, ఎం.శివాజీ, రామరాజు, మామిడి దుర్గారావు, కె.అచ్యుతరావు, మజ్జి నందీష్, మొకర అప్పలనాయుడు, చందవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజంపేటను జిల్లా కేంద్రం చేయండి



రాజంపేట, డిసెంబరు 3 ప్రభాతవార్త: రాజంపేట జిల్లా కేంద్రం ఆకాంక్ష మరోసారి ప్రజల నుంచి బద్దలైంది. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జెసి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రాజంపేట ర్యాలీకి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. వైసిపి అన్ని రాజకీయ పక్షాలు ఏకమయ్యాయి. ఉద్యమం ఊపొందుకుంది. రాజకీయ పక్షాలు ఊహించిన దానికంటే ప్రజల్లో జిల్లా కేంద్రం కావాలనే ప్రగాఢమైన ఆకాంక్ష మరోసారి ఉద్యమంలో బయటపడింది. రాజంపేట జిల్లా కేంద్ర మనోభావాలను ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని పోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు రాజంపేట సబ్ కలెక్టర్ భావనాను కలిసి వినతి పత్రం అందజేశారు. అంతకుముందు వేలాదిగా అన్నమయ్య జిల్లా రాజంపేట పాత బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జేఏసీ ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రాజంపేటలో జిల్లా కేంద్రం చేయాలని రాజంపేట, రైల్వే కోడూరు నియోజకవర్గాల ప్రజలు కోరుతున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబును కూడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తో చంద్రబాబు నాయుడు కలిసి కోరమన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ డిస్టిక్ కూడా తీసుకుపోయి సీఎం డిప్యూటీ సీఎంలను జిల్లా కేంద్రం విషయంలో హామీ ఇచ్చేలా ఒప్పిస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. రాజంపేట రైల్వే కోడూరు బద్వేల్ నియోజకవర్గం కలిపి రాజంపేట కేంద్రంగా జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేశారు.రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం కేంద్రంగా ఉందని, డివిజన్ కేంద్రంగా ఉందని అటు రైలు సౌకర్యం కేవలం, 50 కిలోమీటర్ల నుంచి 100 కిలోమీటర్ల దూరంలో రెండు విమానాశ్రయాలు, జాతీయ రహదారి ఉందని ప్రజలు ఎప్పటినుంచో జిల్లా చేయాలని డిమాండ్ చేస్తున్నారని పాలకులు ఇది గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేపీసీ నాయకులు, జనసేన, టిడిపి, బిజెపి, సిపిఐ, సిపిఎం నేతలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## చేయని నేరానికి బాధ్యుడ్ని చేశారని బాలుడి ఆత్మహత్యాయత్నం

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కృష్ణా జిల్లాలో ఘోరం చోటు చేసుకుంది. చేయని నేరానికి బాధ్యున్ని చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురై 15 ఏళ్ళ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పామర్రు మండలం యడదిబ్బ గ్రామంలో కైలే యశ్వంత్(15) విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. దొంగతనం ఆరోపణతో యశ్వంత్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నాడు. తమ ఇంట్లో రూ.1500 కాజేసాడంటూ పొరుగింట్లో ఉండే వాళ్లు బాలుడిపై ఆరోపణలు చేశారు. తమ ఇంట్లో ఏది పోయిన నీదే బాధ్యత అంటూ బాలుడికి బెదిరించినట్లు సమాచారం. పొరుగింటి వారి బెదిరింపులతో యశ్వంత్ భయాందోళనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో యశ్వంత్ ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడు జమీదగ్గుమిల్లి హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్నాడు. యశ్వంత్ భౌతిక కాయాన్ని చూసి తల్లిదండ్రులు భోరున విలపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శబరిమలకెళ్లి వస్తూ.. రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకులు మృతి

**మృతులు తిరుపతి జిల్లా వాసులు**

బుచ్చినాయుడు కండ్రిగ, డిసెంబరు 3 ప్రభాతవార్త: అయ్యప్ప స్వామి దీక్ష తీసుకుని శబరిమలైలో అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని కారణి గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు కారు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు... కారణి గ్రామానికి చెందిన గురిజాల వేణు(49) కుమారుడు గురజాల నరేష్(30), చాతుర్య(9) వరదయ్యపాళెం మండలం గోవర్ధనపురం గ్రామానికి చెందిన మునితేజ అయ్యప్ప దీక్ష మాల వేసుకుని స్వామి దర్శనం కోసం కారులో బయలుదేరి శబరిమలై చేరుకుని అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని మంగళవారం తిరుగు ప్రయాణం అయ్యారు. మార్గ మధ్యలో కేరళలోని తేనె టౌన్ సమీపంలో కారు అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొనడంతో పక్కనే ఉన్న కాలువలో బోల్తా పడింది. సంఘటనలో కారు డ్రైవింగ్ చేస్తున్న నరేష్, పక్కనే ఉన్న వేణుకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీరితో పాటు ప్రయాణిస్తున్న మునితేజ, చాతుర్యకు గాయాలయ్యాయి. తేనె టౌన్‌లోని ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి, గురువారం కారుని గ్రామానికి మృతదేహాలు వస్తాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## అన్నదాత సుఖీభవ కింద రూ.213 కోట్లు పంపిణి

**జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి**



ఏలూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త: ప్రభాతవార్త: పెదపాడు మండలం అప్పనవీడు గ్రామంలో రైతన్నా... మీకోసం వర్క్ షాప్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పనవీడు రైతు సేవ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనతో రైతులకు అవగాహన కలిగించడం రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరింత విస్తీర్ణంలో ప్రకృతి సాగుచేసేలా రైతులలో అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీపై అందించడమే కాక అన్నదాత సుఖీభవ పథకం కింద రెండు విడతలలో లక్షా 60 వేల 968 మంది రైతులకు 213.31 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, జిల్లాలో 60 డ్రోన్లను రైతులకు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రైతులను ఉద్దేశించి ప్రసంగించిన కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులతో పాటు అధికారులు తిలగించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపిడిఓ, ఏడిఏ అనిల కుమారి, ఎంఏఓ షేక్ ఇమామిఖాసిమ్, ఏరువాక కేంద్రం ఏలూరు శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు, పెద్దపాడు మండల నాయకులు రవి, గుప్తా అనిల్, వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్షణ, విద్యాశాఖల రోజువారి ఆహారంలో
# రొయ్యలు, చేపలను చేర్చాలి!
### - రాజ్యసభలో ఎంపి పాక సత్యనారాయణ



భీమవరం, డిసెంబరు 3 ప్రభాతవార్త: ఆక్వా ఉత్పత్తులకు అంతర్జాతీయ ఎగుమతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో ఆత్మనిర్భర్ భారత్ పథకంలో మన రొయ్యలను స్థానిక వినియోగానికి ప్రోత్సాహం కల్పించాలి... దీనివలన ఆక్వారైతులు ఎగుమతుల సంక్షోభాలను అధిగమించటానికి వీలుంటుంది అని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ చెప్పారు. రాజ్యసభ సమావేశాలలో బుధవారం సాయంత్రం ఆక్వా రైతుల సమస్యలపై ప్రసంగించారు. ముఖ్యంగా రొయ్యలు చేపల ఎగుమతులకు ఉన్న అవరోధాలను అధిగమించడానికి ఆయన కొన్ని సూచనలు చేశారు. ప్రస్తుతం మన ఆక్వా మార్కెట్ అంతర్జాతీయంగా 75 శాతం వాటాతో గ్లోబల్ లీడర్‌గా ఉందన్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి 70శాతం వాటా ఉందన్నారు. కొంతకాలంగా మన వ్యాపారంపై అమెరికా వాణిజ్య ఆంక్షలు విధించిన నేపథ్యంలో అంతర్జాతీయంగా మన ఆక్వా ఎగుమతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో మన ఆక్వా ఉత్పత్తులకు డొమెస్టిక్ వినియోగం పెంచడం ద్వారా ఈ రైతులను ఆదుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రోజువారి ఆహారంలో ఆక్వా ఉత్పత్తుల తినడం చాలా ఆరోగ్యకరమన్నారు. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి మంచి ప్రోటీన్ అందుతుందన్నారు. రోగ నిరోధక శక్తి కూడా ఉంటుందని చెప్పారు. అందువలన ప్రధానంగా రక్షణ శాఖలో సిఆర్పిఎఫ్, బిఎస్ఎఫ్ లాంటి డిఫెన్స్ విభాగంలో ఉన్న క్యాంటీన్లకు ఈ ఆక్వా ఉత్పత్తులను చేర్చాలని, దీనికి సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే విద్య శాఖకు సంబంధించి పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకానికి, అంగన్వాడి విద్యార్థులకు పోషక ఆహారంలో భాగంగా ఆక్వా ఉత్పత్తులను అందించవచ్చు అన్నారు. ఆక్వా ఉత్పత్తుల వినియోగం వలన వారిలో ఆరోగ్య పరిస్థితిలు బాగా మెరుగు పడే అవకాశం ఉందన్నారు. కాబట్టి మన దేశ సైనికులకు, విద్యార్థులకు ఆహారంలో ఆక్వా ఉత్పత్తులను చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఈ నిర్ణయం తీసుకుంటే దేశంలోనే అత్యధిక ఆక్వా సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రైతులకు ఎంతగానో ప్రయోజనం ఉంటుందన్నారు. మరొక వైపు అంతర్జాతీయంగా ఆక్వా ఎగుమతుల సంక్షోభాన్ని కూడా ఎదుర్కోవటానికి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పాక సత్యనారాయణ వివరించారు.




## ఉద్యోగులకు, పెన్షనర్లకు హెల్త్ కార్డులపై
# మెరుగైన వైద్యం అందించాలి
### - ఎపి ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్


భీమవరం, డిసెంబరు 3 ప్రభాతవార్త: గత ప్రభుత్వంలో చట్టపరంగా ఉద్యోగులు పొందాల్సిన బకాయిలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం దశలవారీగా చెల్లించేందుకు ఏపీ ఎన్జీవో సంఘం చేపట్టిన ఆందోళన కార్యక్రమాలే కారణమని ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా సంఘం అడ్ హక్ కమిటీ ఏర్పాటు కార్యక్రమం భీమవరం త్యాగరాజ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ప్రధాన వక్తగా పాల్గొన్న విద్యాసాగర్ మాట్లాడుతూ తక్షణమే 12వ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ డిఎలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డ్స్ సరిగా వినియోగం లోకి రావటం లేదని దీని వలన ఉద్యోగ వర్గం తీవ్రంగా నష్టపోతున్నారనే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే హెల్త్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించడం శుభ పరిణామం అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను గత ప్రభుత్వం 10,280 మందికి క్రమబద్ధీకరణ చేస్తామని కేవలం 2,800 ఉద్యోగులనే క్రమబద్ధీకరణ చేసారని, మిగతా వారిని కూడా క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డ్ సచివాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పెన్షనర్లకు గత ప్రభుత్వం తొలగించిన అడిషనల్ క్వాంటామ్ ఆఫ్ పెన్షన్ తగ్గించారని దాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేసారు. ముఖ్యఅతిథి పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని సభకి హామీ ఇచ్చారు. అనంతరం పశ్చిమగోదావరి జిల్లా అడ్ హక్ కమిటీ ప్రకటించారు. చైర్మన్‌గా ఉదిసి వెంకట పాండురంగారావు, పోతన సుకుమార్ ఫైనాన్స్ మెంబర్‌గా అల్లూరి శ్రీనివాస రాజు, మెంబర్స్‌గా ఎంఆర్‌కె రాజు, దేవాబత్తుల నాగదేవి ఇంజేటి రమేష్, సుంకర వెంకటేష్‌లను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెనుమరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శులు శివప్రసాద్, రాంప్రసాద్, జెఎసి నాయకులు ఆర్ఎస్ హరనాథ్, రాష్ట్ర ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పాము శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రమణారెడ్డి, రాష్ట్ర విమెన్ వింగ్ ఉపాధ్యక్షురాలు తోట కుసుమ కుమారి పాల్గొన్నారు.



## హెచ్ఓడి టవర్ల నిర్మాణ కార్మికులకు శిక్షణ

గుంటూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజారాజధాని అమరావతిలో ఎపి సిఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హెచ్ఓడీ టవర్ల 1, 2 ప్రాజెక్ట్‌లో వర్క్ అట్ హైట్, ఫాల్ ఫ్రమ్ హైట్ రెస్క్యూ ఆపరేషన్ స్కాఫోల్డింగ్ సేఫ్టీ ట్రైనింగ్, మాక్ డ్రిల్‌ను ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సిఆర్‌డీఏ) విజయవంతంగా నిర్వహించింది. భవన నిర్మాణ పనులలో భాగంగా అత్యంత ఎత్తులో నిర్వహించే నిర్మాణ కార్యక్రమాలలో భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, కార్మికులలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. హెచ్ఓడీ టవర్ల నిర్మాణ ప్రాంగణంలో నిర్వహించిన ఈ సమగ్ర శిక్షణ కార్యక్రమాన్ని ప్రముఖ భద్రతా సంస్థ అయిన కరం సేఫ సహకారంతో, హెచ్ఓడీ టవర్లు 1, 2 నిర్మాణ కాంట్రాక్టర్ షాపూర్‌జీ పల్లోంజీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. పరంజాల మీద ఎత్తులో పనులు చేసే సందర్భాలలో అనుసరించాల్సిన భద్రతా చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే పద్ధతులపై కార్మికులకు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏపీ సిఆర్‌డీఏ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అనిత వాణి, సిఆర్‌డీఏ సీనియర్ ఓహెచ్ఎస్ అధికారి గుడివాడ గోపీకృష్ణ, సీనియర్ లేబర్ ఓహెచ్ఎస్ మేనేజర్లు బోయ శ్రీధర్‌రెడ్డి, పీజీఎంసీ ప్రతినిధులు, కాంట్రాక్టర్ సిబ్బంది, కార్మిక బృందం పాల్గొని కార్యక్రమం సాఫీగా సాగేలా సమన్వయం చేశారు.

# ఉక్కు కార్మికులు ఉక్కిరి బిక్కిరి




- ఉద్యోగాల కోత... వేతనాలపై కత్తి
- యాజమాన్యం దౌర్జన్యం... ప్రభుత్వాల నిశ్శబ్దం
- తుగ్లక్ నిర్ణయాలు... కార్మికులు ఆగ్రహం

గాజువాక, డిసెంబరు 3 ప్రభాతవార్త: విశాఖస్టీల్ ప్లాంట్‌లో కార్మికులపై అన్యాయాలు, యాజమాన్యం చేస్తున్న అడ్డదారులు మళ్లీ తీవ్రంగా చర్చనీయాంశంగా మారాయి. ఉక్కు యాజమాన్యం తీసుకుంటున్న తుగ్లక్ నిర్ణయాలతో కార్మికుల భవిష్యత్ అగమ్యగొచరంగా మారింది. ఉత్పత్తి పేరుతో వేతనాలను ముడిపెట్టడం, కార్మికుల తొలగింపులను న్యాయంగా చూపించే ప్రయత్నాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పూర్తిస్థాయి నిర్లక్ష్యం ఇవన్నీ కలిసి వేలాది కుటుంబాలను వీధి బాట పట్టిస్తున్నాయని కార్మిక సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. 64 గ్రామాలు, 26 వేల ఎకరాలు, 32 మంది ప్రాణ త్యాగం... విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడ్డ విశాఖ ఉక్కు కర్మాగారం నేడు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేయడం దారుణమని కార్మికలోకం అగ్గిమీద గుగ్గిళమవుతుంది.

ఉక్కు కర్మాగారంలో గణాంకాల ప్రకారం.. ఎమ్ఎమ్ డిపార్ట్మెంట్, మార్కెటింగ్, రోలింగ్ మిల్స్ ఎస్ఎమ్ఎస్, బ్లాస్ట్ ఫర్నేసు, సింటర్ ప్లాంట్, సీవో, సీసీపీలలో తొలుత అధికారులు, ఉద్యోగులు 18 వేల మంది ఉండే వారు. ప్రస్తుతం 9వేల 5వందల మంది ఉన్నారు. ఉద్యోగ విరమణ, స్వచంద ఉద్యోగ విరమణ చేసిన తరువాత 8 వేల 5 వందమంది ఉన్నారు. ఇక కాంట్రాక్టు కార్మికులైతే మొదట 15వేల మంది ఒప్పంద కార్మికులు ఉండేవారు. ఆ తరువాత ఉక్కు యాజమాన్యం వివిధ కారణాల చేత సుమారు 6వేల 5 వందల మందిని విధుల నుంచి తొలగించారు. తాజాగా గత సోమవారం 450 మందిని తొలగించింది. మరో 200 మందిని ఈ నెల చివరన తొలగొంచేందుకు ప్రయత్నిస్తుంది. దీంతో 7వేల నుంచి 8వేల మంది మిగిలిన పరిస్థితి. ఉత్పత్తి తగ్గిందనే పేరుతో కార్మికులపై మొత్తం భారం మోపుతూ, వ్యయాలు తగ్గించాలనే నెపంతో కార్మిక జీవితాలను పణంగా పెడుతోందని కార్మిక సంఘాల తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ఉత్పత్తి ఆధారంగా వేతనాల చెల్లింపు కార్మికులపై శిక్ష విధానమేనని, ఉత్పత్తి తగ్గితే వేతనం కూడా తగ్గాలనే తాజా విధానం పై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల నెలనెలా స్థిరత్వం లేని జీతాలు వస్తున్నాయనీ, దాంతో కుటుంబాలు తీవ్ర ఆర్థిక క్లేశాలు అనుభవిస్తున్నాయని కార్మికులు చెబుతున్నారు. ఉత్పత్తి యాజమాన్యం ప్లాన్ తప్పిదాల వల్ల తగ్గినా, శిక్ష మాత్రం కార్మికులకే ఎందుకు? అని ప్రశ్నిస్తున్నారు. సకాలంలో జీతాలు ఇవ్వకపోవడం, పనిస్థలాల్లో కనీస భద్రతా చర్యలు పాటించకపోవడం వల్ల గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అయినా యాజమాన్యం అసలు పట్టించుకోవడం లేదని యూనియన్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉత్పత్తి పేరుతో ప్రాణాలు తీసుకోవడమే యాజమాన్యం లక్ష్యం అయిపోయింది" అని వారు మండిపడుతున్నారు.

### యాజమాన్యం దౌర్జన్యం.. ప్రభుత్వాల నిశ్శబ్దం

ఉక్కు యాజమాన్యం తుగ్లక్ నిర్ణయాలతో కార్మికులు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు, ఉక్కు ప్లాంట్‌ను పునరుద్ధరిస్తామని నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పిస్తామని, కాంట్రాక్టు కార్మికులకు భరోసా ఇస్తామనిమొత్తం మీద కార్మికులకు ఉపశమనం కల్పిస్తామని ఘనంగా హామీలు ఇచ్చింది. కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే అవన్నీ మరుగున పడ్డాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాసితులు ఇప్పటికీ శాశ్వత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ఉక్కు యాజమాన్యం నిర్ణయాలపై ఎవరు నోరు మెదపటం లేదని, కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలు అవిరైపోయాయని కార్మిక సంఘాలు వాపోతున్నాయి. తొలగింపులతో వేలాది కాంట్రాక్టు కార్మికులు కుటుంబాలతో కలిసి అక్షరాలా రోడ్డున పడ్డారు. అయినా యాజమాన్యం స్పందించకపోవడమే గాక, పరిష్కారం కోసం కనీస సమావేశం కూడా ఏర్పాటు చేయకుండా ఎటూ వెళ్లని పరిస్థితిని సృష్టించిందని యూనియన్లు ఆరోపిస్తున్నాయి.

### కార్మికుల్లో ఆగ్రహం...

కార్మిక సంఘాలు పలుమార్లు కేంద్ర, రాష్ట్ర మంత్రులతో, అధికారులతో భేటీ అయ్యేందుకు ప్రయత్నించినా స్పందన ఏమీ రాలేదని నాయకులు చెబుతున్నారు. ఉక్కు కార్మికుల వేదనను అధికార యంత్రాంగం పూర్తిగా పట్టించుకోవడం లేదన్న భావన కార్మికుల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది. ఈ అన్యాయాలపై స్టీల్ ప్లాంట్ పరిసరాల్లో రోజూ నిరసనలు, రచ్చబండ కార్యక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఇకనైనా ప్రభుత్వాలు మేల్కొని ప్లాంట్ పరిస్థితిని పరిశీలించి, కార్మికులకు న్యాయం చేయాలంటూ యూనియన్లు హెచ్చరిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఉక్కు ప్లాంట్ వద్ద భారీ ఉద్యమాలకు మేము సిద్ధం అని కార్మిక నాయకులు ధ్వజమెత్తుతున్నారు.

# గ్రీవెన్స్‌లో ఫిర్యాదులపై సత్వరమే చర్యలుండాలి

- అర్థరహితంగా పరిష్కరించరాదు
- గ్రీవెన్స్‌పై సిఎం ప్రత్యేక దృష్టి పెట్టారు
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం, డిసెంబరు 3 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సమస్యల పరిష్కార వేదికని సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పి ప్రజల్ని కోరడం జరిగిందని, దాని మీద ప్రజలు పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వివిధ స్థాయిల్లో అర్జీలు, దరఖాస్తులు ఇవ్వడం జరుగుతోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. ఫిర్యాదులపై నిర్ణీతకాలంలో స్పందించిన అధికారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడవు అని ఆయన అన్నారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారాలకు సంబంధించి అనంతపురం లోని జిల్లా కలెక్టరేట్లో బుధవారం మంత్రి జిల్లా అధికారులతో కలెక్టర్ ఆనంద్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఇప్పటివరకు పిజిఆర్ఎస్ ద్వారా దాదాపు 50,000 పైగా అర్జీలు రావడం జరిగిందని, అందులో 35,000 దాకా ఇప్పటికీ పరిష్కారం చేశామన్నారు. ఈ వ్యవస్థలో ఇంకా ఇంప్రూవ్ చేయాల్సింది చాలా ఉందని, కొన్ని పరిష్కారం అయినవి, పరిష్కారం కానటువంటివి కూడా అయినట్టుగా చూపించడం లాంటివి జరుగుతా ఉంటే, ముఖ్యమంత్రి మూడు అంచెల వ్యవస్థని, నాలుగు అంచెల వ్యవస్థని ఏర్పాటు చేద్దాం అనే దానిపై ఇప్పటికీ చెక్ పెట్టారన్నారు. ఏదైనా ఒక అధికారి, తనకు వచ్చినటువంటి ఫిర్యాదుని పరిష్కరించబడిందని కారణాలు చెప్పి క్లోజ్ చేస్తే, జిల్లాలో ఉన్నటువంటి ప్రీ ఆడిట్ టీం దగ్గర నుంచి, కాల్ సెంటర్ దగ్గర నుంచి ప్రతి ఫిర్యాదు మీద ఫిర్యాదుదారుడికి ఫోన్ వెళ్తుందని, ఆ సమస్య పరిష్కారం చేయబడిందా లేదా అనేటువంటిది కనుక్కోవడం జరుగుతుందని, ఆ సమస్య పరిష్కారం చేయబడలేదని అంటే, దాన్ని తిరిగి అదే పరిష్కారాన్ని ఓపెన్ చేసి ఆ అధికారికి కూడా దాన్ని ఫార్వర్డ్ చేయడం జరుగుతుందన్నారు. అర్థరహితంగా పరిష్కరించిన అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నా కూడా, ఒకేసారి ఇట్లా చేయడం కన్నా ఒకటికి రెండుసార్లు చెప్పి పని చేయించాలనేటువంటి ఉద్దేశంతో దాని మీద ఒత్తిడి పెట్టి డ్రైవ్ చేయడం జరుగుతోందన్నారు. ఈరోజు సమీక్ష చేసినప్పుడు కొన్ని లోపాలు కూడా గుర్తించామన్నారు. ఒక స్థాయిలో ఇచ్చిన అర్జీ, అతని స్థాయి ఉన్నంత మేరకు పరిష్కారం చేసి అతను క్లోజ్ చేసినప్పుడు సమస్య పరిష్కారం కాలేదు కానీ అతని బాధ్యత తీరిపోయిందని చెబుతున్నారన్నారు. మనకున్నటువంటి సాఫ్ట్వేర్ లో ఇప్పటిదాకా దాన్ని అక్కడికే క్లోజర్ చూపించి, మీరు పై అధికారిని కలవండి అని చెప్పేసే వారని, అలా కాకుండా మార్పులు చేయాలని చెప్పామన్నారు. ఒక ఫిర్యాదుదారుడికి ఖచ్చితంగా ఒక రెస్పాన్సిబుల్ పర్సన్ ఇప్పుడు ఫిక్స్ అవుతాడన్నారు. సాధ్యమైనంత మేరకు సమస్యను పరిష్కారం చేయాలన్నారు. ఎక్కువగా సమస్యలు రెవెన్యూ, పోలీస్ మీద వస్తున్నాయని, 50 శాతం దాకా ఈ రెండు వ్యవస్థల్లోనూ అర్జీలు వస్తున్నాయని, మరింత లోతుగా అవగాహన చేసుకోవడం కోసం సమీక్ష నిర్వహించామని, దీనిపై జిల్లా కలెక్టర్ ని సమీక్ష చేయమని చెప్పామని, మేము కూడా ఎప్పుడు అవకాశం కుదిరితే అప్పుడు దాని మీద రివ్యూలు చేసి, గ్రీవెన్స్ పరిష్కారాన్ని పెంచాలను కుంటున్నామన్నారు. గ్రీవెన్స్ పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని, వాటి పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో టాప్ ప్రయారిటీ గ్రీవెన్స్ రెడ్రెసల్ మెకానిజం మీద కూడా దృష్టి పెట్టడం జరుగుతుందని, ప్రతి అర్జీని కూడా ప్రత్యేక అర్జీగానే భావించి ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం బాధ్యతతో, చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రభుత్వంపై నమ్మకంతోనే అర్జీలు వస్తున్నాయని, ప్రతి అర్జీకి పరిష్కారం చూపించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## బాపట్ల - మార్కాపురం రైల్వే లైన్
# సర్వే పూర్తి చేయండి
### కేంద్ర రైల్వే మంత్రికి ఎంపి కృష్ణప్రసాద్ వినతి



విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: బాపట్ల పార్లమెంట్ సభ్యులు, ప్యానల్ తెన్నేటి కృష్ణప్రసాద్ బుధవారం కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కి వినతి పత్రం సమర్పించారు. బాపట్ల–మార్కాపురం మధ్య కొత్త బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి సాధ్యతా అధ్యయనం, తుది స్థానం సర్వే ను తక్షణమే చేయాలని ఆయన కోరారు. ఈ ప్రతిపాదిత రైల్వే లైన్ బాపట్ల, పర్చూరు, అద్దంకి, సంతనూతలపాడు మీదుగా మార్కాపురం వరకు పయనిస్తుంది. ఇది బాపట్ల మరియు ప్రకాశం జిల్లాల ప్రజల చిరకాల ఆకాంక్ష అని ఎంపి పేర్కొన్నారు. అనేక గ్రామీణ మరియు సెమీఅర్బన్ ప్రాంతాలలో ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, కార్మికులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది, ఈ ప్రాంతం వరి, మిరప, పత్తి, పొగాకు పంటలకు ప్రధాన కేంద్రం. అద్దంకి పరిసరాలలో సమృద్ధిగా ఉన్న సున్నపురాయి, ఎగుమతిస్థాయి గ్రానైట్ నిక్షేపాల భారీ రవాణాకు రైలు మార్గం ఎంతగానో దోహదపడుతుంది, రవాణా ఖర్చులను తగ్గిస్తుంది. అలాగే, తూర్పు తీరానికి, మార్కాపూర్, నంద్యాల, కర్ణాటకకు మధ్య సరుకు రవాణా కోసం ఇది సమర్థవంతమైన మార్గాన్ని సృష్టిస్తుంది. ఈ ప్రాజెక్టు ఖర్చు ప్రయోజన దృక్పథం అత్యంత అనుకూలంగా ఉందని పేర్కొంటూ, ప్రజల దీర్ఘకాలిక డిమాండ్‌ను నెరవేర్చడానికి మంత్రిత్వ శాఖ తక్షణమే స్పందించాలని తెన్నేటి కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారు.



# సిఎం దృష్టికి జిల్లాల పునర్విభజన అభ్యంతరాలు
### - రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు, డిసెంబరు 3 ప్రభాతవార్త-వైద్యం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమ్మిళతం చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రధాన లక్ష్యంగా ఈనెలలో పెద్ద ఎత్తున ప్రభుత్వ కార్యక్రమాలు చేపడుతున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు ప్రభుత్వ కార్యక్రమాలపై ఎమ్మెల్సీ బీద రవిచంద్రతో కలిసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ 4న అన్ని నియోజకవర్గాల్లో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాల ప్రారంభోత్సవం, ఈ నెల 5న మెగా పేటీఎం కార్యక్రమాలను పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులకు ప్రభుత్వం తోడుగా ఉంటుందనే భరోసా కల్పించేందుకు రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అందిస్తూ వారికి అన్ని విధాల ప్రభుత్వం అండగా ఉందన్నారు.

### సిఎం దృష్టికి జిల్లా పునర్విభజన సమస్యలు

జిల్లాల పునర్విభజనపై అభ్యంతరాలు తెలిపేందుకు 30 రోజుల గడువును ప్రభుత్వం ప్రకటించిందని, ఈ లోగా ప్రజలు, ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలను, సలహాలను మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్తామని, అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించిన తదుపరి సిఎం చంద్రబాబునాయుడు తది నిర్ణయం ప్రకటిస్తారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, బొల్లినేని గిరినాయుడు, కేశవ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## మొగలిచెర్ల దత్త మందిరంలో
# దత్తాత్రేయుని ఊంజల్‌సేవ

తిరుపతి, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: అవధూత దత్తాత్రేయస్వామి మందిరంలో దాత సహకారంతో అందించిన ఊయలలో ఆలయ నిర్వాహకులు స్వామివారి ఊంజల్‌సేవ నిర్వహించే అవకాశం లభించింది. నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం మొగలిచెర్ల గ్రామంలో వెలసిన దత్తాత్రేయ మందిరంకు నెల్లూరుకు చెందిన దాత కంఠం పద్మనాభరావు కుటుంబసభ్యులు బంగారువర్ణ త్రిడి డిజైన్‌తో త్రిమూర్తి దత్తాత్రేయుని అవతారంతో రూపొందించబడిన ఊయలను ఆలయానికి విరాళంగా అందించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకంగా స్వామివారికి నేడు ఉదయం ఈ ఊయలసేవ నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, నిర్వాహక ప్రతినిధి పవని విష్ణుకౌశిక్ తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివారి సేవలో తరించాలని కోరారు.



దాతలకు దుర్గమ్మవారిచిత్రపటం అందిస్తున్న దృశ్యం

# నేడు కలశజ్యోతి ఉత్సవం

ఇంద్రకీలాద్రి, డిసెంబరు 3 ప్రభాతవార్త: శ్రీ గంగా భవానీ సమేత దుర్గామల్లేశ్వరస్వామి వార్లు నగర వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. గురువారం మార్గశిరమాసం పూర్ణిమ పర్వదినాన జరగబోయే కలశజ్యోతి ఉత్సవంలో సత్యనారాయణపురంలోని శ్రీ శృంగేరీ పీఠపరిపాలిత శ్రీ శివరామకృష్ణ క్షేత్రం నుండి బయల్దేరి నగరవీధుల గుండా విహరిస్తూ దుర్గమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. ఈ ఉత్సవంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

### నేడు గిరి ప్రదక్షణ

పౌర్ణమి పర్వదినాన ఉదయం 5.55లకు ఘాట్‌రోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ కామధేను మాత ఆలయం వద్ద నుండి బయల్దేరి శ్రీ స్వామి అమ్మవార్ల గిరి ప్రదక్షణ గురువారం నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

### నిత్యాన్నదాన పథకానికి విరాళం

దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116ల విరాళాన్ని విజయవాడకు చెందిన సతీష్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి బుధవారం అందించారు. విజయవాడకు చెందిన మరో దాత కనపర్తి వెంకట రవిరాజ తమ కుటుంబసభ్యులతో కలిసి రూ.1,00,116ల విరాళం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రాలందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

## కూటమి ప్రభుత్వంలో
# మహిళలకు ప్రాధాన్యత
### డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత

విజయవాడ, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మహిళా సంక్షేమం, సాధికారతలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచిందని డ్వాక్రా సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు ఆచంట సునీత అన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎప్పుడూ మహిళల అభివృద్ధినే రాష్ట్ర అభివృద్ధిగా భావిస్తారని, ఆ దిశగా సూపర్ సిక్స్ హామీలను ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తూ సూపర్ హిట్ చేశారని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళల పొదుపు నిధులను కూడా దోచుకుందని, వారిని కేవలం రాజకీయ కార్యకర్తలుగానే వాడుకుందని ఆరోపించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పావలా వడ్డీ రుణాలను రూ.5 లక్షలకు పెంచడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రూ.2-5 లక్షల వరకు వడ్డీ రహిత రుణాలు అందిస్తోందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా చిరు వ్యాపారస్తులు, విద్యార్థినులు నెలకు రూ.1,500 నుంచి రూ.3,000 వరకు ఆదా చేసుకుంటున్నారని, ఇది మహిళలకు ఎంతటి ఊరట కలిగించిందో ప్రతి మహిళా నోట వినిపిస్తోందని అన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ సహాయం అందేలా 67 లక్షల మంది తల్లుల ఖాతాల్లో నగదు జమ చేశామని, ఇది దేశంలోనే అరుదైన కార్యక్రమమని పేర్కొన్నారు.

# గాయపడిన ఏనుగు మృతి

తిరుపతి, డిసెంబరు 3 ప్రభాతవార్త ప్రతినిధి: చిత్తూరు జిల్లా యాదమరి సమీపంలో చెరువులో కూరుకుపోయి రక్షించిన ఏనుగు తిరుపతి ఎస్వీ జూలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. రెండురోజుల క్రిందట ఏనుగు యాదమరి పరదరామి రిజర్వు ఫారెస్ట్‌లోని గుడ్డివానిచెరువులో దిగి బురదలో కూరుకుపోయి తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారంతో అటవీశాఖ అధికారులు తిరుపతి జూపార్కు సిబ్బందితో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి మత్తుమందుతో జూకు తరలించారు. రెండురోజులుగా జూలో చికిత్స తీసుకుంటున్న ఏనుగు క్రమంగా ఆహారం తీసుకోలేకపోవడంతో ద్రవాలను పంపి పశువైద్య అధికారులు చికిత్స చేశారు. బుధవారం సాయంత్రం మృతి చెందడంతో ఎస్వీ పశువైద్య కళాశాల వైద్యులు, జూ వైద్యులు పోస్టుమార్టమ్ నిర్వహించి అనంతరం ఖననం చేశారు.

04-12pg10 12 VJA_04-12pg10.qxd 03/Dec/25 10:11 PM Page 1






### వింటర్ నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో

# విద్య, కల్పనకు టైటిల్స్

**న్యూఢిల్లీ:** వింటర్ నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్-2025లో విద్యా పటేల్-కల్పన గుర్జర్ మహిళల జంట టైటిల్‌ను గెలుచుకున్నారు. 67వ అశోక్ రుయా మెమోరియల్ వింటర్ నేషనల్ బ్రిడ్జ్ ఛాంపియన్‌షిప్‌లో రెండో రోజు మధ్యప్రదేశ్‌లోని రాయ్‌బిద్‌పురా గ్రామానికి చెందిన విద్యా-కల్పనా జంట ఆమ్లా రుయా ఉమెన్ పెయిర్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఈ సంవత్సరం ప్రారంభంలో చెన్నైలో జరిగిన జాతీయ మహిళా పెయిర్స్ ఈవెంట్‌ను గెలుచుకున్న విద్యా-కల్పన 57.42 అంతర్జాతీయ మ్యాచ్ పాయింట్లు సాధించారు. రేఖా మోడీ-వందన టూస్లిదాస్ 56 ఐఎంపీలను సేకరించి రన్నరప్ స్థానంతో, సంగీత మోహ్తా-బర్షా ఖత్రీ 26.89 ఐఎంపీలు సేకరించి 3వ స్థానంలో నిలిచారు. క్వాలిఫైయింగ్ రౌండ్ల ముగింపులో మొదటి, రెండవ స్థానాలను కైవసం చేసుకున్న కామ్నా శర్మ రిచా శ్రీరామ్-వసంతి షా భారతి డే అంచనాలను అందుకోలేకపోయారు. తదుపరి చివరి రౌండ్ ముగింపులో వరుసగా 3 ఐఎంపీలు, 16.68 ఐఎంపీలతో 6వ మరియు 5వ స్థానాల్లో నిలిచారు.



# రోహిత్‌కు దగ్గరగా కోహ్లీ

## 32 రేటింగ్ పాయింట్ల దూరం

**న్యూఢిల్లీ:** ఐసిసి ర్యాంకింగ్స్ 83వ అంతర్జాతీయ సెంచరీ సాధించి వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచేందుకు భారత దిగ్గజం విరాట్ కోహ్లీ ఉవ్విళూరుతున్నాడు. తద్వారా తన సహచరుడు రోహిత్ శర్మను అధిగమించేందుకు దగ్గరవుతున్నాడు. ఇందుకు రోహిత్‌కు కేవలం 32 రేటింగ్ పాయింట్ల దూరంలో ఉన్నాడు. బుధవారం విడుదలైన వరల్డ్ ర్యాంకింగ్స్‌లో ఈ విషయం వెల్లడైంది. దక్షి ణాఫ్రికాతో రాంచీలో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ తొలి వన్డేలో, 37 ఏళ్ల కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేశాడు. అతని ప్రదర్శన అతన్ని ఒక స్థానానికి ఎగబాకి నాల్గవ స్థానంలో ఉన్నాడు. ప్రస్తుతం కోహ్లీ రేటింగ్ 751 పాయింట్లకు చేరుకుంది. గత దశాబ్దం చివరి నాటికి కోహ్లీ మూడు సంవత్సరాలకు పైగా అగ్రస్థానంలో ఉన్నాడు, కానీ 2021 ఏప్రిల్‌లో పాకిస్తాన్‌కు చెందిన బాబర్ అజామ్ అతన్ని అధిగమించినప్పటి నుండి అతను అగ్రస్థానాన్ని నిలబెట్టుకోలేదు. ఇంతలో, రోహిత్ అగ్రస్థానంలో తన ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన రెండవ స్థానంలో ఉన్న డారిల్ మిచెల్ మరియు 3వ స్థానంలో ఉన్న ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రహీం జాద్రాన్‌లను అధిగమించాడు. అయితే కోహ్లీ తన సహచరుడు శుభ్‌మాన్ గిల్‌ను అధిగమించి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక వన్డే బౌలర్లలో ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఒక స్థానం ఎగబాకి ఆరో స్థానంలో నిలిచాడు. ఇంతలో, ఇటీవల పాకిస్తాన్‌లో జరిగిన ట్రైసిరీస్ తర్వాత టి20 ఆల్ రౌండర్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం మరోసారి మారిపోయింది. ఫైనల్లో శ్రీలంకపై 6 వికెట్ల తేడాతో విజయం సాధించి పాకిస్తాన్ ముక్కోణపు సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఓపెనర్ సైమ్ అయూబ్ ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో తన అగ్రస్థానాన్ని తిరిగి పొందాడు. ముక్కోణపు సిరీస్‌లో పాకిస్తాన్ విజయంతో సహచరులు అబ్రార్ అహ్మద్ (4 స్థానానికి) మరియు మహ్మద్ నవాజ్ (2 స్థానాలు ఎగబాకి 11వ స్థానానికి) బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపరుచుకున్నాడు. ముక్కోణపు సిరీస్‌లో కమిల్ మిషారా ప్రదర్శన శ్రీలంకకు మరింత బలానిచ్చింది. ఈ మ్యాచ్‌లో అతను నాలుగు ఇన్నింగ్స్‌లలో 169 పరుగులు చేయడంతో టెస్ట్ ఆల్ రౌండర్ల ర్యాంకింగ్స్‌లో జాన్సెన్ నాలుగు

### మహిళా ఫుట్‌బాల్‌లో భారత్

# అజేయ విజయ పరంపర

## ఉజ్బెకిస్థాన్‌పై 4-2 తేడాతో విక్టరీ

**న్యూఢిల్లీ:** భారత అండర్20 మహిళా ఫుట్‌బాల్ జట్టు తన అజేయ విజయ పరంపరను కొనసాగిస్తూ 9 ఆటలకు విస్తరింప చేసింది. మహాబలిపురంలో జరిగిన 2 మ్యాచ్‌ల సిరీస్‌లో భారత అండర్ 20 మహిళా ఫుట్‌బాల్ జట్టు ఉజ్బెకిస్తాన్‌పై వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఈ సంవత్సరం ఆ జట్టు తమ మంచి ఫామ్‌ను కొనసాగించి ఉజ్బెక్స్‌పై 4-2 తేడాతో ఆధిపత్య విజయాన్ని సాధించింది. అంతేకాకుండా చారిత్రాత్మక ఆసియా కప్ క్వాలిఫైయర్‌లతో సహా 9 ఆటలకు వారి అజేయ విజయాన్ని విస్తరించింది. గత మ్యాచ్ కంటే భారత్ తన గోల్ స్కోరింగ్ సామర్థ్యాన్ని మెరుగుపరుచుకుంది. ఆ మ్యాచ్‌లో ఒకే ఒక్క గోల్ తేడాతో అదే ప్రత్యర్థులను అధిగమించింది. ఇక గత నెలలో యంగ్ టైగ్రెస్సెస్ కజకిస్తాన్ అండర్ 19 తో షిమ్కెంట్‌లో రెండు మ్యాచ్‌లు ఆడింది, 3-2 తేడాతో గెలిచి 1-1తో డ్రాగా ముగిసింది. మొత్తం మీద, ఈ సంవత్సరం భారత్ మహిళా జట్టు 12 ఆటలు ఆడింది. ఫిబ్రవరిలో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న రష్యాతో జరిగిన మ్యాచ్‌లో 8 విజయాలు, 3 డ్రాలు, ఒకే ఒక ఓటమితో ఘన విజయం సాధించింది. ఫలితంగా రెండు దశాబ్దాల తర్వాత మహిళల అండర్ 20 ఆసియా కప్‌కు చారిత్రాత్మక అర్హత సాధించింది. ఇదే గ్రూప్‌లో జపాన్, ఆస్ట్రేలియా మరియు చైనీస్ తైపీ వంటి జట్లు ఉన్నాయి. కాగా ఆసియా కప్ 2026 ఏప్రిల్ 1-18 వరకు థాయిలాండ్‌లో జరుగుతుంది.



### ప్రతీకారం తీర్చుకున్న

# న్యూజిలాండ్

## 167కే కుప్పకూలిన వెస్టిండీస్

**న్యూఢిల్లీ:** న్యూజిలాండ్, వెస్టిండీస్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. తొలుత విండీస్ బౌలర్లు రెచ్చిపోయి 231 పరుగులకే కట్టడి చేయగా, ఆ తర్వాత కివీస్ బౌలర్లు విండీస్‌ను 167 పరుగులకే కుప్పకూల్చి ప్రతీకారం తీర్చుకున్నారు. బుధవారం క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్‌లో వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండో రోజు న్యూజిలాండ్ జట్టుపై మీడియాం పేసర్ జాకబ్ డఫీ టెస్టుల్లో తొలిసారి 5 వికెట్లు పడగొట్టాడు. అతను 34 పరుగులకు ఐదు వికెట్లు పడగొట్టడం, మాట్ హెన్రీ మూడు వికెట్లు తీయడంతో న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 231 పరుగలకు సమాధానంగా వెస్టిండీస్ స్వల్ప స్కోరుకు ఆలౌట్ అయింది. తేజ్‌నరైన్ చంద్రపాల్ (52), షాయ్ హోప్ (56) అర్ధ సెంచరీలతో రాణించడంతో వెస్టిండీస్ ఈ మాత్రం స్కోరు అయినా చేయగలిగింది. వీరు కాకుండా ఇమ్లాచ్ (14), రోచ్ (10 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగలిగారు. వెస్టిండీస్ ఇన్నింగ్స్‌లో ఏకంగా నలుగురు ఖాతా కూడా తెరవలేకపోయారు. అంతకు ముందు విండీస్ బౌలర్లు తలో చేయి వేసి కివీస్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేశారు. కేన్ విలియమ్సన్ (52), బ్రేస్ వెల్ (47) ఓ మోస్తరుగా రాణించడంతో ఆ జట్టు ఒక మోస్తరు స్కోరు చేసింది. ఇక ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసి ఆధిక్యాన్ని 96 పరుగులకు పెంచుకుంది.





# ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌లో ఆశిష్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్-2025లో ఆశిష్ లిమాయే స్వర్ణంతో మెరిశాడు. థాయిలాండ్‌లో జరిగిన ఈ ఈవెంట్‌లో భారతదేశం తరపున మొట్టమొదటి బంగారు పతకాన్ని గెలుచుకోవడం ద్వారా ఆశిష్ లిమాయే బుధవారం పట్టాయాలో చరిత్ర సృష్టించాడు. మూడు రోజుల పాటు జరిగిన ఈవెంటింగ్ పోటీలో మొత్తం 29.4 స్కోరుతో అతను అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. 1982 ఆసియా క్రీడల తర్వాత వ్యక్తిగత ఖండాంతర స్వర్ణం గెలుచుకున్న తొలి భారతీయుడు అయ్యాడు. అలాగే ఆశిష్, శశాంక్ కనుమురి, శశాంక్ కటారియాలతో కూడిన భారత జట్టు 121.8 స్కోరుతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. థాయిలాండ్ (117.6) కంటే కొంచెం వెనుకబడి ఉంది. తన గుర్రమైన విల్లీ బీ డన్‌పై స్వారీ చేస్తూ, ఆశిష్ డ్రెస్సేజ్ రౌండ్ తర్వాత మూడవ స్థానంలో నిలిచాడు. ఆసియా క్రీడల స్వర్ణం, రజత పతక విజేతలు హువా టియాన్ (చైనా) మరియు కొర్‌ంటావత్ సమ్రాన్ (థాయిలాండ్) కంటే వెనుకబడి ఉన్నాడు. అయితే అతను క్రాస్‌కంట్రీ మరియు జంపింగ్ దశల్లో అద్భుతమైన పునరాగమనాన్ని ప్రదర్శించాడు. ఎటువంటి సమయ పెనాల్టీలు లేకుండా దోషరహిత రౌండ్లను సృష్టించాడు. ఈవెంటింగ్‌లో ఈ రెండు పతకాలతో పాటు, డ్రెస్సేజ్ ఈవెంట్‌ల నుండి మూడు పతకాలతో భారత్ ఇప్పుడు ఆసియా ఈక్వెస్ట్రియన్ ఛాంపియన్‌షిప్‌లో 5 పతకాలు (ఒక స్వర్ణం మరియు నాలుగు రజతాలు)తో అత్యుత్తమ సంఖ్యను సాధించింది.

# పసిడితోపాటే వెండి ధరలు పరుగులు!



**ముంబయి, డిసెంబరు 3:** బంగారంతో పాటే ఇపుడు వెండికూడా మరింత ప్రియం అవుతోంది. దేశీయంగా కిలో వెండి ధరలు రూ.1.84 లక్షలుగా కొనసాగుతోంది. పసిడి కూడా పది గ్రాముల విలువ రూ.1.30 లక్షలకు పైగానే ఉంది. అంతర్జాతీయ మార్కెట్లలో ధరపెరగడానికి తోడు రూపాయి విలువలు క్షీణించడం కూడా ఈ విలువైన లోహాల ధరలు పెరగడానికి కారణం అని ఆర్థికవేత్తలు, బులియన్ నిపుణులు చెపుతున్నారు. ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2026 ఫిబ్రవరి కాంట్రాక్టు 10 గ్రాములధర రూ.1.30 లక్షలుగా పలుకుతోంది. అలాగే ఎంసిఎక్స్‌లోమార్చి డెలివరీవెండి అత్యధికంగా రూ.3126 పెరిగి రూ.1,84,727 వద్ద ఆల్‌టైమ్ గరిష్టానికి చేరింది. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువలు రూ.90 మార్కు దాటింది. దీనితో దేశీయంగా ధరలు పెరిగాయి. ఫెడ్‌రిజర్వు వడ్డీరేట్లు తగ్గిస్తుందన్న అంచనాలుకూడా అంతర్జాతీయ మార్కెట్‌లోను, ఫ్యూచర్ మార్కెట్‌లోనూ ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్‌లో స్పాట్ రేట్ ఔన్స్ విలువలు 4204 డాలర్లవద్దట్రేడ్ అవుతోంది.

వెండి ఔన్స్ ఒక్కింటికి 57.90 డాలర్లవద్ద కొనసాగుతోంది. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి రూ.1.32 లక్షలు పలుకుతుండగా కిలో వెండి రూ.1.83 లక్షలుగా ఉంది.రానున్న రోజుల్లో వెండి కిలో ధరలు రూ.2 లక్షలు దాటేస్తుందన్న అంచనాలు కూడా జోరందుకున్నాయి. సౌరవిద్యుత్ పలకాల్లోను, పూజాసామగ్రి, దేవుళ్ల బొమ్మలు, సంపన్నుల ఇళ్లల్లో పళ్లాలు, గ్లాసులు వెండివే కొనుగోలుచేస్తుంటారు. అలాగే పారిశ్రామికంగా వెండి వినియోగం కూడా పెరగడంతో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కాగా బుధవారం బంగారంధరలు తులం ధరలు రూ.710 పెరిగితే కిలో వెండిధరలు రూ.3వేలు పెరిగింది.

# నాలుగోరోజూ నష్టాల్లోనే సూచీలు

## రూపాయి పతనం.. ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణే కీలకం



**ముంబయి, డిసెంబరు 3:** స్టాక్ మార్కెట్లలో కీలక ఈక్విటీసూచీలు నాలుగోరోజు కూడా నష్టాలపాలయ్యాయి. ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపించడం, ఆర్‌బిఐ పాలసీ నిర్ణయాలు, డాలర్ రూపాయి మారకం విలువలు క్షీణించడం, విదేశీఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణ వంటివి మార్కెట్లకు నష్టాలు తెచ్చిపోట్టాయి. నిఫ్టీ 26 వేల దిగువన ముగిసింది. పిఎస్‌యు బ్యాంకుషేర్లలో భారీ పతనం కనిపించింది. ప్రభుత్వానికి ఎఫ్‌డిఐ పరిమితి పెంచే ఉద్దేశ్యం లేదన్న సమాచారం బ్యాంకుషేర్లకు నష్టాలు తెచ్చింది. వినియోగరంగం, ఆటో మొబైల్ స్టాక్స్ కొంతమేర పర్వాలేదనిపించాయి.ఐటిషేర్లు ఒత్తిడితో కొనసాగాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 31.46 పాయింట్ల నష్టంతో 85,106.81వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 46.20 పాయింట్లు క్షీణించి 25,986వద్ద ముగిసింది. మూడు సెషన్లలోను సెన్సెక్స్ 0.72శాతం క్షీణిస్తే నిఫ్టీ 0.88శాతం క్షీణించింది. ఆదాని ఎంటర్‌ప్రైజెస్ 2.26శాతం, మహీంద్ర 1.79శాతం, ఎస్‌బిఐ 1.69శాతం చొప్పున క్షీణించాయి. ఇక బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 0.95శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 0.43శాతం చొప్పున ముగిసాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 1481 కంపెనీల షేర్లు పెరిగితే 2681షేర్లు క్షీణించాయి. మొత్తంగా 159 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు ఒకేసారి 90కి చేరుకుంది. విదేశీ ఇన్వెస్టర్ల విత్‌డ్రాలే ఇందుకు కీలకం అయింది. ఇక స్టాక్స్‌పరంగా పిఎస్‌యు బ్యాంక్‌సూచీ 3.07శాతం దిగజారింది. అలాగే ఏంజెల్ వన్ 5.21శాతం క్షీణించింది. బజాజ్‌ఫైనాన్స్ కూడా 0.50శాతం దిగజారింది. ఐఆర్‌ఎఫ్‌సి కూడా 1.42శాతం పతనం అయ్యాయి. ఇక మహీంద్ర లైఫ్ స్పేస్ డెవలపర్స్ 0.25శాతంగా ఉంది.క్వాలిటీ పవర్ ఎక్విప్‌మెంట్ 2.65శాతం పెరిగితే గుజరాత్ పిపావావ్ పోర్టు 1.40శాతం పెరిగింది. ఇక మోయిల్ కూడా 0.40శాతం పెరిగినట్లు తేలింది.




# ఆల్‌టైమ్ కనిష్టానికి భారత్ రూపాయి

**ముంబయి, డిసెంబరు 3:**అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత్ రూపాయి మారకం విలువ చారిత్రాత్మక కనిష్ట స్థాయికి పడిపోయింది. ఎఫ్‌ఐఐ అమ్మకాలు, డాలర్‌కు కొనుగోళ్ల మద్దతు వంటి కారణాల వల్ల రూపాయి పతనం అవుతోందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. అమెరికా భారత్‌లమధ్య జరుగుతున్న వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన, విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ వంటివి రూపాయల క్షీణతకు కారణం అయింది.

బుధవారం నాటి ఫారెక్స్ ట్రేడింగ్‌లో రూపాయి విలువ తొలిసారిగా 90 మార్క్‌ను దాటి సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టాన్ని నమోదు చేసింది. ముందురోజు 89.96 వద్ద స్థిరపడిన రూపాయి, బుధవారం ఉదయం సెషన్ ప్రారంభంనుంచే బలహీనంగా కదలాడింది. భారత కరెన్సీ రూపాయి కొద్దికాలంగా తీవ్రంగా పతనమవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సిఇఎ) వి. అనంత నాగేశ్వరన్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వచ్చే ఏడాది పరిస్థితి మెరుగు పడుతుందని దీనివల్ల ద్రవ్యోల్బణం లేదా ఎగుమతులపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

# ఈనెలాఖరు వరకే ఐటి రిటర్నులకు గడువు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేసే పన్ను చెల్లింపుదారులకు ఐటిశాఖ చివరిఛాన్స్ ఇచ్చింది. ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించి మీరు రివైజ్డ్ లేదా ఆలస్యపు రిటర్న్‌లను ఫైల్ చేసేందుకు గడువు తేదీ డిసెంబరు 31తో ముగియనుంది. ఈ గడువును దాటకముందే పన్ను చెల్లింపుదారులు తమ బాధ్యతలను పూర్తి చేసుకోవాలని ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది. గడువులోపు పూర్తి చేయని వారికి ఐటీ శాఖ నుంచి నోటీసులు వస్తాయి. పన్ను బకాయిలు ఉంటే భారీగా పెనాల్టీలతో పాటు కొన్నిసార్లు జైలుకు సైతం వెళ్లాల్సి రావచ్చని హెచ్చరించింది. సాధారణంగా ఆర్థిక సంవత్సరం 2024-25కు సంబంధించిన ఐటీఆర్ ఫైలింగ్ గడువు రెండుసార్లు పొడిగించారు. సెప్టెంబర్ 16వ తేదీతో ఈ గడువు ముగిసింది. అయితే, ఆ రిటర్నులలో ఏవైనా పొరపాట్లు జరిగాయని గుర్తించినట్లయితే పన్ను చెల్లింపుదారులు సెక్షన్ 139(5) కింద డిసెంబర్ 31 వరకు రివైజ్డ్ రిటర్న్‌లు దాఖలు చేయవచ్చు. ఏదైనా ముఖ్యమైన సమాచారాన్ని చేర్చడం మరచిపోయినా లేదా పొరపాటు చేసినా ఆ తప్పును సరిదిద్దుకోవడానికి రివైజ్డ్ ట్యాక్స్ రిటర్న్‌ను ఫైల్ చేయవచ్చు. ఈ పొరపాటు అనుకోకుండా జరిగిన తప్పిదం కావచ్చు. సెక్షన్ 139(1) కింద నిర్దేశించిన అసలు గడువు తేదీ ముగిసిన తర్వాత దాఖలు చేసే రిటర్న్‌ను ఆలస్యపు రిటర్న్ అంటారు. మీరు ఏదైనా ఆదాయాన్ని వెల్లడించకపోయినా లేదా పన్ను రిఫండ్‌ను క్లెయిమ్ చేయాల్సి ఉన్నా, ఆలస్యపు ఐటిఆర్‌ను డిసెంబర్ 31 లోపు ఫైల్ చేయవచ్చు. డిసెంబర్ 31వ తేదీ తర్వాత, పన్ను చెల్లింపుదారులు ఏవైనా ఆదాయపు పన్ను రిఫండ్‌లను క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉండదు. ఆలస్యంగా రిటర్న్ దాఖలు చేసినందుకు పన్ను చెల్లింపుదారుల నుంచి లేట్ ఫైలింగ్ ఫీజు, వడ్డీ కూడా వసూలు చేస్తారు. ఐటీఆర్ ఫైల్ చేయని వారికి ఐటీ శాఖ నోటీసులు పంపిస్తుంది. తప్పుడు టిడిఎస్ క్లెయిమ్ లేదా ఆదాయాన్ని తక్కువగా చూపడం వంటి లోపాలు ఉన్నప్పుడు కూడా పన్ను చెల్లింపుదారులు ఆలస్యంగా లేదా సవరించిన రిటర్న్‌ను దాఖలు చేయవలసి వస్తుంది. కాబట్టి, పన్ను చెల్లింపుదారులు డిసెంబరు 31, 2025 గడువును దృష్టిలో ఉంచుకుని, తమ ఆర్థిక బాధ్యతలను సకాలంలో పూర్తి చేసుకోవడం తప్పనిసరి.




# ప్రైవేటు క్యాబ్‌లకు దీటుగా 'భారత్ ట్యాక్సీ'!




**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** దేశంలోని రెండు ప్రధాననగరాల్లో కొత్త ట్యాక్సీ పరుగులు పెట్టేందుకు సిద్ధం అవుతోంది. క్యాబ్‌డ్రైవర్లకు యాజమాన్య హక్కులు కల్పించే లక్ష్యంతో భారత్ ట్యాక్సీ రూపుదిద్దుకున్నది. ఓలా, ఊబర్ వంటిప్రైవేటు క్యాబ్ సంస్థలకు చెక్‌పెడుతూ ప్రత్యామ్నాయంగా దేశవ్యాప్తంగా డ్రైవర్లకు ఆర్థిక సాధికారత కల్పించే లక్ష్యంతో భారత్ ట్యాక్సీ వస్తోంది. ప్రస్తుతం ఢిల్లీ, గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతాల్లో ప్రారంభిం చారు. సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ ఈ సేవలు ప్రారంభించింది. బీటా యూజర్లతో ట్రయల్‌రన్‌కూడా ప్రారంభించారు. ప్రపంచంలోనే అతిపెద్ద డ్రైవర్ యజమా నిగా ఉన్న నెట్‌వర్క్‌గా భారత్ ట్యాక్సీ ఎదుగుతుందని చెపుతున్నారు. ఇప్పటికే 51 వేలమందికిపైగా డ్రైవర్లను ఈప్లాట్‌ఫామ్‌పైకి తీసుకువచ్చారు. భారత్ ట్యాక్సీ మొబైల్‌యాప్‌ప్రస్తుతం గూగుల్‌ప్లేస్టోర్‌లో ట్రయల్ అండ్ ఫీడ్‌బ్యాక్‌కోసం అందుబాటులో ఉంచారు. ఐఒఎస్ వెర్షన్‌కూడా త్వరలోనే విడుదలచేస్తున్నారు. ఆప్‌ను భారత్ ట్యాక్సీడ్రైవర్‌పేరుతో సహకార్ ట్యాక్సీ కోఆపరేటివ్ విడుదలచేసింది. యాప్‌ను ఢిల్లీ మెట్రోతో అనుసంధానంచేసారు. ప్రయాణీకులు మెట్రో, క్యాబ్‌సేవలు ఒకే యాప్‌లో బుక్‌చేసుకుని మొత్తం ప్రయాణం చేసుకునే వీలుంది. మల్టీమోడల్ రవాణాను సులభతరంచేస్తుందని సహకార్‌సంస్థ వెల్లడించింది.



# మారుతి సుజుకినుంచి సరికొత్త ఇ-విటారా

**న్యూఢిల్లీ, డిసెంబరు 3:** కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ తన తొలి ఎలక్ట్రిక్ వాహనమైన ఇ-విటారాను ప్రదర్శించింది. వచ్చే ఏడాది దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్న ఈ కారుపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన ఈ కారు సింగిల్ చార్జింగ్‌తో 543 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. దేశవ్యాప్తంగా 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పబోతున్నట్టు మారుతి సుజుకీ ఇండియా ఎండీ, సిఇఒ హిసాచీ తకేచి తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14